బుధవారం
19•2•2020
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 235
• పేజీలు : 12 + 16 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

మన రాష్ట్రం • మన పత్రిక

# నమస్తే తెలంగాణ

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

WWW.NTNEWS.COM
/NTDAILYONLINE







# పట్నాలు కళకళలాడాలి

## దేశంలోకెల్లా ఆదర్శ పట్టణాలు, నగరాలుగా మార్చాలి • అధికారులు, ప్రజాప్రతినిధులదే ఆ బాధ్యత

**మేయర్లు, చైర్‌పర్సన్లకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశం**

- పల్లెప్రగతి పునాదిగా 24 నుంచి పట్టణప్రగతి
- దళితవాడల నుంచే కార్యక్రమాలు మొదలుపెట్టాలి
- మూడునెలల్లో సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలి
- ఎనిమిది నెలల్లో కరంటు సమస్యలకు పరిష్కారం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టబోయే పట్టణప్రగతి కార్యక్రమంతో పట్టణాలు, నగరాలు కళకళలాడాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశంలోకెల్లా ఆదర్శ పట్టణాలు, నగరాలుగా మార్చే గురుతర బాధ్యత మేయర్లు, చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లదేనని చెప్పారు. పల్లెప్రగతి పునాదిగా ఈ నెల 24 నుంచి పట్టణప్రగతి కార్యక్రమం నిర్వహించాలని, ప్రజాప్రతినిధులు, అధికారులు చేపట్టే కార్యక్రమాలను పేదలు ఎక్కువగా నివసించే దళితవాడల నుంచే ప్రారంభించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు ఎక్కువగా ఉండే ప్రాంతాలపై దృష్టిపెట్టాలని తెలిపారు. వార్డులవారీగా పట్టణప్రగతి ప్రణాళిక తయారుచేసుకొని, దానికి అనుగుణంగా పనులు చేసుకుంటూ వెళ్లాలన్నారు. నిధుల వినియోగంలో కచ్చితమైన క్రమశిక్షణ పాటించాలని, ప్రణాళిక ప్రకారమే వ్యయంచేయాలని సూచించారు. మూడునెలల్లో అన్ని పట్టణాలు, నగరాల్లో పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం పూర్తి చేయాలని, ఎనిమిది నెలల్లో కరంటు సంబంధిత సమస్యలన్నింటికీ పరిష్కారం చూపాలని ఆదేశించారు. లేనిపక్షంలో సంబంధిత ఎమ్మెల్యేలు, మేయర్లు, చైర్‌పర్సన్లు, కమిషనర్లు బాధ్యత వహించి, పదవుల నుంచి తప్పుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పల్లెప్రగతి కార్యక్రమం సమీక్షించటానికి మండల పంచాయతీ అధికారులు గ్రామాల్లో పర్యటించాల్సి ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేలు, కలెక్టర్లు తమ పరిధిలోని గ్రామాల్లో రాత్రి బసచేసి, గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించి, పల్లెప్రగతి లక్ష్యాలను సాధించాలని కోరారు. మంగళవారం ప్రగతిభవన్‌లో కార్పొరేషన్ల మేయర్లు, కౌన్సిలర్లు, మున్సిపాలిటీల చైర్‌పర్సన్లు, కార్పొరేటర్లతో ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రస్థాయి మున్సిపల్ సదస్సు

మిగతా 2వ పేజీలో



మంగళవారం ప్రగతిభవన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి మున్సిపల్ సదస్సులో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుతో మాట్లాడుతున్న పట్టణాభివృద్ధి, ఐటీశాఖల మంత్రి కే తారకరామారావు. చిత్రంలో మంత్రులు మహమూద్‌అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్ గౌడ్

- పల్లెప్రగతిపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు
- తేడావస్తే ఎవరైనా పదవుల నుంచి తప్పుకోవాల్సిందే
- ఎమ్మెల్యేలు, కలెక్టర్లు గ్రామాల్లో రాత్రి బసచేయాలి
- అన్ని మున్సిపాలిటీల్లో మరోసారి క్రమబద్ధీకరణ
- మున్సిపల్ సదస్సులో ముఖ్యమంత్రి కేసీఆర్



బయోఏషియా సదస్సు సందర్భంగా జీనోమ్ వ్యాలీ అవార్డు అందుకున్న నోవార్టిస్ సీఈవో వాస్ నర్సింహన్. చిత్రంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్

# ఔషధరంగ గమ్యస్థానం

## హైదరాబాద్‌పై కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ ప్రశంస

- త్వరలో జాతీయస్థాయిలో విస్తృతసమావేశం
- అద్భుత మార్కెటింగ్ నైపుణ్యమున్న నేత కేటీఆర్
- జాతీయ రాజకీయాల్లోకి ఆయన వస్తే బాగుంటుంది
- బయోఏషియా సదస్సులో కేంద్ర మంత్రి వ్యాఖ్యలు

**ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఔషధరంగంలో పరిశోధనలు, జీవవైవిధ్య సాంకేతిక పరిజ్ఞానాభివృద్ధిలో దేశానికే హైదరాబాద్ గమ్యస్థానంగా ఉన్నదని కేంద్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖల మంత్రి పీయూష్‌గోయల్ ప్రశంసించారు. ఔషధరంగ పరిశ్రమలకు పన్నుల రాయితీల విషయంలో త్వరలో జాతీయస్థాయిలో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేయనున్నట్టు వెల్లడించారు. జాతీయస్థాయిలో ఫార్మారంగంలో అద్భుత ఆవిష్కరణలు చోటుచేసుకుంటున్నాయని, త్వరలో విప్లవాత్మక మార్పులు

మిగతా 4వ పేజీలో

# చరిత్ర తెలుసుకో కిషన్!

## 1870లోనే నిజాంస్టేట్ రైల్వే వ్యవస్థ ఏర్పాటు • 1907లో నాంపల్లి, 1916లో కాచిగూడ రైల్వేస్టేషన్
## ఆ సమయంలో అనేక రాష్ట్రాలకు రైలంటేనే తెలియదు • 1966లో నిజాంస్టేట్ రైల్వే.. దక్షిణమధ్య రైల్వేగా మార్పు



నాంపల్లి రైల్వే స్టేషన్ పాత చిత్రం

- మోదీ వచ్చేవరకు రాష్ట్రానికి ఎర్రబస్సే దిక్కనడం అజ్ఞానమే
- ఢిల్లీ మెప్పుకోసం పుట్టినగడ్డను కించపరిచేలా వ్యాఖ్యలా!
- కిషన్‌రెడ్డి వ్యాఖ్యలపై మండిపడుతున్న తెలంగాణవాదులు
- సెటైర్లతో కేంద్ర సహాయమంత్రిని ఆటాడుకున్న నెటిజన్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

నాలుగు వందల ఏండ్ల ఘన చరిత్ర కలిగిన హైదరాబాద్‌లో 1870లోనే నిజాం స్టేట్ రైల్వేవ్యవస్థ మొదలైంది. 1907లో నాంపల్లి రైల్వేస్టేషన్, 1916లో కాచిగూడ రైల్వేస్టేషన్ ఏర్పాటయ్యాయి. అనేక రాష్ర్టాల్లో రైల్వే వ్యవస్థ అంటే తెలియని రోజుల్లోనే తెలంగాణ ప్రాంతంలో రైలుకూత వినిపించింది. అలాంటి తెలంగాణకు ఆరేండ్ల కిందట మోదీ ప్రధాని అయ్యేవరకు రైలంటే తెలియదని సాక్షాత్తూ కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడటంపై విమర్శలు వెల్లువెత్తాయి. 'రైల్వే అంటే తెలంగాణ ప్రజలకు తెల్వదు. ఎర్రబస్సు తప్ప నో రైల్వేస్ ఇన్ తెలంగాణ ఏరియా. కేవలం ఎర్రబస్సు మాత్రమే ఎక్కే అలవాటుండేది. నరేంద్రమోదీ ప్రభుత్వం వచ్చాకే అనేక కొత్త రైళ్లను ప్రారంభించారు' అని మంగళవారం చర్లపల్లిలో శాటిలైట్ రైల్వేస్టేషన్ నిర్మాణపనుల అనంతరం కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. హైదరాబాద్ కేంద్రంగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన కిషన్‌రెడ్డి హ్యాట్రిక్ ఎమ్మెల్యే. అసెంబ్లీలో బీజేపీ పక్ష నేత. మూడుసార్లు గెలిచిన స్థానం నుంచి గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరమైన ఓటమి! సానుభూతి కనబర్చిన ప్రజలు వెనువెంటనే వచ్చిన ఎంపీ ఎన్నికల్లో పట్టంకట్టి తలెత్తుకొనేలా చేస్తే ఏకంగా కేంద్రమంత్రి అయ్యారు! కానీ కిషన్‌రెడ్డి మాత్రం

మిగతా 7వ పేజీలో

**పీఆర్సీ గడువు పొడిగింపు**

3




| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 54.00 | రిటైల్ లైవ్ | 76.00 |
| డ్రెస్డ్ | 110.00 | స్కిన్‌లెస్ | 125.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 365.00 | రంగారెడ్డి | 365.00 |
| మెదక్ | 365.00 | కరీంనగర్ | 368.00 |
| వరంగల్ | 368.00 | డజన్ ధర | 60.00 |

# మున్సిపల్ కమిషనర్ల బదిలీలు

## వెయిటింగ్‌లోఉన్న 21 మందికి పోస్టింగులు • పురపాలకశాఖ ఉత్తర్వులు

**హైదరాబాద్,నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలో భారీ ఎత్తున మున్సిపల్ కమిషనర్ల బదిలీలు జరిగాయి. వెయిటింగ్‌లో ఉన్న పలువురికి పోస్టింగులు లభించాయి. 14 మందిని బదిలీ చేయగా.. వెయిటింగ్‌లో ఉన్న 21 మంది అధికారులకు పోస్టింగులు ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అర్వింద్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. జీహెచ్‌ఎంసీలో నలుగురు డిప్యూటీ కమిషనర్లకు పోస్టింగులిచ్చారు. వీరిలో ఇద్దరిని పురపాలకశాఖ కమిషనర్ కార్యాలయానికి పంపారు. మరో ఇద్దరిని వివిధ హోదాల్లో నియమించారు. కొత్తగా ఏర్పాటైన అనేక మున్సిపాలిటీల్లో ఇప్పటివరకు ఇంచార్జి కమిషనర్ల ద్వారా పరిపాలన కొనసాగింది. మున్సిపల్ ఎన్నికలు ముగిశాక రాష్ట్రప్రభుత్వం పట్టణాల్లో సమస్యల పరిష్కారానికి పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి, మున్సిపాలిటీలను అభివృద్ధి దిశగా పయనింపజేసే క్రమంలో అన్ని మున్సిపాలిటీలకు కమిషనర్లను నియమించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఈ మేరకు చర్యలు చేపట్టింది.

వివరాలు 4వ పేజీలో

# కొవిడ్‌కు దవాఖాన డైరెక్టర్ బలి

## వైరస్ సోకి వుచాంగ్ దవాఖాన డైరెక్టర్ లియూ చిమింగ్ మృతి

## చైనాలో 1,868కి చేరిన మృతులు.. 72,436 మందికి వైరస్ నిర్ధారణ

5





మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో జరిగే మహాజాతరకు రావాల్సిందిగా సీఎం కే చంద్రశేఖర్‌రావును దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆహ్వానించారు. మంగళవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసిన ఆయన ఆహ్వానపత్రికను అందజేశారు. మంత్రితోపాటు స్థానిక ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్, ఆలయ ఈవో కృష్ణవేణి, పూజారులు ఉన్నారు. పురపాలక, ఐటీశాఖల మంత్రి కేటీ ఆర్‌కు కూడా ఆహ్వానపత్రిక అందజేశారు.



ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకొని సీఎం పీఆర్వో రమేశ్ హజారీ ఆరుసంఖ్యకు తాత్విక భూమికనిస్తూ రచించిన 'ఆరు ఆరు అరవయ్యారు- ఆత్మగల్ల కేసీఆరు' అనే పాట సీడీని సీఎం కేసీఆర్ మంగళవారం ప్రగతిభవన్‌లో ఆవిష్కరించారు. ఈ పాటను టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కర్నాటి విద్యాసాగర్ రూపొందించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, మండలిలో విప్ కర్నె ప్రభాకర్, టీఎస్‌ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



# పట్నాలు కళకళలాడాలి

మొదటిపేజీ తరువాయి...

నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చేయాల్సిన, చేయించాల్సిన పనులపై దిశానిర్దేశం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రవర్తన ఎలా ఉండాలో వివరించారు. భర్తృహరి సుభాషిత పద్యం చదివి, అర్థం చెప్పి కార్యోన్ముఖులను చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగం ఆయన మాటల్లోనే..



ప్రగతిభవన్‌లో మంగళవారం నిర్వహించిన పట్టణ ప్రగతి సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు మహమూద్ అలీ, కేటీఆర్, ఈటల, తలసాని, కొప్పుల, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అజయ్, నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, మల్లారెడ్డి, హరీశ్‌రావు, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, సీఎస్ సోమేశ్‌కుమార్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, పురపాలకశాఖ కమిషనర్ అర్వింద్‌కుమార్ ఉన్నారు.

### వార్డులవారీగా ప్రణాళిక

పట్టణంలో వార్డులవారీగా ప్రణాళిక తయారుచేయాలి. ప్రతి పట్టణానికి వార్షిక, పంచవర్ష ప్రణాళిక తయారుకావాలి. కౌన్సిలర్/కార్పొరేటర్లతో కలిసి కలెక్టర్, అదనపు కలెక్టర్ ఈ ప్రణాళికను రూపొందించాలి. వార్డులవారీగా నియామకమైన ప్రజాసంఘాల అభిప్రాయా లు తీసుకోవాలి. ప్రతివార్డుకు శాశ్వత ప్రాతిపదికన స్పెషల్ ఆఫీసర్‌ను నియమించాలి. వార్డులో ఏమి ఉన్నాయి? ఏమి లేవు? ఇంకా ఏమి కావాలి? ఏమిచేయాలి? అనేదానిపై ఎక్స్‌రే తీసుకుని కచ్చితంగా నిర్ధారించుకోవాలి. పట్టణంలో ఉండాల్సిన కనీస పౌర సదుపాయాలేమిటో నిర్ధారించుకుని, వాటిని కల్పించటానికి ప్రాధాన్యమివ్వాలి. పట్టణ ప్రజలకు, పట్టణాలకు వచ్చే ప్రజలకు అవసరమైనన్ని పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలి. ఇందుకు ప్రభుత్వస్థలాలను వినియోగించాలి. ఏ పట్టణానికి ఎన్ని టాయిలెట్లు అవసరం.. ఎక్కడ నిర్మించాలో నిర్ధారించుకుని మూడునెలల్లో వా టి నిర్మాణం పూర్తిచేయాలి. వీధుల్లో వ్యాపారం చేసుకునే స్ట్రీట్ వెండర్స్ కోసం అన్ని పట్టణాల్లో స్ట్రీట్‌వెండింగ్ జోన్లు ఏర్పాటుచేసి.. వాటిల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి. ప్రత్యేకస్థలం కేటాయించేవరకు వారికి ఇబ్బంది కలుగకుండా ప్రభుత్వం తగు ఆదేశాలు ఇస్తుంది. ఆటోలు, ట్యాక్సీలు, ఇతర ప్రజారవాణా వాహనాలు, సరుకురవాణా వాహనాలను నిర్దిష్టమైన ప్రదేశాల్లో పార్క్‌చేయడానికి సదుపాయం కల్పించాలి. వీటన్నింటికోసం ప్రభుత్వస్థలాలను వినియోగించే అధికారం కలెక్టర్లకు ప్రభుత్వం కల్పిస్తుంది.

### ఎనిమిది నెలల్లో ప్రమాదరహిత విద్యుత్ వ్యవస్థ

పట్టణాల్లో ప్రమాదరహిత విద్యుత్‌వ్యవస్థ తయారుకావాలి. వంగిన, తుప్పుపట్టిన, రోడ్డుమధ్యలోని విద్యుత్ స్తంభాలు, ఫుట్‌పాత్‌లపై ఉండే ట్రాన్స్‌ఫారాలను మార్చాలి. పొట్టి స్తం భాల స్థానంలో పెద్దస్తంభాలు వేసి.. ఇండ్లపై వేలాడే వైర్లను సరిచేయాలి. ఈ పనులన్నీ చేయడానికి అవసరమైన నిధులను ఈసారి బడ్జెట్‌లో కేటాయిస్తాం. ఎమ్మెల్యేలు, అధికారులు సమన్వయంతో ఎనిమిదినెలల్లో కరం టు సంబంధిత సమస్యలన్నింటినీ పరిష్కరించాలి. లేనట్లయితే దానికి వారే బాధ్యత వహించాలి. కావాల్సిన స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫారాలను విద్యుత్ అధికారులు ముందుగానే సమకూర్చి, ఆయా పట్టణాలకు పంపించాలి.

### అభివృద్ధికి ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నిధులు

పట్టణాలకు ప్రతినెలా రూ.148 కోట్ల చొప్పున ఆర్థికసంఘం నిధులు అందిస్తాం. ఇతర ఖర్చులు తగ్గించుకుని అయినాసరే, గ్రామాల అభివృద్ధికి వెచ్చిస్తున్నట్టే.. పట్టణాల అభివృద్ధికి నిధులు అందజేస్తాం. ఈ నిధుల వినియోగంలో క్రమశిక్షణ ఉండాలి. ప్రతి మున్సిపాలిటీ ఆర్థికప్రణాళిక రూపొందించుకోవాలి. తప్పనిసరిగా చేయాల్సిన ఖర్చును చార్టెడ్ అకౌంట్‌గా నిర్దేశించుకోవాలి. అప్పులకు సంబంధించిన కిస్తీలు, ఉద్యోగుల జీతభత్యాలు, కరంటు బిల్లులు, మంచినీటి బిల్లులు ప్రతినెలా కచ్చితంగా చెల్లించాలి. ఇది కమిషనర్ల బాధ్యత. ఆర్థిక ప్రణాళిక రూపొందించేటప్పుడే పదిశాతం నిధులను పచ్చదనం పెంచడానికి కేటాయించాలి. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల అభివృద్ధి నిధులను కూడా పట్టణాల ప్రగతికి వినియోగించాలి. తెలంగాణను సంపూర్ణ అక్షరాస్యత రాష్ట్రంగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని ప్రభుత్వం త్వరలోనే చేపడుతుంది. ఇందులో కౌన్సిలర్లు, కార్పొరేటర్లు బాధ్యత తీసుకోవాలి. ఎవరికివారు పూనుకొని తమ ప్రాంతంలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలి.

### చెట్లు పెంచే బాధ్యత కౌన్సిలర్లు, కార్పొరేటర్లదే

పల్లెల్లో సర్పంచ్‌ల మాదిరిగా పట్టణాల్లో చెట్లు పెంచే బాధ్యతను కౌన్సిలర్లు, కార్పొరేటర్లు స్వీకరించాలి. పెట్టిన మొక్కల్లో 85% బతికే బాధ్యతను వారు తీసుకోవాలి. ఆయా పట్టణాలకు అవసమైనన్ని నర్సరీలను ఏర్పాటు చేయా లి.పట్టణంలో జాగాలేకుంటే సమీప గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటుచేయాలి. ప్రతి ఇంటికి తడి, పొడి చెత్త వేయడానికి బుట్టలు పంపిణీచేయాలి. ఇండ్ల నుంచి చెత్తసేకరణకు అవసరమైనన్ని వాహనాలు సమకూర్చుకోవాలి. రాష్ట్రవ్యాప్తంగా 3,100 వాహనాలు తీసుకోవాలని నిర్ణయించాం. ఇప్పటికే 600 వాహనాలు వ చ్చాయి. మిగతావి త్వరలోనే వస్తాయి. ఇంకా అవసరం ఉన్న పట్టణాల్లో మరికొన్ని కొనుగోలు చేయాల్సి ఉన్నది. డ్రైనేజీలు శుభ్రంచేయడానికి అనేకరకాల మిషన్లు అందుబాటులోకి వచ్చాయి. వాటిని ఏర్పాటుచేసుకోవాలి.

### అక్రమ నిర్మాణాల కూల్చివేత

కొత్త మున్సిపల్ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సీఎం కేసీఆర్ అన్నారు. అక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇండ్ల నిర్మాణం, లేఅవుట్ విషయం లో సులభమైన అనుమతుల విధానం తెచ్చామని, ప్రజలపై నమ్మకం ఉంచామని అన్నా రు. 'ఎవరైనా తప్పుడు సమాచారం ఇచ్చినా, అక్రమ నిర్మాణాలు చేపట్టినా కఠినచర్యలు తీసుకుంటాం.. అక్రమ నిర్మాణాలను నిర్దాక్షిణ్యంగా కూల్చేస్తాం' అని ప్రజలకు స్పష్టంగా చెప్పాలని సూచించారు. జీవో నంబరు 58, 59 ద్వారా గతంలో పట్టణాల్లో ప్రభుత్వస్థలాల్లో నిర్మించిన ఇండ్లను క్రమబద్ధీకరించినట్టే.. అన్ని మున్సిపాలిటీల్లో మరో అవకాశం ఇచ్చే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని తెలిపారు. సదస్సులో మంత్రులు, ఎమ్మెల్యేలు, సీఎస్ సోమేశ్‌కుమార్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, డీజీపీ మ హేందర్‌రెడ్డి, మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి అర్వింద్‌కుమార్, పట్టణ పరిపాలన కమిషనర్ సత్యనారాయణ, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

### అవినీతిరహిత వ్యవస్థ ఉండాలి

**మున్సిపాలిటీ** అంటేనే మురికికి, చెత్తకు పర్యాయపదంగా మారింది. అవినీతికి మారుపేరు అయింది. 'బల్దియా.. ఖాయా పీయా చల్దియా' అనే సామెతలు వచ్చాయి. ఆ చెడ్డపేరు పోవాలంటే పారదర్శకమైన విధానాలు అవలంబించాలి. అవినీతిరహిత వ్యవస్థ ఉండాలి. పట్టణప్రగతి ప్రణాళికాబద్ధంగా ఉండాలి. అడ్డదిడ్డంగా ఎటుపడితే అటుకాదు. అది మీ చేతుల్లోనే ఉన్నది.

### మంచి పట్టణం లక్షణాలు ఇవే

'మంచి పట్టణం అంటే ఏమిటి? ఎలా ఉండాలి? అనేది ఎవరికివారు ప్రశ్నించుకోవాలి. దానికి సమాధానాలు వెతుక్కుంటే ఏమిచేయాలో బోధపడుతుంది. ప్రతిరోజూ చెత్తను, మురుగును నిర్మూలించి పరిశుభ్రంగా ఉంచాలి. శుద్ధమైన మంచినీరు సరఫరా కావాలి. వీధిలైట్లు బాగా వెలగాలి. రహదారులపై గుంతలు, బొందలు, గోతులు ఉండకూడదు. పట్టణం పచ్చదనంతో కళకళలాడాలి. చెత్త నిర్మూలనకు డంప్‌యార్డులు ఉండాలి. చనిపోయినవారిని గౌరవంగా సాగనంపేందుకు దహనవాటికలు/ ఖననవాటికలు ఉండాలి. పట్టణ జనాభాను అనుసరించి పరిశుభ్రమైన వెజ్, నాన్‌వెజ్, ఫ్రూట్, ఫ్లవర్ మార్కెట్లు ఏర్పాటుచేయాలి. పట్టణంలోని యువతకు అవసరమైన క్రీడా ప్రాంగణాలు, ఓపెన్ జిమ్‌లు ఉండాలి' ఇవీ ఒక మంచి పట్టణం లక్షణాలు అని సీఎం తెలిపారు.

## సంకల్పం ఉంటే వందశాతం విజయం

### మేయర్లు, చైర్‌పర్సన్లతో ముఖాముఖిలో సీఎం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మున్సిపల్ సదస్సులో భాగంగా సీఎం కేసీఆర్ మేయర్లు, చైర్‌పర్సన్లతో ముఖాముఖి నిర్వహించారు. 'మీ కర్తవ్యాన్ని నిర్వహించడంలో మీరు విజయాన్ని సాధించాలి. ప్రజాజీవితంలో అనేకరకాల అనుభవాలుంటాయి. దేశంలో, రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయాలు చాలా సులభమైపోయాయి. ఒకప్పుడు రాజకీయాలంటే కష్టంతో, త్యాగంతో కూడుకున్నవి. బ్రిటిష్ వలసపాలన తర్వాత స్వతంత్ర భారతంలో సౌకర్యవంతమైన రాజకీయాలు వచ్చాయి. అప్పట్లో ఆత్మార్పణ, త్యాగం అయితే నేడు స్వేచ్ఛాభారతంలో ఉన్నాం. జాతి నిర్మాణరంగంలో మనమంతా మమేకమైపోయాం. అధికారం, హోదా వచ్చినాక మనిషి మారకూడదు. లేని గొప్పతనాన్ని, ఆడంబరాన్ని తెచ్చుకోవద్దు. ఐదుకోట్ల మందిలో 140 మందికే మేయర్లు, చైర్‌పర్సన్లు అయ్యే అవకాశం వచ్చింది. దీన్ని ఒక ముందడుగుగా స్వీకరించి, సానుకూలంగా మార్చుకోగలిగితే ప్రజాజీవితంలో ఎంతముందుకైనా పోవచ్చు. పదవి అసిధారావ్రతం (కత్తిమీద సాము) లాంటిది. ప్రజాజీవితం అంత సులభంకాదు. సోయి తప్పి పనిచేయవద్దు. చాలా కష్టపడి రాష్ట్రం తెచ్చుకున్నాం. మన రాష్ట్రంవస్తే మనం బాగుపడుతామని ప్రబలంగా పోరాడాం. ప్రజలు నన్ను రెండుసార్లు సీఎంను చేశారు. నా వరకైతే గెలిచేంతవరకే రాజకీయం, తర్వాత కాదు. ప్రభుత్వ పథకాల అమలు చూస్తే అది అర్థం అవుతుంది. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ లాంటి పథకాలు అన్నిగ్రామాల్లో వివక్షలేకుండా అమలుచేశాం. ప్రజలంతా మనవాళ్లే అనుకున్నాం. ఏ పనిచేయాలన్నా తదేక దీక్షతో చేయాలి. అవగాహనతో అర్థం చేసుకుని, చేయాలని అనుకుంటేనే బాధ్యత తీసుకోవాలి. పట్టుదల ఉంటేనే విజయం సాధిస్తారు. మీ మీద ప్రజలకు నమ్మకం కలుగాలి. అలా ఒక్కసారి నాయకుడి మీద విశ్వాసం కలిగితే, ప్రజలు సంపూర్ణంగా సహకరిస్తారు. ప్రజాశక్తిని మనం సమీకృతం చేయగలిగితే గొప్ప ఫలితాలు సాధిస్తాం. ఇప్పుడు ఎన్నికైన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులే రేపటి నాయకులు అవుతారు. మీరంతా ధీరులు కావాలి. సంకల్పం గట్టిగా ఉంటే వందశాతం విజయం సాధిస్తారు' అని ముఖ్యమంత్రి చెప్పారు.

### పక్కా ప్లానింగ్ ఉండాలి

'ప్రజాప్రతినిధులు డంబాచారాలు పలకవద్దు. అన్ని పనులు ఓవర్‌నైట్‌లో చేసేస్తాం అని మాట్లాడొద్దు. సమగ్ర కార్యాచరణను రచించుకుని రంగంలోకి దిగాలి. అందరినీ కలుపుకునిపోయి పట్టణాలను తీర్చిదిద్దాలి' అని సీఎం కేసీఆర్ ఉద్బోధించారు. ఫొటోలకు ఫోజులివ్వడం తగ్గించి, పనులు చేయించడం పై దృష్టి పెట్టాలన్నారు. 'ఆరునెలలు కష్టపడితే పట్టణాలు మంచి దారిపడతాయి. ప్రగతి నిరోధక శక్తులు ఎప్పుడూ ప్రతిబంధకంగా ఉం టూ నే ఉంటాయి. వాటిని అధిగమించాలి. ఎప్పు డూ ఇతరదేశాల విజయగాథలు వినడమే కాదు. మనమూ విజయం సాధించాలి. మన పట్టణాలను మనమే మార్చుకోవాలి' అని చెప్పారు.

### భర్తృహరి సుభాషితంతో..

**ఆరంభింపరు నీచ మానవులు విఘ్నాయాస సంత్రస్తులై**
**యారంభించి పరిత్యజించుదురు విఘ్నాయత్తులై మధ్యముల్**
**ధీరుల్ విఘ్ననిహన్య మానులగుచు ధ్రుత్యున్నతోత్సాహులై**
**ప్రారబ్ధార్థము లుజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధులల్ గావునన్**

**ఏదైనా** పని మొదలుపెట్టినపుడు ఎన్ని అడ్డంకులు ఎదురయినా వెరువక తుదికంటా లక్ష్యం కోసం శ్రమించడమే కార్యసాధకుడి నైజం. అలాంటివారు ఉత్తములు. ఎప్పుడో ఎదురయ్యే అడ్డంకులను తలచుకుని ఏ పనీ చేపట్టనివారు అధములు. ఏదో చెయ్యాలన్న తపనతో మొదలుపెట్టినప్పటికీ మధ్యలో ఆటంకాలు ఎదురవగానే వదిలేసేవారు మధ్యములు.. అంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ చివరిగా భర్తృహరి సుభాషితంలోని పద్యం చదివి, దాని అర్థంచెప్పారు. మేయర్ల, చైర్‌పర్సన్లు, అధికారులు అనుకున్న లక్ష్యం సాధించి, ఉత్తములుగా నిలువాలని ఆకాంక్షిస్తూ సదస్సును ముగించారు.







మంగళవారం ప్రగతిభవన్‌లో నిర్వహించిన పట్టణ ప్రగతి సదస్సుకు హాజరైన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, మున్సిపల్ చైర్మన్లు, చైర్‌పర్సన్లు, డిప్యూటీ చైర్మన్లు, కౌన్సిలర్లు, అధికారులు

**ముహూర్తం**

సూర్యోదయం: 6.41 గంటలకు

సూర్యాస్తమయం: 6.11 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, కృష్ణపక్షం ఏకాదశి మధ్యాహ్నం 3.03 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: మూల ఉదయం 6.07 వరకు, తదుపరి పూర్వాషాఢ, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: మధ్యాహ్నం 12.27 నుంచి 1.52 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.04 నుంచి 12.50 వరకు, వర్జ్యం: సాయంత్రం 4.15 నుంచి 5.56 వరకు.

## గజ్వేల్ అభివృద్ధి అద్భుతం

- మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ల బృందం కితాబు
- సమీకృత మార్కెట్, వైకుంఠధామం, అర్బన్‌పార్క్ పరిశీలన
- సీఎం సహకారంతో తమ ప్రాంతాలను బాగుచేస్తామని ధీమా
- అభివృద్ధి చేసిన తీరును వివరించిన మంత్రి హరీశ్‌రావు

**సంగారెడ్డి, సిద్దిపేట ప్రతినిధులు, నమస్తే తెలంగాణ:** ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధిని చూసి ప్రజాప్రతినిధులు, అధికారులు ఆశ్చర్యపోయారు. ఇక్కడి అభివృద్ధి అద్భుతమని కొనియాడారు. దేశానికే గజ్వేల్ దశదిశ చూపుతున్నదని అభిప్రాయపడ్డారు. సీఎం కేసీఆర్ సహకారంతో తమప్రాంతాల్లో ఇదే తరహాలో అభివృద్ధి చేసుకుంటామని ధీమా వ్యక్తంచేశారు. పట్టణప్రగతిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వెజ్-నాన్‌వెజ్ మార్కెట్లు, వైకుంఠధామాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మంగళవారం మంత్రులు ఈటల, జగదీశ్‌రెడ్డి, సత్యవతిరాథోడ్, ప్రశాంత్‌రెడ్డి, సబిత, అజయ్, గంగుల, కొప్పుల, ఇంద్రకరణ్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌తో పాటు ఆయా జిల్లాల ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు మంగళవారం ప్రగతిభవన్ నుంచి నేరుగా బస్సుల్లో గజ్వేల్ సమీకృత మార్కెట్, వైకుంఠధామం, సంగాపూర్‌లోని కల్పకవనం, వర్గల్ మండలంలోని సింగాయిపల్లి అటవీప్రాంతాన్ని పరిశీలించారు. గజ్వేల్‌కు వచ్చినవారికి మంత్రి హరీశ్‌రావు, కలెక్టర్ వెంకట్రామిరెడ్డి 400 గొల్లభామ చీరలను అందించి స్వాగతం పలికారు. మార్కెట్, వైకుంఠధామాల నిర్మాణ వివరాలను అందించారు. 200 ఎకరాల అటవీప్రాంతాన్ని హరితహారంలో అభివృద్ధి చేసినట్టు మంత్రి హరీశ్‌రావు వివరించారు. 'సీఎం కేసీఆర్ సారు మంచి సౌలత్‌తో మార్కెట్‌యార్డు నిర్మించారు. మంచి గిరాకీ ఉన్నది. మిగిలిన సరుకు చెడిపోకుండా ఉండేందుకు శీతలగిడ్డంగి ఏర్పాటుచేశారు' అని మార్కెట్‌లో వ్యాపారులు బృందం ఎదుట సంతోషం వ్యక్తంచేశారు. పార్కును తలపించే వైకుంఠధామం, సంగాపూర్‌లోని కల్పకవనంలో ఓపెన్‌జిమ్, నర్సరీ, గచ్చిబౌలి, రాశి, నక్షత్రవనంను బృందం ఆసక్తిగా పరిశీలించింది.

### అంతర్జాతీయస్థాయిలో అభివృద్ధి

దేశంలో ఏక్కడా లేనివిధంగా రూ.22.85 కోట్ల వ్యయంతో గజ్వేల్‌లో 6.24 ఎకరాల విస్తీర్ణంలో సమీకృత మార్కెట్ నిర్మించారు. గత ఏడాది నవంబర్‌లో సీఎం కేసీఆర్ దీన్ని ప్రారంభించారు. మార్కెట్‌యార్డును ఆరువిభాగాలుగా చేసి విక్రయదారుల కోసం 246 స్టాళ్లను ఏర్పాటుచేశారు. మూడు బ్లాకుల్లో కూరగాయలు, రెండు బ్లాకుల్లో పూలు, పండ్లు, ఒక బ్లాకు మాంసం విక్రయానికి కేటాయించారు. నిత్యావసర వస్తువులు అక్కడే లభించేలా 16 వాణిజ్య దుకాణాలను, సూపర్‌మార్కెట్, తాగునీరు అందించేందుకు కోసం మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేశారు. రోడ్లపై ఉండే కూరగాయల దుకాణాలు మార్కెట్‌లోకి రావడంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తగ్గింది. పుట్టిన ప్రతి మనిషి చనిపోయాక చివరికి వల్లకాటికే వెళతారు. సొంతవారి అంత్యక్రియలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవడానికి గజ్వేల్‌లో రూ.2.20 కోట్ల వ్యయంతో అంత్యక్రియలు, కర్మకాండ నిర్వహణకు వైకుంఠధామాన్ని నిర్మించారు. ఉద్యాన వనాలు, స్నానపు గదులు ఏర్పాటుచేశారు.

### గజ్వేల్ అభివృద్ధి ఆదర్శం: మంత్రి హరీశ్‌రావు

త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న పట్టణ ప్రగతికి గజ్వేల్ అభివృద్ధి ఆదర్శంగా నిలుస్తుందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. శాస్త్రీయంగా, అవసరాలకు తగ్గట్టుగా సౌకర్యవంతంగా అందుబాటులోకి తీసుకురావడానికి సీఎం కేసీఆర్ స్వయంగా రూపకల్పన చేశారని చెప్పారు. రాష్ట్రంలోని 90 పట్టణాల్లో అర్బన్‌పార్కులు ఏర్పాటుచేసుకోవడానికి అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. గజ్వేల్ అభివృద్ధిని పరిశీలించేందుకు వచ్చిన బృందానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

**లోకం పోకడ**







గజ్వేల్‌కు వచ్చిన సందర్భంగా మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులకు గొల్లబామ చీరలను అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు



మాంసం అమ్మకాల గురించి ఆరా తీస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో విప్ గువ్వల బాలరాజు, ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు.



గజ్వేల్ సమీకృత మార్కెట్లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు







జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని లక్ష్మీబరాజ్ పూర్తిస్థాయి సామర్థ్యానికి చేరడంతో సముద్రాన్ని తలపిస్తున్నది. లక్ష్మీపంప్‌హౌజ్ నుంచి సరస్వతి (అన్నారం) బరాజ్‌కు నీటిని గ్రావిటీ కెనాల్ ద్వారా తరలించే దృశ్యాన్ని చూసేందుకు సందర్శకులు తరలివస్తున్నారు.

- ఫొటోలు: మధు బండి



# వైద్యరంగంలో జీనోమ్‌తో కొత్తశకం

- హైదరాబాద్‌లో ఇన్నోవేషన్‌కు మంచి అవకాశాలు: నోవార్టిస్ సీఈవో వాస్ నర్సింహన్
- బయోఏషియా- 2020 సదస్సులో జీనోమ్ వ్యాలీ అవార్డు స్వీకరణ


బయోఏషియా సదస్సుకు హాజరైన ప్రతినిధులతో రాష్ట్ర మంత్రి కేటీఆర్. చిత్రంలో కేంద్రమంత్రి పీయూష్‌గోయల్, నోవార్టిస్ సీఈవో వాస్ నర్సింహన్ తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇన్నోవేషన్‌రంగంలో హైదరాబాద్ అద్భుతమైన ప్రాంతమని, మంచి అవకాశాలున్నాయని నోవార్టిస్ సీఈవో వాస్ నర్సింహన్ అన్నారు. బయోఏషియా సదస్సులో భాగంగా మంగళవారం ఆయన కేంద్ర వాణిజ్యశాఖమంత్రి పీయూష్‌గోయల్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా జీనోమ్‌వ్యాలీ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా నర్సింహన్ మాట్లాడుతూ.. వైద్యరంగంలో జీనోమ్ విధానం కొత్తశకానికి నాంది పలికిందన్నారు. హైదరాబాద్ కేంద్రంగా డిజిటల్ వైద్యరంగంలో పనిచేస్తున్నామని, డిజిటల్ టెక్నాలజీ సర్వీసెస్‌ను విస్తరించాల్సి ఉన్నదని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లో ఇప్పటికే 6 వేల మంది ఉద్యోగులు నోవార్టిస్ కంపెనీలో పనిచేస్తున్నారని తెలిపారు. హైదరాబాద్‌లోని కార్యాలయం ప్రపంచంలోనే రెండో అతిపెద్దదని.. ఇందులో తమ సంస్థలో కీలకపాత్ర పోషిస్తున్నదన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపారు. వైద్యరంగంలో నూతన ఆవిష్కరణలు అవసరమని, చికిత్సల్లో ఇంకా మెరుగైన విధానాలు రావాల్సి ఉన్నదని చెప్పారు. తాను పుణె యూనివర్సిటీలో చదివానని, తల్లిదండ్రులు భారత్‌కు చెందినవారేనని.. తాతది ఏపీలోని తిరుపతి అని నర్సింహన్ వివరించారు. డిజిటల్ ఇండియా ఇన్నోవేషన్‌లో భాగంగా బయోమి ఇండియాను ఏషియాలోనే తొలిసారిగా హైదరాబాద్‌లో ఏర్పాటుచేయనున్నట్టు ప్రకటించారు.

### కేటీఆర్.. మరోసారి మోడరేటర్

బయోఏషియా సదస్సులో మంగళవారం సీఈవోల ప్యానల్ డిస్కషన్‌కు రాష్ట్రమంత్రి కేటీఆర్ సమన్వయకర్తగా వ్యవహరించారు.కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాత కంపెనీల సీఈవోలు పాల్గొన్న చర్చాగోష్ఠికి కేటీఆర్ మోడరేటర్‌గా వ్యవహరించారు. అందరినీ సమన్వయపరుస్తూ.. ప్రతి అంశంపై పూర్తి విషయపరిజ్ఞానంతో వ్యవహరిస్తూ అందరినీ ఆశ్చర్యపరిచారు. ఏ అంశంపై ఎవరిని ప్రశ్నించాలనే దానిపై చక్కటి సమయస్ఫూర్తిని ప్రదర్శించారు. కేంద్రమంత్రి సహా సీఈవోల నుంచి అభినందనలను అందుకున్నారు. గతంలో 2017 ప్రపంచ పారిశ్రామికవేత్తల సమ్మిట్ సందర్భంగానూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూతురు ఇవాంక ట్రంప్ హాజరైన సదస్సుకు కూడా కేటీఆర్ మోడరేటర్‌గా వ్యవహరించి ప్రపంచం దృష్టిని ఆకర్షించారు. విషయం ఏదైనా దానిపై పూర్తి పట్టు సాధించి, చర్చలో పాల్గొనేవారికి సంబంధించిన విషయంపై పూర్తి అవగాహనతో వ్యవహరించడంలో ఆయనకు ఆయనే సాటిఅని కేటీఆర్ మరోసారి నిరూపించారు.

### కంపెనీల సీఈవోలతో కేటీఆర్ భేటీ

బయో ఏషియా సదస్సులో రెండోరోజు మంత్రి కేటీఆర్ పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు. నోవార్టిస్ సీఈవో వాస్ నర్సింహన్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలో నోవార్టిస్ విస్తరణ వీరిద్దరి మధ్య చర్చకు వచ్చినట్టు సమాచారం. బయోమి డిజిటల్ ఇన్నోవేషన్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటుచేయాలనే నర్సింహన్ నిర్ణయాన్ని మంత్రి స్వాగతించారు. ఎమర్జింగ్ మార్కెట్స్ హ్యూమన్ హెల్త్ ప్రెసిడెంట్ జాన్‌వాన్‌యాకర్‌తో కేటీఆర్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించి లైఫ్‌సైన్సెస్ రంగంలో యూనిట్ ఏర్పాటుచేయాలని కోరారు.

## ఫార్మారంగానికి పూర్తిసహకారం

కంపెనీల సీఈవోలతో పీయూష్‌గోయల్, కేటీఆర్ భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బయోఏషియా సదస్సుకు హాజరైన కేంద్రమంత్రి పీయూష్‌గోయల్, రాష్ట్రమంత్రి కేటీఆర్ ఫార్మా సీఈవోల రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఫార్మా కంపెనీల సమస్యలను మంత్రులకు వారు వివరించారు. పర్యావరణ అనుమతులకు సంబంధించి, దిగుమతులు, ఎగుమతులు, చైనాలో కరోనాతో పరిశ్రమ ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించారు. పెద్దఎత్తున ఉపాధి కల్పిస్తున్న ఈ రంగంపై కేంద్రప్రభుత్వం ఉదారంగా వ్యవహరించాలని కోరారు. వారి సమస్యలపై కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ సానుకూలంగా స్పందించినట్టు సమాచారం. రాష్ట్రప్రభుత్వపరంగా ఫార్మారంగానికి పూర్తి సహకారం ఉంటుందని మంత్రి కేటీఆర్ భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో కేంద్ర వాణిజ్యశాఖ సహాయమంత్రి సోమ్‌ప్రకాశ్, ఫార్మా పరిశ్రమల ప్రతినిధులు సతీష్‌రెడ్డి, కేంద్ర వాణిజ్యశాఖ సంయుక్త కార్యదర్శి సుమిత్రా దావ్రా, రాష్ట్ర ఐటీ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ తదితరులు పాల్గొన్నారు.

# పీఆర్సీ గడువు పొడిగింపు

డిసెంబర్ 31 వరకు పెంచుతూ ఉత్వర్వులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వేతన సవరణ సంఘం (పీఆర్సీ) గడువును ప్రభుత్వం ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

# ద్రాక్ష సాగు విస్తరణపై దృష్టి

ఈ ఏడాది వంద ఎకరాల్లో పైలట్ ప్రాజెక్టుకు ప్రణాళికలు

ప్రభుత్వానికి ఉద్యానశాఖ ప్రతిపాదనలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో అంతరించి పోతున్న ద్రాక్ష పంట విస్తరణపై ఉద్యానశాఖ దృష్టి సారించింది. ఈ ఏడాది వంద ఎకరాల్లో పైలట్ ప్రాజెక్టుగా సాగుచేసేందుకు ప్రణాళికలు రూపొందించింది. మెదక్, రంగారెడ్డి, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలు ద్రాక్షసాగుకు అనుకూలమైనవిగా ఉద్యానశాఖ గుర్తించింది. ప్రస్తుతం 400-500 ఎకరాల్లో ద్రాక్ష సాగు జరుగుతున్నది. అయితే రాష్ట్ర అవసరాలకు గాను మరో రెండు వేల ఎకరాల్లో సాగు చేయాల్సిన అవసరమున్నదని అధికారులు చెప్తున్నారు. ద్రాక్ష సాగుకు అనుకూలంగా ఉన్న జిల్లాల్లో ఔత్సాహిక రైతులను ఎంపికచేసి సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహించాలని ఉద్యానశాఖ అధికారులు నిర్ణయించారు. 40 శాతం సబ్సిడీ ఇస్తే ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు 100 ఎకరాల్లో ప్రాజెక్టు సాగుచేసేందుకు అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి ఉద్యానశాఖ కమిషనర్ ఎల్ వెంకట్రామిరెడ్డి అందజేశారు. ద్రాక్ష సాగుకు ఎర్రనేలలు, సారవంతమైన నేతలు అవసరమని రాజేంద్రనగర్‌లోని ద్రాక్ష పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ జీ రాంరెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 15 నుంచి మార్చి 30 వరకు సాగుచేయాలని, మొక్కలను మహారాష్ట్రలోని పండరీపురం నుంచి సరఫరా చేసుకొంటున్నామని చెప్పారు. రాష్ట్రంలో నల్లరకంలో కిస్‌మిస్ చార్మి, బ్లాక్‌బ్యూటీ రకాలు, పచ్చరకంలో మానిక్‌చమన్, థామ్సన్ సీడ్‌లెస్ రకాలు అనుకూలమైనవని గుర్తించినట్టు తెలిపారు. ద్రాక్ష సాగుకు ఒకసారి స్ట్రక్చర్ నిర్మిస్తే 20 ఏండ్ల వరకు ఉపయోగపడుతాయని, ఎకరాకు రూ.4 లక్షల వరకు పెట్టుబడి ఉంటుందని, ఏటా రూ.5-8 లక్షల దిగుబడి సాధించవచ్చని వివరించారు.

**JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY HYDERABAD**
KUKATPALLY, HYDERABAD - 500085, TELANGANA, INDIA.

**TS EAMCET-2020 NOTIFICATION**

**Telangana State Engineering, Agriculture and Medical Common Entrance Test being conducted on behalf of TSCHE**

A Computer Based Common Entrance Test, designated as Telangana State Engineering, Agriculture and Medical Common Entrance Test-2020 **(TS EAMCET-2020)** of **Telangana State** will be conducted by JNTUH for entry into the professional courses offered for the academic year **2020-21** in the State of **Telangana**. The TS EAMCET-2020 test will be conducted in **ONLINE mode only**. Eligible candidates who wish to apply for **TS EAMCET-2020** have to submit their applications through **ONLINE mode ONLY from 21-02-2020 to 30-03-2020 (without late fee)**. Detailed information regarding Syllabi, List of courses, Procedure for Online Application with/without late fee and Computer Based Test etc., is given in the **Detailed Notification & Instruction Booklet** that is available in the website **https://eamcet.tsche.ac.in**

**Date, Time and Registration Fee of the Test:**

| Stream | Date | Time | Registration Fee |
|---|---|---|---|
| Engineering (E) | 04-05-2020<br>05-05-2020<br>07-05-2020 | 10 AM to 1 PM<br>&<br>3 PM to 6 PM | Rs. 400/- (for SC/ST & PH candidates for E or AM)<br>Rs. 800/- (for Others for E or AM) |
| Agriculture & Medical (AM) | 09-05-2020<br>11-05-2020 | 10 AM to 1 PM<br>&<br>3 PM to 6 PM | Rs. 800/- (for SC/ST & PH candidates for both E & AM)<br>Rs. 1600/- (for Others for both E & AM) |

The Registration fee has to be paid at TSOnline Centers in T.S., APOnline Centers in A.P. or through online using Credit card / Debit card / Net banking.

**Note: This is only a Notification for Computer based entrance test. Candidate has to fulfill the eligibility criteria laid down in the relevant G.O.s at the time of admission.**

Hyderabad
Date : 19.02.2020

Sd/-
CONVENER, TS EAMCET-2020

# ఆవిష్కరణలకు వేదిక బయోఏషియా

కొత్త మార్గాల అన్వేషణలో యువ పరిశోధకులు

సమస్యలకు సరికొత్త పరిష్కారాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌లో జరుగుతున్న బయోఏషియా సదస్సు నూతన ఆవిష్కరణలకు వేదికగా నిలుస్తున్నది. మారిన జీవనశైలితో పుట్టుకొస్తున్న కొత్త తరహా వ్యాధులకు యువ పరిశోధకులు తమ ఆవిష్కరణలతో అడ్డుకట్ట వేస్తున్నారు. సదస్సులో దేశ, విదేశీ ప్రతినిధులు వారి ఆలోచనలను పంచుకుంటున్నారు. మన రాష్ట్రంలోని పలు పరిశోధనా సంస్థలు, విద్యాసంస్థల నుంచి ఔత్సాహికులు పాల్గొని నూతన ఆవిష్కరణల గురించి ఆసక్తిగా తెలుసుకుంటున్నారు. వివిధ దేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన 75కుపైగా స్టార్టప్ కంపెనీలు పాల్గొని వారి ఆవిష్కరణలను ప్రదర్శించాయి. టుడే ఫర్ టుమారో నినాదంతో జరుగుతున్న ఈ సదస్సు బుధవారం కూడా కొనసాగనున్నది.


బయోఏషియా సదస్సుకు హాజరైన వివిధ సంస్థల ప్రతినిధులు



### మొబైల్ ఫోన్‌లో హార్ట్ బీట్

గుండెభద్రంగా ఉన్నదని చెప్పడం ఎవరివల్ల కాదు. అకస్మాత్తుగా వస్తున్న గుండె జబ్బుల వల్ల ఎంతో మంది ప్రాణాలు వదులుతున్నారు. వేగంగా చికిత్స అందించడం వల్ల ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని వైద్యులు సూచిస్తుంటారు. దీనికి అనుగుణంగానే అద్వైత్ హోమ్ హెల్త్ కంపెనీ హార్ట్ బీట్ పేరిట నూతన ఆవిష్కరణ చేసింది. బ్లూటూత్ ఉండే ఈసీజీ డివైజ్ ధరించడం వల్ల 24 గంటలపాటు గుండెను మానిటర్ చేయడం సాధ్యమవుతుంది. రోగి మొబైల్, వైద్యుడి మొబైల్‌కి ఇది అనుసంధానమై ఉండటం వల్ల ఈసీజీ, హార్ట్ బీట్‌ని రియల్ టైం మానిటరింగ్ చేయడం సులభమవుతుంది. సమస్యలెదురైతే తక్షణం వైద్యుడి నుంచి సలహాలు పొందడం లేదా చికిత్సపొందటం సులువవుతుందని కంపెనీ ప్రతినిధి తారక్ నాగరాజ్ తెలిపారు.

### రక్త నమూనా లేకుండా ఐరన్ పరీక్ష




పేద, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఎంతోమంది రక్తహీనతతో బాధపడుతుంటారు. ముఖ్యంగా చిన్నారులు, మహిళల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. ఐరన్ శాతం ఎంతుందో తెలుసుకోవాలంటే రక్త నమూనా సేకరించి పరీక్షించాల్సి ఉంటుంది. ఫెర్సోసెన్స్ లైట్‌మెజర్స్ కంపెనీ ఎఫ్ఐడీ స్క్రీన్ పేరిట రూపొందించిన డివైజ్ వల్ల రక్త నమూనా సేకరించకుండానే కేవలం 20 సెకన్లలో ఐరన్ శాతం ఎంతుందో తెలుసుకోవచ్చు. డివైజ్‌లోని చిన్న భాగాన్ని పెదవి కింది భాగంలో పెట్టుకోవటం వల్ల ఐరన్ శాతాన్ని గుర్తించవచ్చని జర్మనీకి చెందిన కార్మన్ కొబ్జా తెలిపారు.

### పర్యావరణహిత సిరంజీ






కాఫీ కప్ భూమిలో కలిసేందుకు 30 ఏండ్లు, ప్లాస్టిక్ బ్యాగ్ కలిసేందుకు 20 ఏండ్లు పట్టినట్టే.. సిరంజీలు భూమిలో కలిసేందుకు దాదాపు ఐదేండ్ల సమయం పడుతుంది. భూకాలుష్యానికి ఇది కూడా ఓ కారణం. గ్రీన్ గోల్డ్ ఇండస్ట్రీస్ పర్యావరణహిత సిరంజీని ఆవిష్కరించింది. మూడునెలల్లోనే భూమిలో కలిసిపోయేలా దీన్ని రూపొందించింది. ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుతున్నట్టే వ్యాధులు విస్తరిస్తున్నాయని, ఇదేక్రమంలో చికిత్సలో భాగంగా వినియోగించే సిరంజీల సంఖ్య విపరీతంగా పెరిగిపోతున్నదని కంపెనీ ప్రతినిధి పర్వీజ్ తెలిపారు.

# కరోనాపై అప్రమత్తత అవసరం

- దేశమంతా నిర్ధారణ కేంద్రాలు ఏర్పాటుచేయాలి
- బయోఏషియా సదస్సులో శాస్త్రవేత్తల సూచన



బయోఏషియా సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ పీటర్ పియట్, డాక్టర్ కార్ల్‌జూన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఊహించని విధంగా విజృంభిస్తున్న కరోనా(కొవిడ్-19)పై అన్నిదేశాలు అప్రమత్తంగా ఉండాలని పలువురు శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. వైరస్ వ్యాప్తి పై అవగాహన కల్పించడం, ప్రత్యేక చికిత్స వంటి జాగ్రత్త తీసుకోవటం ద్వారా అడ్డుకోవచ్చని సూచించారు. సార్స్, ఎబోలా, బర్డ్‌ఫ్లూ వంటి వైరస్‌లను గతంలో చూశామని, కొత్త తరహా వైరస్‌లు వ్యాప్తిచెందుతున్న నేపథ్యంలో నిరోధించే దిశగా పరిశోధన, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. హైదరాబాద్‌లో జరుగుతున్న బయోఏషియా సదస్సులో భాగంగా రెండోరోజు మంగళవా రం.. ఎరా ఆఫ్ లివింగ్ మెడిసిన్ ఫ్రం పిల్స్ టు సెల్ అండ్ జీన్ థెరపీ అంశంపై పెన్సిల్వేనియాకు చెందిన డాక్టర్ కార్ల్‌జూన్, కార్-టీ థెరపీ-బ్రింగింగ్ ఇండివిజువలైజేషన్ థెరపీ టు మా సెస్ అంశంపై బయోకాన్ సీఎండీ కిరణ్ మజుందార్‌షా మాట్లాడారు. భారత్‌లోని అన్ని రాష్ట్రాల్లో కరోనా నిర్ధారణ పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేయాలని సూచించారు. యూకేలోని గ్లోబల్ హెల్త్ ప్రొఫెసర్ డాక్టర్ పీటర్ పియట్ మాట్లాడుతూ.. ముందస్తు సంసిద్ధత మాత్రమే వైరస్ వ్యాప్తిని అడ్డుకొంటుందని తెలిపారు. అన్నిదేశాలపై కరోనా ప్రభావం ఉన్నదని, భారతదేశ మార్కెట్‌పై ఇప్పటికే దాని ప్రభావం కనిపిస్తున్నదన్నారు. ఇందులో భాగంగా లైఫ్‌సైన్సెస్ క్వీన్స్‌ల్యాండ్-ఆస్ట్రేలియా, అసోసియేషన్ ఆఫ్ బయోటెక్నాలజీ లెడ్ ఎంటర్‌ప్రైజెస్ మధ్య ఒప్పందం కుదిరింది.

### చైనాపై ఆధారపడొద్దు



ఫార్మాతోపాటు ఇతరరంగాల్లో చైనాపై అధారపడటం సరికాదు. అన్నిరంగాల్లో జాగ్రత్తలు పాటించాలి. అతిపెద్ద సంక్షోభాన్ని చైనా ఎదుర్కొంటున్న క్రమంలో మన దేశంలోకి వచ్చే వస్తువులు తగ్గి మార్కెట్‌పై ప్రభావం పడుతున్నది. మొబైల్‌ఫోన్ల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. చైనా దిగుమతులపై నియంత్రణ ఉండటం అవసరం. భారత్‌కు ఎన్నో అవకాశాలున్నాయి. ఫార్మారంగంలో చైనాకు దాసోహం అన్నట్టుగా గత ప్రభుత్వాలు ఉన్నాయి. ఇంకా ఆధారపడి ఉండటం అవసరం లేదు.

**- కిరణ్ మజుందార్‌షా, సీఎండీ, బయోకాన్**



## పౌరసత్వ నిరూపణకు భూమి, బ్యాంకు పత్రాలు చెల్లవు

గువహటి హైకోర్టు వెల్లడి




**గువహటి, ఫిబ్రవరి 18:** పౌరసత్వ నిరూపణకు బ్యాంకు, భూమి పత్రాలు పనికిరావని గువహటి హైకోర్టు స్పష్టం చేసింది. అసోంలో నిర్వహించిన జాతీయ పౌర జాబితాలో దాదాపు 19 లక్షల మంది భారతీయులు కాదన్న విషయం వెల్లడైన సంగతి తెలిసిందే. అయితే వీరంతా తాము భారతీయులమేనని నిరూపించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం విదేశీ ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో జాబెదా బేగం అలియాస్ జాబెదా ఖాతున్ అనే మహిళ విదేశీ ట్రిబ్యునల్‌లో పిటిషన్ దాఖలు చేశారు. తన తండ్రి, తన భర్త పేరిట గ్రామ అధికారులు జారీ చేసిన గుర్తింపు పత్రాలతోపాటు మరికొన్ని పత్రాలను ఆమె ట్రిబ్యునల్‌లో సమర్పించారు. అయితే వీరిద్వారా తనకు ఉన్న బంధాన్ని నిరూపించే పత్రాలను మాత్రం సమర్పించ లేదు. దీన్ని గుర్తించిన ట్రిబ్యునల్ ఆమె పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో ఆమె హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం విదేశీ ట్రిబ్యునల్ నిర్ణయాన్ని సమర్థించింది. 'పౌరసత్వ నిరూపణకు పాన్‌కార్డు, బ్యాంకు పత్రాలు పనికిరావని 2016లో ఇదే హైకోర్టు తీర్పిచ్చింది. ఇదే సమయంలో భూమి పత్రాలు కూడా పౌరసత్వ నిరూపణకు పనికిరావు' అని ధర్మాసనం పేర్కొంది. మరో కేసులో విచారణ జరిపిన ఇదే ధర్మాసనం ఓటరు గుర్తింపుకార్డులు కూడా పౌరసత్వ నిరూపణకు పనికిరావని వెల్లడించింది.

## అయోధ్యలో ఆ స్థలాన్ని వదిలిపెట్టండి!

- నాటి బాబ్రీ మసీదు వద్ద ఉన్న శ్మశానాన్ని అలాగే కొనసాగించండి
- రామాలయ ట్రస్టుకు ముస్లింల తరఫు న్యాయవాది లేఖ

**అయోధ్య, ఫిబ్రవరి 18:** సనాతన ధర్మాన్ని పాటించాలని, కూల్చివేతకు గురైన బాబ్రీ మసీదు వద్ద ఉన్న ఐదెకరాల శ్మశానాన్ని వదిలివేయాలని సుప్రీంకోర్టు న్యాయవాది ఎంఆర్ శంషాద్ కోరారు. ఈ మేరకు ముస్లింల తరఫున అభ్యర్థిస్తూ శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు ఆయన లేఖ రాశారు. 1885లో జరిగిన అల్లర్లలో మరణించిన 75 మంది ముస్లింల సమాధులు బాబ్రీ మసీదు పరిసరాల్లో ఉన్నాయని, ఈ శ్మశానవాటికను 'గంజ్ షహీదాన్'గా పేర్కొంటారని తెలిపారు. 'కేంద్రం ధర్మాన్ని విస్మరించింది. ముస్లింల శ్మశానవాటికలో రామాలయ నిర్మాణాన్ని చేపట్టడం ఏమేరకు న్యాయమన్న ప్రశ్నలను పట్టించుకోవడంలేదు. ముస్లింల సమాధులపై రామాలయ నిర్మాణాన్ని చేపట్టవచ్చా? ఇందుకు 'సనాతన ధర్మం' అనుమతిస్తుందా? అన్నది మీరు పరిశీలించండి. ఆ మేరకు ట్రస్ట్ నిర్వాహకులు నిర్ణయం తీసుకోవాలి' అని ఆ లేఖలో పేర్కొన్నారు.

## అష్రఫ్‌కు మరోసారి ఆఫ్ఘనిస్థాన్ పగ్గాలు



**కాబూల్:** ఆఫ్ఘనిస్థాన్ అధినేతగా అష్రఫ్ ఘనీ మరోసారి అధికార పగ్గాలు చేపట్టనున్నారు. గతేడాది సెప్టెంబర్ 28న జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఆయన గెలిచినట్టు ఆ దేశ ఎన్నికల సంఘం పేర్కొంది. ఈ మేరకు మంగళవారం తుది ఫలితాలను వెల్లడించింది. 'ఆఫ్ఘనిస్థాన్ ప్రజలకు సేవలందించేందుకు దేవుడు ఆయనకు సహాయం చేయాలి. దేశంలో శాంతి నెలకొనాలని ప్రార్థిస్తున్నా' అని ఎలక్షన్ కమిషన్ అధిపతి హవా ఆలం నూరిస్తానీ తెలిపారు. కాగా, ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని అష్రఫ్ ఘనీ ప్రధాన ప్రత్యర్థి, ఆఫ్ఘన్ ముఖ్య కార్యనిర్వాహకుడు అబ్దుల్లా అబ్దుల్లా ఆరోపించారు. రీకౌంటింగ్ జరుపాలని ఆయన ఒత్తిడి చేయడంతో ఐదు నెలలు ఆలస్యంగా ఫలితాలు వెలువడ్డాయి. కాగా, మోసపూరిత ఫలితాలను అంగీకరించబోమని అబ్దుల్లా బృందం ఇటీవల తెలిపింది. సమాంతర ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని అబ్దుల్లా మద్దతుదారుడు, ప్రస్తుత ఉపాధ్యక్షుడు అబ్దుల్ రషీద్ దోస్తమ్ హెచ్చరించారు.



## కశ్మీర్‌లో ఆర్థిక, మానసిక సంక్షోభం!

మెహబూబా ముఫ్తీ కుమార్తె ఇల్తిజా ఆందోళన



**న్యూఢిల్లీ:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసిన అనంతరం ఈ ఏడు నెలల కాలంలో జమ్ముకశ్మీర్‌లో 'ఆర్థిక, మానసిక, భావోద్వేగ' సంక్షోభం నెలకొన్నదని జమ్ముకశ్మీర్ మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ కుమార్తె ఇల్తిజా ముఫ్తీ వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 370 అనేది తక్కిన భారతదేశంతో జమ్ముకశ్మీర్‌కు ఉన్న 'భావోద్వేగ సంబంధం' అని, దాన్ని తెంచేయడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని చెప్పారు. మంగళవారం ఇల్తిజా మీడియాతో మాట్లాడారు. కశ్మీరీల పరిస్థితులపై మోదీ సర్కారు దుష్ప్రచారం చేస్తున్నదని ఆమె ఆరోపించారు. కశ్మీర్‌లో పర్యటించే విదేశీ ప్రతినిధులకు, తక్కిన భారత ప్రజలకు తాము సమాన హక్కులను అనుభవిస్తున్నామని చెప్తున్నారని, కానీ ప్రస్తుతం కశ్మీర్‌లో వీపీఎన్ (వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్స్) వాడే పరిస్థితి కూడా లేదన్నారు. 1989లో కశ్మీరీ పండిట్లు లోయను విడిచి వెళ్లడంపై ఆమె స్పందిస్తూ.. అది అత్యంత బాధాకరమైన ఘటన అని చెప్పారు. నాటి ఘటనపై బహిరంగంగా క్షమాపణ చెబుతున్నానన్నారు. 'హిందూ పాకిస్థాన్' దిశగా భారత్ పయనిస్తున్నదని ఆమె పేర్కొన్నారు.

## 'తత్కాల్'ను కొల్లగొడుతున్న 60 మంది అరెస్ట్

**న్యూఢిల్లీ:** అక్రమ సాఫ్ట్‌వేర్ ద్వారా తత్కాల్ టికెట్లను కొల్లగొడుతున్న 60 మంది ఏజెంట్లను రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు అరెస్టు చేశారు. దీంతో ఇకపై మరిన్ని తత్కాల్ టికెట్లు రైలు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం తత్కాల్ టికెట్ల బుకింగ్ ప్రారంభమైన కొద్ది సేపటికే టికెట్లు అయిపోతున్నాయి. దీనికి ప్రధాన కారణం కొందరు ఏజెంట్లు అక్రమ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి టికెట్లను బ్లాక్ చేయడం లేదా వేగంగా టికెట్లను బుకింగ్ చేసుకోవడం చేస్తున్నారు. సాధారణంగా ఒక వ్యక్తి టికెట్ బుకింగ్ ప్రక్రియ పూర్తవడానికి 2.55 నిమిషాల సమయం పడుతుంది. కానీ కొందరు ఏజెంట్లు అక్రమ సాఫ్ట్‌వేర్లను ఉపయోగించి ఈ ప్రక్రియను 1.48 నిమిషాల్లోనే పూర్తి చేస్తున్నారు. దీంతో బుకింగ్ ప్రారంభమైన నిమిషాల్లోనే తత్కాల్ టికెట్లు అయిపోతున్నాయి. దీన్ని గుర్తించిన ఆర్పీఎఫ్ అధికారులు అక్రమ సాఫ్ట్‌వేర్లను కనిపెట్టి తొలిగించడంతోపాటు 60 మంది ఏజెంట్లను అరెస్టు చేశారు. వీరిలో ఒకడికి బంగ్లాదేశ్‌కు చెందిన ఓ ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్నాయని అధికారులు అనుమానిస్తున్నారు.

## 14 మంది ఊపిరితీసిన విషవాయువు

పాకిస్థాన్‌లో ఘటన

**కరాచీ:** పాకిస్థాన్‌లో అంతుచిక్కని విషవాయువు లీకేజీ వల్ల 14 మంది మరణించారు. పలువురు అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం రాత్రి కరాచీలోని కేమరి ప్రాంతంలో విషవాయువును పీల్చిన ప్రజలు ఊపిరి ఆడకపోవడంతో సమీప దవాఖానాలకు పరుగు తీశారు. ఈ విషయం అధికారులకు తెలియడంతో వెంటనే దవాఖానాలకు వెళ్లి పరిశీలించగా.. 14 మంది మరణించినట్లు డాక్టర్లు చెప్పారు. మరోవైపు పౌరుల మరణానికి అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ పలువురు ఆందోళనకు దిగారు. పోలీసులు మాట్లాడుతూ ఇది ఏ విషవాయువు.. ఎక్కడి నుంచి వస్తుందన్న దానిపై ఇప్పటికీ స్పష్టత లేదని చెప్పారు. ఇంకోవైపు అధికారులు స్పందిస్తూ ఓ నౌక నుంచి సోయాబీన్ లేదా ఆ కోవకు చెందిన వస్తువులను దించుతున్నప్పుడు ఈ విషవాయువు వెలువడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.

# ముప్పు ముంగిట పక్షిజాతులు



- ప్రమాదానికి అత్యంత చేరువలో 146 జాతులు
- 'స్టేట్ ఆఫ్ ఇండియాస్ బర్డ్స్ 2020' నివేదికలో వెల్లడి

**గాంధీనగర్:** దేశంలోని పక్షి జాతుల మనుగడకు ముప్పువాటిల్లుతున్నది. 50 శాతానికిపైగా పక్షుల జాతులు దీర్ఘకాలిక ప్రమాదంలో ఉన్నాయని, మరో 146 జాతులు స్వల్పకాలిక ప్రమాదానికి అత్యంత చేరువలో ఉన్నట్టు తేలింది. దాదాపు 867 పక్షి జాతులపై చేసిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. ఈ ఆందోళనకర నిజాలను 'స్టేట్ ఆఫ్ ఇండియాస్ బర్డ్స్-2020' నివేదిక వెల్లడించింది. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో వలస జాతుల వన్యప్రాణుల పరిరక్షణపై ఐక్య రాజ్యసమితి ఆధ్వర్యంలో జరుగుతున్న 'కాప్ (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్)' 13వ సదస్సు సందర్భంగా సోమవారం ఈ నివేదికను విడుదల చేశారు. మిగతా పక్షి జాతులతో పోలిస్తే.. వలస సముద్ర పక్షులు, స్థానిక పక్షులు గత కొన్ని దశాబ్దాలుగా ఎక్కువగా ప్రభావితమయ్యాయని నివేదిక పేర్కొంది. గత 25 ఏండ్ల కాలంలో.. దాదాపు 261 జాతుల్లోని పక్షుల్లో 52% పక్షులు క్షీణించాయని.. స్వల్పకాలిక సమయంలో దాదాపు 146 జాతుల్లో 80% పక్షులు క్షీణించాయని.. ఇది ఇంకా కొనసాగుతున్నదని నివేదిక పేర్కొంది. జీవవైవిధ్యానికి పుట్టినిల్లుగా పరిగణించే ప్రాంతాల్లో ఒకటైన పశ్చిమ కనుమలలో పక్షుల సంఖ్య 2000 సంవత్సరం నుంచి దాదాపు 75 శాతం తగ్గిందని వెల్లడించింది. జాతీయ పక్షి నెమలి జాతిలో అనూహ్య పెరుగుదల కనిపించిందని, ఇది సానుకూల అంశమని పేర్కొన్న నివేదిక.. నగరాల్లో పిచ్చుకల జనాభాలో గణనీయంగా క్షీణత కనిపిస్తున్నదని తెలిపింది.

## చెల్లుబాటయ్యే వీసా ఆమె దగ్గర లేదు

- అందుకే డెబ్బీ అబ్రహమ్స్‌ను అడ్డుకున్నాం
- లండన్‌లోని భారత హైకమిషన్ వెల్లడి

**లండన్:** ఆర్టికల్ 370 రద్దు విషయంలో మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబట్టిన బ్రిటిష్ ఎంపీ డెబ్బీ అబ్రహమ్స్‌ను దేశంలోకి ప్రవేశించకుండా ఢిల్లీ విమానాశ్రయ అధికారులు అడ్డుకోవడంపై భారత్ వివరణ ఇచ్చింది. చెల్లుబాటు అయ్యే వీసాను కలిగిలేనందునే సోమవారం ఢిల్లీకి చేరుకున్న డెబ్బీ అబ్రహమ్స్‌ను అధికారులు అడ్డుకున్నారని లండన్‌లోని భారత హైకమిషన్ కార్యాలయం వెల్లడించింది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మరోవైపు, డెబ్బీ అబ్రహమ్స్ ఈ-వీసాను రద్దు చేస్తున్నట్టు ఆమెకు ముందుగానే సమాచారమిచ్చినట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఫిబ్రవరి 14నే ఆమె వీసాను రద్దు చేస్తున్నట్లు తెలిపామని చెప్పాయి. ఒకరికి వీసా ఇవ్వడం/రద్దు చేయడం అనేది ఒక దేశ సార్వభౌమాధికారమని పేర్కొన్నాయి. భారత ప్రయోజనాలను దెబ్బతీసేలా డెబ్బీ అబ్రహమ్స్ వ్యవహరించారనే కారణంతో వీసాను రద్దు చేశామని తెలిపాయి.

## పీవోకేలో 'ఫుల్లు'గా ఉగ్ర శిబిరాలు

భారత్‌లోకి పంపేందుకు పాక్ సైన్యం కుయుక్తులు

గట్టిగా బుద్ధిచెప్తామన్న భారత ఆర్మీ అధికారి ధిల్లాన్



**శ్రీనగర్:** పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని ఉగ్రవాద శిబిరాలన్నీ ముష్కరమూకలతో నిండి ఉన్నాయని సీనియర్ ఆర్మీ కమాండర్, కశ్మీర్‌లో 15 కార్ప్స్ స్ట్రాటజిక్ కమాండ్‌కు నేతృత్వం వహిస్తున్న లెఫ్టినెంట్ జనరల్ కన్వల్‌జీత్ సింగ్ ధిల్లాన్ తెలిపారు. కాల్పుల విరమణ ఉల్లంఘనల మాటున వారిని భారత్‌లోకి పంపేందుకు పాక్ సైన్యం చేస్తున్న ప్రయత్నాలకు గట్టిగా జవాబిస్తామని ఆయన స్పష్టం చేశారు. కశ్మీర్‌లోయలోకి ఉగ్రవాదులను పంపి శాంతిని భగ్నం చేసేందుకు పాక్ చేస్తున్న ప్రయత్నాలు సఫలీకృతం కాబోవన్నారు. కశ్మీర్‌లోయలో భద్రతాబలగాలు పౌరసమాజ నాయకులతోపాటు వివిధ భాగస్వాములతో కలిసి శాంతిని పటిష్ఠం చేశాయన్నారు. త్వరలో ఢిల్లీలోని ఆర్మీ హెడ్‌క్వార్టర్స్‌లో పోస్టింగ్‌కు వెళ్లనున్న ధిల్లాన్ గతేడాది ఫిబ్రవరిలో స్ట్రాటజిక్ కమాండ్‌లో చేరారు. ఆ బాధ్యతలు చేపట్టి వారం తిరక్కుండానే గతేడాది ఫిబ్రవరి 14న పుల్వామాలో జరిగిన ఆత్మాహుతి దాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు మరణించడంతో ధిల్లాన్‌కు తొలి నుంచే పెనుసవాళ్లు మొదలయ్యాయి. పీటీఐ వార్తా సంస్థ అడిగిన ఓ ప్రశ్నకు ఆయన లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ.. భారత్‌పై పాక్ కొనసాగిస్తున్న పరోక్ష యుద్ధం గురించి మాట్లాడారు. పాక్ మూడు దశాబ్దాల నుంచి భారత్‌లోకి చొరబాట్లను ప్రోత్సహిస్తున్నదన్నారు. ఓవైపు నియంత్రణ రేఖ వెంబడి నిఘాను కొనసాగిస్తూనే మరోవైపు ప్రజలతో స్నేహపూర్వక ధోరణిలో ఉగ్రవాద వ్యతిరేక చర్యలు చేపడుతుండటంతో కశ్మీర్‌లోయలో పరిస్థితి మెరుగుపడిందని ధిల్లాన్ తెలిపారు.

## సీరియల్ కిల్లర్ మోహన్‌కు జీవిత ఖైదు

- 19వ హత్యకేసులో మంగళూరు కోర్టు తీర్పు
- 20 మంది యువతులపై లైంగికదాడి చేసి 'సైనైడ్'తో అంతం
- ఐదు కేసుల్లో ఉరిశిక్ష, మరో మూడు కేసుల్లో జీవిత కారాగారం



**మంగళూరు, ఫిబ్రవరి 18:** సీరియల్ కిల్లర్ మోహన్‌కు మరో హత్యకేసులో జీవిత కారాగార శిక్ష పడింది. 2006లో కేరళలోని కాసర్గోడ్ జిల్లాకు చెందిన 23 ఏండ్ల యువతిపై లైంగికదాడి జరిపి అనంతరం 'సైనైడ్' మాత్రతో హత్య చేసిన కేసుకు సంబంధించి కర్ణాటకలోని మంగళూరు కోర్టు తీర్పు ఇచ్చింది. ఆరో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి సయీదున్నీసా, దోషికి జీవిత ఖైదుతోపాటు రూ. 25 వేల జరిమానా విధించారు. బాధితురాలి తల్లికి ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూడాలని జిల్లా న్యాయ సేవల అథారిటీకి సూచించారు. మోహన్‌పై 20 హత్య కేసులు నమోదుకాగా 19వ హత్య కేసులో కోర్టు ఈ మేరకు తీర్పు ఇచ్చింది. అతడు 20 మంది యువతులపై లైంగికదాడి చేసి అనంతరం 'సైనైడ్' పూత పూసిన మాత్ర ఇచ్చి హతమార్చాడు. 2009లో బంట్వాల్‌లో ఉన్న మోహన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఐదు కేసుల్లో ఉరిశిక్ష, మరో మూడు కేసుల్లో జీవిత ఖైదు శిక్షలను కోర్టులు విధించాయి.

# తెలంగాణ అభివృద్ధికి సహకారం

- రైల్వేశాఖ మంత్రి పీయూష్‌గోయల్ వెల్లడి
- చర్లపల్లి స్టేషన్‌లో శాటిలైట్ టర్మినల్‌కు శంకుస్థాపన
- రైల్వే కేటాయింపుల్లో రాష్ట్రానికి అన్యాయం: మంత్రి తలసాని

**కంటోన్మెంట్, నమస్తే తెలంగాణ:** కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలను అందిస్తున్నదని కేంద్ర రైల్వేశాఖ మంత్రి పీయూష్‌గోయల్ అన్నారు. రైల్వే ప్రాజెక్టుల్లోనూ తెలంగాణ ప్రగతిపథంలో దూసుకుపోతున్నదని పేర్కొన్నారు. మంగళవారం చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో శాటిలైట్ టర్మినల్ నిర్మాణానికి ఆయన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో శంకుస్థాపన చేశారు. దక్షిణమధ్య రైల్వే పరిధిలోని 427 రైల్వేస్టేషన్లలో ఉచిత వైఫై సేవలను ప్రారంభించారు. యర్రగుంట్ల-నంద్యాల సెక్షన్ విద్యుదీకరణకు శంకుస్థాపన చేసి.. గుంతకల్లు-కల్లూరు సెక్షన్ రెండోమార్గాన్ని జాతికి అంకితంచేశారు. ఈ ప్రాజెక్టులను పీయూష్‌గోయల్ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి రిమోట్‌లింక్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణకు రైల్వే బడ్జెట్ కేటాయింపుల్లో అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. యూపీఏ హయాంలో రూ.258 కోట్లు కేటాయించగా, 2020-21 బడ్జెట్‌లో రూ.2,602 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రాలు సహకరిస్తేనే రైల్వే లైన్లు వేగంగా పూర్తవుతాయని పేర్కొన్నారు. కొత్తపల్లి -మనోహరాబాద్ రైల్వేలైన్‌ను కేంద్రం మంజూరుచేసినట్టు తెలిపారు.

**ఎంఎంటీఎస్‌ను త్వరగా పూర్తిచేయండి: కిషన్‌రెడ్డి**

హైదరాబాద్ ఎంతో అభివృద్ధి చెందుతున్నదని, దీంతోపాటే ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతున్నదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జీ కిషన్‌రెడ్డి అన్నారు. రెండో తిరుపతిగా అభివృద్ధి చెందుతున్న యాదగిరిగుట్ట వరకు రెండోదశ ఎంఎంటీఎస్‌ను త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. రాష్ట్ర సినిమాటోగ్రఫీశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. రైల్వే బడ్జెట్ కేటాయింపుల్లో ఉత్తర భారతంతో పోలిస్తే.. దక్షిణ భారత్‌కు అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. శాటిలైట్ రైల్వే స్టేషన్ నిర్మాణంతోపాటు ఎంఎంటీఎస్ రెండో దశకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. తెలంగాణ రైల్వే అభివృద్ధిపై కేంద్రం దృష్టిసారించాలని తలసాని కోరారు. ఈ కార్యక్రమంలో రైల్వేశాఖ సహాయమంత్రి సోంప్రకాశ్, ఎంపీలు సీఎం రమేశ్, డీ అరవింద్, బండి సంజయ్, సోయం బాపూరావు, రఘురాం క్రిష్ణంరాజు, జనార్దన్‌రెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జెడ్పీ చైర్మన్ ఎం శరత్‌చంద్రారెడ్డి, ఎమ్మెల్యే సుభాశ్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ ప్రభాకర్, దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ గజానంద మల్యా తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి రిమోట్ లింక్ ద్వారా చర్లపల్లిలో శాటిలైట్ రైల్వేస్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కేంద్రమంత్రులు పీయూష్‌గోయల్, కిషన్‌రెడ్డి, రాష్ట్రమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ తదితరులు

## మున్సిపల్ కమిషనర్ల బదిలీలు

**రాష్ట్రంలో భారీ ఎత్తున మున్సిపల్ కమిషనర్ల బదిలీలు జరిగాయి. వివరాలు ఇలా ఉన్నాయి.**

| పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ అయిన స్థానం (పోస్టింగ్ ఇచ్చినది) |
|---|---|---|
| ఎండీ జకీర్ అహ్మద్ | వెయిటింగ్ | కల్వకుర్తి |
| ఆకుల వెంకటేశ్ | వెయిటింగ్ | బెల్లంపల్లి |
| ఆర్ త్రయంబకేశ్వరరావు | బెల్లంపల్లి | లక్సెట్టిపేట |
| గోన అవినాశ్ | వెయిటింగ్ | నాగర్‌కర్నూల్ |
| కే జయంత్‌కుమార్‌రెడ్డి | నాగర్‌కర్నూల్ | జగిత్యాల |
| నల్లమాల బాలక్రిష్ణ | వెయిటింగ్ | నిర్మల్ |
| సుజాత | వెయిటింగ్ | అమీన్‌పూర్ |
| పీ వేమారెడ్డి | అమీన్‌పూర్ | హాలియా |
| వెంకటమనికరన్ | వెయిటింగ్ | తెల్లాపూర్ |
| లావణ్య | వెయిటింగ్ | షాద్‌నగర్ |
| బీ శరత్‌చంద్ర | షాద్‌నగర్ | సంగారెడ్డి |
| ప్రశాంతి | సంగారెడ్డి | జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ |
| కే శ్రీనివాస్‌రెడ్డి | వెయిటింగ్ | తాండూర్ |
| సబీర్ అలీ | తాండూర్ | శంషాబాద్ |
| ఎస్ విద్యాధర్ | వెయిటింగ్ | నర్సంపేట |
| బీ యాదగిరి | వెయిటింగ్ | పరకాల |
| చదల తిరుపతి | వెయిటింగ్ | పెద్దపల్లి |
| మట్ట శ్రీనివాస్‌రెడ్డి | వెయిటింగ్ | వేములవాడ |
| కే సుజాత | వెయిటింగ్ | సత్తుపల్లి |
| వీరేందర్ | అసిస్టెంట్ డైరెక్టర్ (ఎంఏయూడీ) | ఇల్లందు |
| జీ రాజు | వెయిటింగ్ | మందమర్రి |
| మహేశ్వర్‌రెడ్డి | వెయిటింగ్ | వనపర్తి |
| రజనీకాంత్‌రెడ్డి | వనపర్తి | డిప్యూటీ కమిషనర్, జీహెచ్‌ఎంసీ |
| స్పందన | వెయిటింగ్ | సదాశివపేట |
| ఒమర్ అహ్మద్ | సదాశివపేట | ఎల్లారెడ్డి |
| బట్టు నాగిరెడ్డి | వెయిటింగ్ | హుజూర్‌నగర్ |
| బీ గంగాధర్ | వెయిటింగ్ | కామారెడ్డి |
| జంపాల రజిత | వెయిటింగ్ | యాదగిరిగుట్ట |
| పల్లారావు | అసిస్టెంట్ డైరెక్టర్ (వెయిటింగ్) | నందికొండ |
| ప్రభాకర్ | వెయిటింగ్ | చిట్యాల |
| త్రిల్లేశ్వర్ | డిప్యూటీ డైరెక్టర్ (ఎంఏయూడీ) | జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ |
| ముకుంద్‌రెడ్డి | స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ (జేడీఎంఏయూడీ) | జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ |
| నళిని పద్మావతి | డిప్యూటీ కమిషనర్, జీహెచ్‌ఎంసీ | జేడీ, ఎంఏయూడీ (స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్) |
| వేణుగోపాల్‌రెడ్డి | వెయిటింగ్ (గ్రేడ్-1 మున్సిపల్ కమిషనర్) | డిప్యూటీ డైరెక్టర్, ఎంఏయూడీ |
| శ్యామ్‌సుందర్ | మేనేజర్ పరిగి | ఆమనగల్ |



ఏసీబీకి చిక్కిన కుమారస్వామి

## ఎన్వోసీ కోసం రూ.10 వేలు లంచం

ఏసీబీకి చిక్కిన బిల్ కలెక్టర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ ఘట్‌కేసర్:** ఇంటి నిర్మాణానికి ఎన్వోసీ ఇచ్చేందుకు లంచం డిమాండ్‌చేసి తీసుకొంటుండగా పోచారం మున్సిపాలిటీ బిల్‌కలెక్టర్ రెడ్ హ్యాండెడ్‌గా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు అడ్డంగా దొరికిపోయాడు. ఏసీబీ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపాలిటి పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో నివసించే చంద్రగోని బాలరాజు.. ఇల్లు కట్టుకోవాలని భావించి తన 67 గజాల గ్రామ కంఠం స్థలానికి ఎన్వో సీ ఇవ్వాలని మున్సిపాలిటీలో దరఖాస్తు చేసుకొన్నాడు. ఔట్‌సోర్సింగ్‌లో బిల్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న పులి కుమారస్వామి రూ.30 వేల లంచం డిమాండ్ చేశాడు. రూ.10 వేలు అయినా ఇవ్వాలని చెప్పడంతో.. బాలరాజు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం ఇస్మాయిల్‌ఖాన్‌గూ డ వార్డు కార్యాలయంలో బాధితుడి నుంచి రూ.10 వేల నగదు తీసుకొంటుండగా.. అక్కడే ఉన్న అవినీతి నిరోధకశాఖ అధికారులు బిల్‌కలెక్టర్ కుమారస్వామిని అదుపులోకి తీసుకొన్నారు. ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపర్చినట్టు అధికారులు తెలిపారు.

# ఔషధరంగ గమ్యస్థానం

మొదటిపేజీ తరువాయి...

తీసుకువస్తామన్నారు. హెచ్ఐసీసీలో బయో ఏషియా- 2020 గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా మంగళవారం 'ప్లేయింగ్ క్యాచ్ అప్ ఆర్ ప్రిపేరింగ్ లీడ్ ఆఫ్‌ది సీఈవో' అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతదేశంలో ఔషధరంగానికి సరైన ప్రాధాన్యం ఇవ్వడం లేదని, నిర్దిష్ట విధానం లేకుండా అభివృద్ధి ఎలా సాధ్యమంటూ తెలంగాణ పరిశ్రమల మంత్రి కేటీఆర్ వేసిన ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానమిస్తూ.. దేశంలో ఔషధాలు, ఔషధ పరికరాలు ప్రతిపౌరునికి అందుబాటు ధరలో ఉండేలా చూస్తామన్నారు. దేశంలో ఫార్మా బయోటెక్ రంగం గణనీయవృద్ధిని సాధిస్తున్నదని.. ప్రస్తుతం 40 బిలియన్ డాలర్లుగాఉన్న వృద్ధి త్వరలో 100 మిలియన్ డాలర్లను దాటుతుందనే అంచనా ఉన్నదని చెప్పారు. దేశం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవృద్ధికి చేరేసరికి దేశ ఔషధరంగం, లైఫ్‌సైన్సెస్ ఏ విధంగా ఉండబోతున్నదని కేటీఆర్ అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే కాకుండా.. ప్రజలందరూ సంతోషంగా ఉండాలంటే ఆరోగ్యరంగానికి ప్రాధాన్యమివ్వాలన్నది కేంద్రప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వైద్యరంగంలో పరిశోధనలకు పెద్దపీట వేస్తామని, కొత్త ఆవిష్కరణలకు ప్రోత్సాహమిస్తామని.. వీటికి పేటెంట్ హక్కులు రికార్డు సమయంలో అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కానీ, ఔషధ కంపెనీలకు ఆదాయం పన్నుల్లో రాయితీలు, ఇతర ఆర్థికపరమైన ప్రోత్సాహకాలపై మాత్రం కేంద్రమంత్రి స్పష్టమైన హామీఇవ్వలేదు.




బయో ఏషియా- 2020 గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా రెండోరోజు మంగళవారం జరిగిన చర్చాగోష్ఠిలో పాల్గొన్న కేంద్రమంత్రి పీయూష్‌గోయల్, రాష్ట్రమంత్రి కేటీఆర్.

### ఔషధరంగంలో పరిశోధనలకు ప్రాధాన్యమివ్వండి

ప్రపంచస్థాయిలో పోటీకి అనుగుణంగా దేశంలో ఔషధాలు, జీవశాస్త్రంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పరిశోధనలను ముమ్మరం చేయాలని చర్చాగోష్ఠిలో పాల్గొన్న పలువురు సీఈవోలు కేంద్రప్రభుత్వాన్ని కోరారు. నోవార్టిస్ సీఈవో డాక్టర్ వ్యాస్ నర్సింహన్, సన్ ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్ దిలీప్ షాంఘ్వీ, డాక్టర్ రెడ్డి ల్యాబ్స్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, పిరమల్ గ్రూప్ చైర్మన్ అజయ్‌పిరమల్, ఎమర్జింగ్ మార్కెట్స్ హ్యూమన్ హెల్త్ ప్రెసిడెంట్ జాన్‌వాన్ యాకర్ తదితరులు పలు సూచనలు చేశారు. అమెరికా, చైనాతో పాటు అనేక దేశాలు ఔషధాల తయారీలో ప్రయోగాలకు పెద్దఎత్తున నిధులు వెచ్చిస్తున్నాయని.. భారత్ అందులో కనీసం 10శాతం కూడా ఖర్చు చేయడం లేదని తెలిపారు. దీని వల్ల దేశంలో ఔషధాలు ఉత్పత్తి చేయలేక.. దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. క్లినికల్ ట్రయల్స్‌పై ఆంక్షలను సడలించాలని, పరిశ్రమల అనుమతుల విషయంలోఉన్న కఠినమైన నిబంధనలను సరళీకృతం చేయాలని కోరారు.

### కేటీఆర్ జాతీయ రాజకీయాలలోకి వస్తే మంచిది..

టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ మంత్రి కేటీఆర్ అత్యద్భుతమైన మార్కెటింగ్ నైపుణ్యత కలిగిన నాయకుడని కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ కితాబిచ్చారు. ఆయన ఒక్క తెలంగాణనే కాకుండా దేశాన్ని మొత్తం మార్కెట్‌లో ప్రమోట్ చేయాలని.. కేటీఆర్ జాతీయరాజకీయాల్లోకి వస్తే బాగుంటుందని అన్నారు. బయో ఏషియా సదస్సులో భాగంగా జరిగిన సీఈవోల చర్చాగోష్ఠికి మంత్రి కేటీఆర్ మోడరేటర్ (సమన్వయకర్త)గా వ్యవహరించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్రమంత్రుల మధ్య ఈ ఆసక్తికర చర్చ చోటుచేసుకున్నది. చర్చలో భాగంగా మంత్రి కేటీఆర్ ప్రపంచవ్యాప్తంగా ఔషధరంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, పన్నుల రూపేణా ఇవ్వాల్సిన రాయితీలు, పరిశోధనలు, నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యం, కేంద్ర, రాష్ట్రాల ఏజెన్సీల మధ్య సమన్వయ సహకారం అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు. తెలంగాణలో ప్రత్యేకించి హైదరాబాద్‌లో ఔషధరంగాన్ని, లైఫ్‌సైన్సెస్‌ను ఏవిధంగా అభివృద్ధి చేస్తున్నది కేంద్రమంత్రికి వివరించారు. దీంతో ముగ్ధుడైన పీయూష్‌గోయల్.. కేటీఆర్ మంచి మార్కెటింగ్ నైపుణ్యమున్న వ్యక్తి అని, ఆయన అంతర్జాతీయస్థాయిలో ఇండియాను మార్కెటింగ్ చేస్తే బాగుంటుందని చమత్కరించారు. దీనికి స్పందించిన కేటీఆర్.. తాను ప్రాంతీయపార్టీ నాయకుడిని కాబట్టి తన ప్రాంతాన్ని ప్రమోట్ చేసుకుంటున్నానని పేర్కొన్నారు. జాతీయ రాజకీయాల్లో ఎలాగో శూన్యత ఉన్నది, జాతీయ రాజకీయాల్లోకి వస్తే మంచిదే అని కేంద్రమంత్రి అనడంతో హెచ్ఐసీసీ హాలులో నవ్వులు విరిశాయి.

## ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్కీమ్‌కు 13.84 కోట్లు

ఉన్నతస్థాయి కమిటీ ఆమోదం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సీఎం ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్ స్కీమ్ కింద గిరిజన ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి వచ్చిన రూ.13.84 కోట్ల విలువైన ప్రతిపాదనలకు గిరిజన సంక్షేమశాఖ ఆమోదం తెలిపింది. మంగళవారం హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో ఆ శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తు అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు రూ.4.77 కోట్ల సబ్సిడీ, రూ.7.68 కోట్ల బ్యాంకు రుణాలు అందనున్నాయి. లబ్ధిదారులు రూ.1.38 కోట్ల వాటాను చేర్చుకొని లబ్ధిపొందనున్నారు. సమావేశంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ, డీఐసీసీఐ, ఎన్ఐఎంఎస్ఎంఈ, ఎన్ఎస్ఐసీ, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్, గిరిజన ఆర్థిక సహకార సంస్థలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఇండ్లు ఖాళీ చేయాలంటూ అధికారులు ఇచ్చిన నోటీసులను చూపిస్తున్న అహ్మదాబాద్‌లోని మురికివాడల నివాసితులు

## గుజరాత్ పేదలకు ‘ట్రంప్ పర్యటన’ కష్టాలు

### ఆక్రమిత స్థలాలు ఖాళీ చేయాలంటూ అహ్మదాబాద్ అధికారుల నోటీసులు

**అహ్మదాబాద్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గుజరాత్ పర్యటన అక్కడి మురికివాడలపై ప్రభావం చూపుతున్నది. అహ్మదాబాద్‌లో నిర్మించిన మొతెరా స్టేడియాన్ని ఈ నెల 24న ప్రధాని మోదీతో కలిసి ట్రంప్ ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా ఈ ప్రాంతంలోని మురికివాడ నివాసితులను ఖాళీ చేయించేందుకు రంగం సిద్ధం చేశారు. ఈమేరకు సుమారు 45 కుటుంబాలకు అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే పదేండ్లుగా ఇక్కడ నివాసం ఉంటున్నామని, ఉన్నపళంగా ఖాళీ చేయమంటే ఎక్కడికి వెళ్లేదంటూ మురికివాడ ప్రజలు వాపోతున్నారు. ఆక్రమణదారులను ఖాళీ చేయించే ప్రణాళికలో భాగంగానే నోటీసులు ఇచ్చామని, ట్రంప్ పర్యటనకు దీనికి ఎలాంటి సంబంధం లేదని అధికారులు చెప్తున్నారు. మరోవైపు, ట్రంప్ పర్యటన నేపథ్యంలో అహ్మదాబాద్‌లో పేదల ప్రాంతాలు కనిపించకుండా భారీ ఎత్తున పొడవైన గోడ నిర్మించడంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. గోడలతో పేదరికాన్ని దాచలేరని ఎద్దేవా చేసింది. ప్రజల వినియోగ స్థాయిలు 40 ఏండ్ల కనిష్ఠానికి దిగజారాయని ఆందోళన వ్యక్తం చేసింది.





ముంబైలో ఉగ్రదాడులకు పాల్పడిన ఉగ్రవాది అజ్మల్ కసబ్; ఉగ్రదాడిలో దగ్ధమవుతున్న ముంబైలోని తాజ్ హోటల్ (ఫైల్)



# గాంధీ.. గాడ్సే కలిసుండలేరు!



ప్రశాంత్ కిషోర్



నితీశ్ కుమార్

- నితీశ్ కుమార్ నాకు తండ్రిలాంటివారు
- గాంధీజీ సిద్ధాంతాలు పాటిస్తున్నామంటూ గాడ్సేకు మద్దతిచ్చేవారి పక్షాన నిలిచారు
- మా ఇద్దరి మధ్య విభేదాలు నిజమే
- ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్

**పాట్నా, ఫిబ్రవరి 18:** రాజకీయ నేతగా మారిన ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌పై విమర్శల దాడి చేశారు. గాంధీజీ సిద్ధాంతాలు పాటిస్తున్నామని నితీశ్ చెప్తుంటారని, కానీ అధికారం కోసం ఆయన గాడ్సేకు మద్దతిచ్చే వారి(బీజేపీ) పక్షాన నిలిచారని వ్యాఖ్యానించారు. జేడీ(యూ) నుంచి బహిష్కరణకు గురైన ప్రశాంత్ కిషోర్ మొదటిసారిగా మంగళవారం పాట్నాలో మీడియా సమావేశంలో మాట్లాడారు. జేడీ(యూ)లో చేరకముందు నుంచే నితీశ్ తనకు తండ్రిలాంటి వారని ఆయన గురించి చెడుగా మాట్లాడలేనని అన్నారు. అయితే ఆయనతో విభేదాలు తలెత్తిన మాట నిజమేనని అంగీకరించారు. గాంధీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటామని చెప్పుకొనే నితీశ్ బీజేపీతో జతకట్టారని విమర్శించారు. ‘గాంధీజీ, జయప్రకాశ్ నారాయణ్, రామ్ మనోహర్ లోహియా సిద్ధాంతాలను ఎన్నటికీ విడువబోనని నితీశ్‌జీ తరచుగా చెప్తుంటారు.. అదే సమయంలో ఆయన గాడ్సే సిద్ధాంతాలను నమ్మే వారితో కలిసి సాగుతున్నారు. గాంధీ, గాడ్సే కలిసి ఉండలేరు. మీరు బీజేపీతో జత కట్టాలనుకుంటే నాకెలాంటి అభ్యంతరం లేదు. కానీ మీరు రెండు సిద్ధాంతాలతో ముందుకు సాగలేరు’ అని పేర్కొన్నారు. ఈ అంశంపై తనకు, నితీశ్‌కు మధ్య చాలాకాలంపాటు చర్చలు జరిగాయని ప్రశాంత్ చెప్పారు. ఓ పార్టీ నాయకునిగా మీరు (నితీశ్) ఏవైపు ఉన్నారో స్పష్టం చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ‘ఎన్నికల వ్యూహకర్తగా వివిధ రాజకీయ పార్టీలతో నాకున్న అనుబంధం అందరికీ తెలిసిందే. దానిని నేనెప్పుడూ రహస్యంగా ఉంచలేదు. కానీ మరో పార్టీ ఏజెంటుగా నేను జేడీ(యూ)లో చేరలేదు. అబద్ధాలతో ఇతరులను ఎదుర్కొనవచ్చని అనుకుంటే.. ఆ పని నాకు తండ్రిలాంటి నితీశ్‌కుమార్ చేశాడని చెప్తాను’ అంటూ ప్రశాంత్ తీవ్ర ఆరోపణలు చేశారు. ‘బీజేపీకి దూరమైన నితీశ్ 2014లో ఒంటరిగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి, కేవలం రెండు సీట్లు గెలుపొందారు. అయినప్పటికీ నితీశ్ బీహార్ ప్రజల ఆశాదీపంగానే ఉన్నారు. కానీ నేటి పరిస్థితి చూడండి.. వచ్చే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే పక్షనేతగా నితీశ్ ఉంటారని మరో పార్టీకి చెందిన ఓ గుజరాతీ నాయకుడు (అమిత్‌షా)భరోసా ఇస్తున్నాడు. అంటే ఇంతకుముందు నితీశ్ బీహార్ వాసులకు నాయకునిగా కాకుండా ఓ సంస్థకు మేనేజర్‌గా పనిచేసినట్టా?. తమ నాయకుడు మరొకరిపై ఆధారపడటాన్ని బీహార్ వాసులు సహించలేరు. ఒకప్పుడు బీహార్‌లో బీజేపీ తరపున ప్రచారం చేయకుండా మోదీని అడ్డుకున్న నితీశ్.. ఇటీవల ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా అమిత్‌షా, నడ్డా అనుచరునిలాగా ప్రచారం చేయడం దయనీయం’ అంటూ విచారం వ్యక్తం చేశారు. బీహార్ ప్రయోజనాల కోసమే బీజేపీతో స్నేహం చేస్తున్నామన్న నితీశ్ వాదనను ప్రశాంత్ తోసిపుచ్చారు. ‘ఏం సాధించారు. ఎన్నో ఏండ్లుగా డిమాండ్ చేస్తున్నప్పటికీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చిందా? పాట్నా యూనివర్సిటీకి కేంద్ర హోదా కల్పించాలంటూ మోదీ ముందు చేతులు జోడించి వేడుకున్నా.. మోదీ కనీసం హామీ కూడా ఇవ్వలేదు’ అంటూ మండిపడ్డారు.

### కొత్త పార్టీ పెట్టే యోచన లేదు

పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌తో ప్రశాంత్ కిషోర్ ఇటీవల సన్నిహితంగా ఉంటున్న నేపథ్యంలో ఆయన కొత్త పార్టీ పెట్టనున్నారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే తనకు అలాంటి ఆలోచన ఏదీ లేదని ప్రశాంత్ స్పష్టంచేశారు. బీహార్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు ‘బాత్ బీహార్ కీ’ పేరుతో ఒక కార్యక్రమం చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఈ నెల 20 నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని చెప్పారు. వంద రోజుల్లో కోటి మంది యువతను కలుస్తామని చెప్పారు. మరోవైపు, ప్రశాంత్ కిషోర్ వ్యాఖ్యలపై జేడీయూ ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజకీయాల్లో జోక్యం చేసుకోవడానికి బదులు కిషోర్ తన సమయాన్ని తన ‘వ్యాపారానికి’ కేటాయించుకోవడం మంచిదని హితవు చెప్పింది. కిషోర్‌కు రాజకీయాలు చేతకావని జేడీయూ ప్రతినిధి కేసీ త్యాగి విమర్శించారు. కిషోర్ అనేక పార్టీలతో కలిసి పనిచేశారని, అది అనైతికమని చెప్పారు.



## 6+23=29

### ఎన్నెన్నో మధుర స్మృతులు

పెండ్లి రోజున ప్రియాంక భావోద్వేగ పోస్టు

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వాద్రా మంగళవారం తన పెండ్లి రోజు సందర్భంగా సోషల్‌మీడియాలో భావోద్వేగ పోస్టు పెట్టారు. వివిధ సందర్భాల్లో దిగిన ఫొటోలను షేర్ చేస్తూ ఓ సందేశాన్ని రాశారు. ‘లక్షలాది అందమైన జ్ఞాపకాలు.. ప్రేమ, కన్నీళ్లు, నవ్వులు, కోపం, స్నేహం, కుటుంబం, భగవంతుడు ఇచ్చిన రెండు బహుమతులు (ఇద్దరు పిల్లలు), నాలుగు అందమైన పెంపుడు శునకాలు.. నా నుంచి విడదీయరాని మధురస్మృతుల కలబోతే ఈ జీవితం.. 6+23 సంవత్సరాలు.. 29 ఏండ్లు.. నేటికి’ అని ట్వీట్ చేశారు. పెండ్లి ఫొటోలతో పాటు తల్లి సోనియా, సోదరుడు రాహుల్, భర్త వాద్రా, పిల్లలు రైహాన్, మిరాయాతో దిగిన ఫొటోలనూ ఆమె పోస్టుచేశారు. రాబర్ట్ వాద్రాతో 1997 ఫిబ్రవరి 18న ఆమె పెండ్లి జరిగింది. వారి పెండ్లై 23 ఏండ్లు కాగా.. అంతకముందు ఆరేండ్లపాటు వారు ప్రేమించుకున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రియాంక ‘6+23.. 29 ఏండ్లు’ అని రాసినట్టు తెలుస్తున్నది.

# కసబ్ హిందూ ఉగ్రవాది



సీపీ రాకేశ్ మారియా

- 26/11 ముంబై దాడులను ‘హిందూ ఉగ్రవాద’ చర్యగా ఏమార్చే కుట్ర!
- లష్కరే తాయిబా నాడు వ్యూహాలను పన్నింది
- కసబ్‌కు సమీర్ ఛౌదరి అనే పేరు.. చేతికి ఎర్రరంగు కంకణం
- కసబ్‌ను హత్యచేసేందుకూ ప్లాన్.. దావూద్ గ్యాంగ్‌కు బాధ్యతలు
- ‘లెట్‌మీ సే ఇట్ నౌ’ పుస్తకంలో ముంబై మాజీ సీపీ రాకేశ్ మారియా వెల్లడి

**ముంబై:** 26/11.. ఈ తేదీ వినగానే మనకు దేశ చరిత్రలోనే అత్యంత భయానకమైన ఉగ్రదాడి కళ్లముందు కదలాడుతుంది. దాదాపు పన్నెండేండ్ల కిందట దేశ ఆర్థిక రాజధాని ముంబైలో పాకిస్థాన్‌కు చెందిన 10 మంది ఉగ్రవాదులు సాగించిన నరమేధంలో 166 మంది ప్రాణాలు కోల్పోగా, 300 మందికిపైగా గాయపడ్డారు. అయితే ఈ దాడిని ‘హిందూ ఉగ్రవాద’ చర్యగా చిత్రీకరించేందుకు ‘లష్కరే తాయిబా’ ఉగ్రవాద సంస్థ కుట్రలు పన్నినట్లు తేలింది. ముంబై మాజీ పోలీస్ కమిషనర్ రాకేశ్ మారియా.. ‘లెట్ మీ సే ఇట్ నౌ’ పేరిట రచించిన పుస్తకంలో ఈ వివరాలు వెల్లడించారు. ఈ పుస్తకం సోమవారం విడుదలైంది. ముంబై ఉగ్రదాడులపై తాను సాగించిన దర్యాప్తునకు సంబంధించి పలు ఆసక్తికర అంశాలను అందులో ప్రస్తావించారు. ఉగ్రవాదుల పేర్లను మార్చి, భారతీయ చిరునామాలపై నకిలీ గుర్తింపు కార్డులు సృష్టించారని.. దాడుల్లో కీలకంగా వ్యవహరించిన ఉగ్రవాది మొహమ్మద్ అజ్మల్ అమీర్ కసబ్‌ను బెంగళూరుకు చెందిన సమీర్ ఛౌదరిగా పేర్కొన్నారని మారియా తన పుస్తకంలో వివరించారు. ‘అంతా ప్రణాళిక ప్రకారం జరిగితే అతడు సమీర్ చౌదరిగానే మరణిస్తాడు. దీంతో మీడియా దాన్ని హిందూ ఉగ్రవాద చర్యగా భావిస్తుంది’ అని లష్కరే తాయిబా కుట్ర పన్నినట్లు తెలిపారు. అంతేగాకుండా కసబ్ చేతికి హిందువులు ధరించే ఎర్ర రంగు కంకణం కట్టారు. దీంతో ఈ ఘటనను హిందూ టెర్రర్‌గా నమ్మించే ప్రయత్నం చేశారు. ‘హిందూ ఉగ్రవాదులు ముంబైపై దాడి చేశారని మీడియా సంస్థలు హోరెత్తిస్తాయని, ‘కసబ్ తల్లిదండ్రుల’ ఇంటర్వ్యూలు తీసుకునేందుకు టాప్ టీవీ జర్నలిస్టులు బెంగళూరుకు పరుగులు తీస్తారని భావించారు. అయితే వారి కుట్రలు ఫలించలేదు. కసబ్ పాకిస్థాన్‌లోని ఫరీద్‌కోట్‌కు చెందినవాడిగా తేలింది’ అని వివరించారు. కసబ్ సజీవంగా పట్టుబడడంతో పోలీసులకు తమకు సంబంధించిన ఆధారాలు లభిస్తాయన్న కారణంతో పాకిస్థాన్ ఐఎస్ఐ, లష్కరే తాయిబా అతడిని చంపే ప్రయత్నాలు కూడా చేసినట్లు మారియా వెల్లడించారు. ఈ పనిని దావూద్ ఇబ్రహీం గ్యాంగ్‌కు అప్పగించినట్లు తెలిపారు. ‘వాస్తవానికి కసబ్ దొంగతనాలు చేసేందుకు లష్కరే తాయిబాలో చేరారు. జీహాద్‌తో అతడికి సంబంధం లేదు. అయితే భారత్‌లో ముస్లింలను నమాజ్ చేసుకునేందుకు కూడా అనుమతించరని అతడిని నమ్మించారు. మెట్రో సినిమా థియేటర్ సమీపంలోని మసీదులో కసబ్‌ను ప్రార్థనలు చేసుకునేందుకు అనుమతించినప్పుడు అతడు షాక్‌కు గురయ్యాడు’ అని మారియా తన పుస్తకంలో పేర్కొన్నారు. ముంబై దాడులకు వెళ్లే ముందు లష్కరే తాయిబా సూత్రధారులు కసబ్‌కు రూ.1.25 లక్షలు అందజేసి, వారం రోజులు సెలవులు ఇచ్చారని చెప్పారు. ఆ నగదును అతడు తన సోదరి పెండ్లి కోసం కుటుంబ సభ్యులకు అందజేశాడని తెలిపారు. 2012 నవంబర్ 21న కసబ్‌ను ఉరితీసిన సంగతి తెలిసిందే.

### షీనా బోరా కేసులోనూ సంచలనాలు

దేశవ్యాప్తంగా సంచలనం రేపిన షీనాబోరా హత్య కేసుకు సంబంధించి కూడా మారియా తన పుస్తకంలో పలు కీలక అంశాలు వెల్లడించారు. తన అనంతరం ముంబై పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అహ్మద్ జావేద్.. షీనా బోరా హత్య కేసు నిందితులు ఇంద్రాణి, పీటర్ ముఖర్జియాలకు ముందే తెలుసునని చెప్పారు. అలాగే పీటర్‌కు నాటి జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ దేవేన్ భారతికి కూడా మంచి పరిచయం ఉన్నదని పేర్కొన్నారు. ప్రస్తుతం మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ అధిపతిగా పనిచేస్తున్న దేవేన్ ఈ ఆరోపణలను ఖండించారు. వాస్తవాలను వెల్లడించడానికి బదులు పుస్తకాన్ని అమ్ముకునేందుకు చేస్తున్న మార్కెటింగ్ ప్రయత్నాలు ఇవని విమర్శించారు. ఈ కేసులో పీటర్ ముఖర్జియాను 2015 నవంబర్ 19న అరెస్ట్‌చేశారు. ఈ కేసులో ఆయన మాజీ భార్య ఇంద్రాణి ప్రధాన నిందితురాలు. ఇంద్రాణి మొదటి భర్త కూతురే షీనాబోరా. మరో కేసులో ఇంద్రాణి డ్రైవర్ శ్యామ్‌వర్ రాయ్‌ని పోలీసులు అరెస్ట్ చేయడంతో ఈ హత్య వెలుగులోకి వచ్చింది.

## ‘గో ఎయిర్’ విమానంలో మంటలు

### తప్పిన పెను ప్రమాదం.. ప్రయాణికులు సురక్షితం

**ముంబై:** గో ఎయిర్ విమానానికి పెను ప్రమాదం తప్పింది. సోమవారం 131 మంది ప్రయాణికులు, ముగ్గురు పసికందులు, సిబ్బందితో అహ్మదాబాద్ నుంచి బెంగళూరు ప్రయాణించాల్సిన విమానంలో మంటలు చెలరేగాయి. విమానం కుడివైపున ఉన్న ఇంజిన్‌ను పక్షి ఢీకొనడంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో అప్రమత్తమైన సిబ్బంది వెంటనే విమానంలోని ప్రయాణికులందరినీ సురక్షితంగా కిందకు దించారు. ఈ ఘటన సోమవారం అహ్మదాబాద్ విమానాశ్రయంలో చోటుచేసుకుంది.

## ఏకకాలంలో పీజీడీఎం, ఎంబీఏ కోర్సులను నడుపరాదు

### ఏఐసీటీఈ ఆదేశం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు ఏకకాలంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీడీఎం), మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ) కోర్సులను నిర్వహించరాదని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) ఆదేశించింది. నిబంధనల ప్రకారం ఏ విద్యా సంస్థ అయినా ఒకేసారి ఈ రెండు కోర్సులను నిర్వహించడం కుదరదని తెలిపింది. మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ కోర్సు పేరుతో ఈ రెండింటిని నిర్వహించడం నిబంధనలను ఉల్లంఘించడం అవుతుందని, కాబట్టి మేనేజ్‌మెంట్ విద్యతో ముడిపడిన కోర్సులన్నింటినీ పూర్తిగా ఎంబీఏలో కలిపేయాలని సూచించింది.

# కొవిడ్‌కు దవాఖాన డైరెక్టర్ బలి

- వైరస్ సోకి వుచాంగ్ దవాఖాన డైరెక్టర్ లియూ చిమింగ్ మృతి
- 1,868కి చేరిన మృతులు.. 72,436 మందికి వైరస్ నిర్ధారణ
- మాస్కులు, బాడీసూట్‌ల కొరతతో వైద్యులకు తిప్పలు
- చైనాలో తీవ్ర ప్రమాదకర పరిస్థితులు: గుటెరస్



జపాన్ తీరంలో లంగరేసిన ‘డైమండ్ ప్రిన్సెస్’ ప్రయాణికుల నౌక; కరోనా వైరస్ సోకి మృతిచెందిన వుచాంగ్ దవాఖాన డైరెక్టర్ లియూ చిమింగ్

**బీజింగ్, ఫిబ్రవరి 18:** చైనాలోని వుహాన్ నగరంలో వెలుగుచూసిన ప్రాణాంతక కరోనా వైరస్(కొవిడ్-19) ఆ దేశంలో ఎవ్వరినీ వదిలి పెట్టడం లేదు. ఇప్పటివరకూ ఈ వైరస్ సోకి సాధారణ ప్రజలతో పాటు వైద్యులు కూడా చనిపోతుండడం తెలిసిందే. ఇప్పుడు ఏకంగా కరోనా బాధితులకు చికిత్సనందిస్తున్న ఓ దవాఖాన డైరెక్టరే ఈ వ్యాధికి బలయ్యారు. వుచాంగ్ దవాఖాన డైరెక్టర్ లియూ చిమింగ్ కరోనా సోకి మంగళవారం ప్రాణాలు కోల్పోయారు. లియూ చిమింగ్‌ను కాపాడేందుకు చేసిన అన్ని ప్రయత్నాలు విఫలమైనట్లు వైద్యులు తెలిపారు. లియూ చిమింగ్ సోమవారం రాత్రే మృతి చెందినట్లు కొన్ని చైనా ఛానళ్ల వార్తల్ని ప్రసారం చేశాయి. అయితే వెనువెంటనే ఆయన మరణించలేదని, ఆయనను కాపాడేందుకు వైద్యులు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నాయి. అయితే, లియూ చిమింగ్ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. కరోనా వైరస్ గురించి తొలిసారిగా గతేడాది వెల్లడించిన వైద్యుడు లీ వెన్లియాంగ్‌ను అధికారులు వదంతులను వ్యాప్తి చేయవద్దంటూ గత డిసెంబరులో హెచ్చరించడం తెలిసిందే. ఆ తరువాత ఆయన కరోనా పేషెంట్లకు చికిత్సనందిస్తూ అదే వ్యాధి సోకి మరణించాడు. ఇప్పుడు లియూ మరణాన్ని కూడా ఆ వైద్యుడి మృతితో పోలుస్తూ నెటిజన్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు చేశారు. ఇద్దరి మరణం విషయాన్ని తొలుత చైనా అధికార వార్తా సంస్థలు ప్రసారం చేశాయని, ఆ తర్వాత ఆ వార్తల్ని తొలగించాయని ఓ నెటిజన్ గుర్తుచేశారు. కొవిడ్-19 వల్ల చైనాలో మంగళవారం నాటికి 1,868 మంది మరణించినట్టు చైనా జాతీయ ఆరోగ్య సంస్థ(ఎన్‌హెచ్‌సీ) ఓ నివేదికలో పేర్కొంది. 72,436 మందికి వైరస్ సోకినట్టు నిర్ధారణ అయ్యిందని,1.41 లక్షల మంది వైరస్ ప్రభావానికి గురైనట్టు అనుమానిస్తున్నామని వైద్యులు తెలిపారు. కరోనాపై పోరాడేందుకు చైనా-ప్రపంచ ఆరోగ్య సంస్థ చేపట్టిన ఉమ్మడి కార్యచరణలో భాగంగా అమెరికా తదితర దేశాలకు చెందిన నిపుణులు చైనా రాజధాని బీజింగ్‌కు చేరుకున్నారని, వైరస్‌ను కట్టడి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తున్నారని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి జెంగ్ షుయాంగ్ తెలిపారు. చైనాలో ప్రస్తుత పరిస్థితులు అంతగా చేజారిపోనప్పటికీ, తీవ్ర ప్రమాదకరంగానే ఉన్నాయని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ పేర్కొన్నారు. మరోవైపు, జపాన్‌లోని యెకోహోమా తీరంలో నిలిపేసిన ‘డైమండ్ ప్రిన్సెస్’ నౌకలోని ప్రయాణికులకు కరోనా పరీక్షలుకొనసాగుతున్నాయి. వైరస్ సోకలేదని తేలిన దాదాపు 500 మందిని బుధవారం విడుదల చేయనున్నట్టుఅధికారులు తెలిపారు.

### వైద్య సిబ్బందికి అవస్థలు

కరోనా వల్ల మెడికల్ సిబ్బందికి కూడా పెను ప్రమాదం పొంచి ఉన్నట్టు ఎన్‌హెచ్‌సీ హెచ్చరించింది. అయితే, వైరస్ ప్రభావం అధికంగా ఉన్న వుహాన్ నగరంలో వైద్యులు మాస్కులు, బాడీసూట్‌ల కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు, వైరస్ సోకి గతవారం ఆరుగురు వైద్య సిబ్బంది మరణించారని, మరో 1,716 మంది వైద్య సిబ్బంది వైరస్‌బారినపడ్డట్టు అధికారులు వెల్లడించారు.

## బహిష్ఠులో ఉన్నప్పుడు వంట చేస్తే కుక్కలై పుడతారు

- ఆ వంట తిన్న భర్తలు ఎద్దులుగా జన్మిస్తారు
- స్వామి నారాయణ్ ఆలయ పూజారి స్వామి కృష్ణస్వరూప్ వివాదాస్పద వ్యాఖ్యలు



స్వామి కృష్ణస్వరూప్ దాస్‌జీ

**అహ్మదాబాద్, ఫిబ్రవరి 18:** రుతుస్రావంలో ఉన్న మహిళలు తమ భర్తల కోసం వంట చేస్తే వచ్చే జన్మలో ఆడ శునకాలుగా జన్మిస్తారని గుజరాత్‌లోని స్వామినారాయణ్ ఆలయానికి చెందిన పూజారి స్వామి కృష్ణస్వరూప్ దాస్‌జీ సెలవిచ్చారు. ఆ భోజనం తిన్న భర్తలు వచ్చే జన్మలో ఎద్దులుగా పుడతారని పేర్కొన్నారు. ఈ విషయం శాస్త్రాలలో స్పష్టంగా ఉన్నదని ఉద్ఘాటించారు. గుజరాత్‌లోని భుజ్‌లో ఇటీవల 60 మంది విద్యార్థినులకు రుతుస్రావ పరీక్షలు జరిపి వివాదంలో చిక్కుకున్న శ్రీ సహజానంద్ బాలికల కళాశాలను స్వామినారాయణ్ ఆలయం ట్రస్ట్ నిర్వహిస్తుండటం గమనార్హం. ‘బహిష్ఠులో ఉన్న స్త్రీలు చేసిన వంటను తిన్న పురుషులు వచ్చే జన్మలో ఎద్దులై పుడతారు.. ఇది నిశ్చయం’ అని ఆ స్వామీజీ పేర్కొన్నారు. తన అభిప్రాయాలు ఎవరికి ఇష్టం ఉన్నా లేకపోయినా.. ఈ విషయాలన్నీ మన శాస్త్రాల్లో రాసి ఉన్నాయని చెప్పారు. ఆలయానికి వచ్చిన ప్రజలనుద్దేశించి సదరు స్వామి గుజరాతీలో ప్రసంగించారు. స్వామి నారాయణ్ ఆలయంలోని ‘నర్-నారాయణ్ దేవ్‌గడీ’ శాఖలో స్వామి కృష్ణస్వరూప్ 1995 నుంచి పనిచేస్తున్నారు. రుతుస్రావం మహిళలకు ఓ శిక్ష వంటిదన్నారు. ‘రుతుస్రావ సమయం ఓ తపస్సు వంటిదన్న విషయాన్ని మహిళలు గ్రహించలేరు. ఇది మన శాస్త్రాల్లో ఉంది. రుతుస్రావ సమయంలో స్త్రీలు వంటగదికి దూరంగా ఉండాలి గనుక.. పురుషులు వంట చేయడం నేర్చుకోవాలి’ అని చెప్పారు. స్వామినారాయణ్ ఆలయానికి చెందిన పూజారులు చేసిన ఇటువంటి ప్రసంగాల వీడియోలు ఆలయానికి సంబంధించిన యూట్యూబ్ చానెల్‌లో అందుబాటులో ఉన్నాయి. ఈ ఆలయం ట్రస్ట్ నిర్వహిస్తున్న శ్రీసహజానంద్ బాలికల విద్యా సంస్థలో విద్యార్థినులపై పలు ఆంక్షలు అమలులో ఉన్నాయి. హాస్టల్‌లో ఉండే విద్యార్థినులు రుతుస్రావం సమయంలో తోటివారితో కలిసి భోజనం చేయరాదని నిబంధనలు అక్కడ ఉన్నాయి. ఈ నిబంధనలను అతిక్రమించారన్న ఆరోపణపైనే ఈ నెల 11న కళాశాల ప్రిన్సిపాల్ రీటా రణింగా, హాస్టల్ రెక్టర్ రమలీబెన్ హిరానీలు 60 మంది విద్యార్థినులకు రుతుస్రావ పరీక్షలు జరిపారు. ఈ ఘటనపై తీవ్ర విమర్శలు రావడంతో ప్రిన్సిపాల్, రెక్టర్‌ను పోలీసులు అరెస్టు చేశారు.



## పాక్ అణు క్షిపణి ‘రాద్-2’ పరీక్ష విజయవంతం

**ఇస్లామాబాద్:** అణు సామర్థ్యం గల క్రూయిజ్ క్షిపణి ‘రాద్-2’ను పాకిస్థాన్ విజయవంతంగా పరీక్షించింది. 600 కి.మీ. దూరంలోని లక్ష్యాన్ని ఛేదించే సామర్థ్యం దీనికి ఉన్నది. దీన్ని భూమిపై నుంచిగానీ, సముద్రంపై నుంచిగానీ పరీక్షించవచ్చు. పాక్ అధికారులు మాట్లాడుతూ రాద్-2కు అధునాతన నావిగేషన్ వ్యవస్థను అనుసంధానించామని చెప్పారు. లక్ష్యాన్ని కచ్చితత్వంతో ఛేదించడం దీని ప్రత్యేకత అని తెలిపారు. ఈ పరీక్ష విజయవంతం కావడంతో పాక్ శక్తిసామర్థ్యాలు మరింత పటిష్ఠం కానున్నాయని పేర్కొన్నారు.

# పాక్ శాంతిని కోరుకుంటున్నది

- కర్తార్‌పూర్ కారిడార్ దీనికి నిదర్శనం
- గురుద్వారాను సందర్శించిన ఐరాస అధినేత గుటెరస్



కర్తార్‌పూర్‌లోని గురునానక్ సమాధిపై పుష్పగుచ్ఛం ఉంచుతున్న గుటెరస్

**లాహోర్, ఫిబ్రవరి 18:** పాకిస్థాన్ శాంతిని కోరుకుంటున్నదని, కర్తార్‌పూర్ కారిడార్ నిర్మాణమే దీనికి నిదర్శనమని ఐక్యరాజ్యసమితి (ఐరాస) సెక్రటరీ జనరల్ ఆంటోనియా గుటెరస్ తెలిపారు. సిక్కు మత వ్యవస్థాపకుడైన గురు నానక్ దేవ్ తుదిశ్వాస విడిచిన కర్తార్‌పూర్‌లోని గురుద్వారా దర్బార్ సాహిబ్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. పాకిస్థాన్ సిక్కు గురుద్వారా ప్రబంధ కమిటీ, వలసవాద ఆస్తుల ట్రస్ట్ బోర్డు అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. పాక్, భారత్ సరిహద్దుల మధ్య నిర్మించిన కర్తార్‌పూర్ కారిడార్ ప్రాముఖ్యతను గుటెరస్‌కు వివరించారు. గురుద్వారా సందర్శన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శాంతిని, మత సామరస్యాన్ని పాక్ ఆకాంక్షిస్తున్నదని, కర్తార్‌పూర్ కారిడార్ నిర్మాణమే దీనికి ప్రత్యక్ష ఉదాహరణ అని చెప్పారు. భారత్‌తో పాటు, ఇతర దేశాల్లోని సిక్కు యాత్రికుల కోసం పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తీసుకున్న చొరవను గుటెరస్ ప్రశంసించారు. సిక్కు యాత్రికులకు కల్పిస్తున్న సౌకర్యాలపట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పాక్‌లోని దర్బార్ సాహిబ్‌ను, భారత్‌లోని గురుదాస్‌పూర్‌లోని డేరా బాబా నానక్‌ను కలుపుతూ పాక్, భారత్ సంయుక్తంగా నిర్మించిన కర్తార్‌పూర్ కారిడార్‌ను గత ఏడాది నవంబర్‌లో ఇరు దేశాల ప్రధానులైన ఇమ్రాన్ ఖాన్, మోదీ తమతమ భూభాగాల్లో ప్రారంభించిన సంగతి తెలిసిందే.

## గ్రే లిస్ట్‌లో పాక్!

- ఎఫ్ఏటీఎఫ్ ఉపసంఘం సిఫార్సు
- ఈ నెల 21న తుది నిర్ణయం

**న్యూఢిల్లీ:** ఉగ్రవాదులకు నిధుల సరఫరాను అడ్డుకోవడంలో విఫలమైన పాకిస్థాన్‌ను ‘గ్రే’ జాబితాలోనే కొనసాగించాలని అంతర్జాతీయ ఉగ్రవాద నిధుల నిరోధక సంస్థ ‘ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్-ఎఫ్ఏటీఎఫ్’కు చెందిన ఒక ఉపసంఘం సిఫార్సు చేసింది. దీనిపై ఎఫ్ఏటీఎఫ్ శుక్రవారం తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. పారిస్‌లో జరుగుతున్న ఎఫ్ఏటీఎఫ్ ప్లీనరీ సమావేశాల సందర్భంగా మంగళవారం జరిగిన ‘ఇంటర్నేషనల్ కోఆపరేషన్ రివ్యూ గ్రూప్’ (ఐఆర్‌సీజీ) భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. పాక్ గ్రే జాబితా నుంచి వైట్ జాబితాలోకి రావాలంటే ఎఫ్ఏటీఏలోని 39 దేశాల్లో 12 దేశాలు మద్దతివ్వాలి. బ్లాక్ లిస్ట్‌లో చేరకుండా ఉండాలంటే కనీసం మూడు దేశాల మద్దతు అవసరం. గతేడాది చైనా, మలేషియా, టర్కీ మద్దతివ్వడంతో బ్లాక్ లిస్ట్‌లో చేరే ప్రమాదం నుంచి పాక్ గట్టెక్కింది.

## భీమా-కోరెగావ్ కేసును కేంద్రానికి అప్పగించం

- ఎల్గార్ పరిషత్, భీమా-కోరెగావ్ వేర్వేరు అంశాలు
- ఎన్పీఆర్‌ను రాష్ట్రంలో అమలు చేస్తాం
- మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రే



ఉద్ధవ్ ఠాక్రే

**ముంబై, ఫిబ్రవరి 18:** భీమా-కోరెగావ్ కేసును కేంద్రానికి అప్పగించబోమని మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రే స్పష్టం చేశారు. ఎల్గార్ పరిషత్ కేసు దర్యాప్తును జాతీయ దర్యాప్తు బృందానికి (ఎన్ఐఏ) అప్పగించాలని మహారాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదంటూ ఇటీవల వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర సంకీర్ణ ప్రభుత్వంలోని భాగస్వామ్య పార్టీలైన ఎన్సీపీ, కాంగ్రెస్ ఉద్ధవ్ లక్ష్యంగా విమర్శలు గుప్పించాయి. దీంతో మంగళవారం ఉద్ధవ్ ఠాక్రే ట్వీట్ చేస్తూ ‘2017లో పుణెలోని శనివార్‌వాడా వద్ద జరిగిన ఎల్గార్ పరిషత్ సదస్సు సందర్భంగా కొందరు రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినట్లు.. దీని ప్రభావంతో భీమా-కోరెగావ్ వద్ద హింస చెలరేగినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. దీన్నిబట్టి ఎల్గార్ పరిషత్, భీమా-కోరెగావ్ అనేవి రెండు వేర్వేరు అంశాలు. భీమా-కోరెగావ్ కేసును కేంద్రానికి అప్పగిస్తే దళిత సోదరులకు న్యాయం జరిగే అవకాశం లేదు. కాబట్టి ఈ కేసును కేంద్రానికి అప్పగించను’ అని పేర్కొన్నారు. మరోవైపు, ఎన్పీఆర్‌ను మహారాష్ట్రలో అమలు చేస్తామని, దీని వల్ల నష్టమేమీ లేదని ఉద్ధవ్ ఠాక్రే తెలిపారు.



నాకు ఇతర పార్టీలో చేరడం లేదా కూటమిలో చేరాలనే లక్ష్యమేదీ లేదు. రానున్న వందరోజుల్లో 'బాత్ బీహార్ కీ' అనే కార్యక్రమం ప్రారంభిస్తున్నాం. దేశంలోని మొదటి పది అగ్రశ్రేణి రాష్ట్రాల్లో బీహార్ ఉండాలని విశ్వసించే వారందరూ ఇందులో పాలుపంచుకునేలా చేయడంపైనే నా దృష్టి ఉన్నది.

**ప్రశాంత్ కిశోర్, జేడీయూ మాజీ ఉపాధ్యక్షుడు**

'నేను ఎవరితోనూ కలత చెందలేదు. నేను శివరాజ్‌సింగ్ చౌహాన్‌తోనే కలత చెందలేదు. అట్లాంటిది సింధియా గురించి ఎందుకు కలవరపడుతాను?.

**కమల్‌నాథ్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి**



**చరిత్రలో నేడు**



**1878**

గ్రామఫోన్ (ఫోనోగ్రాఫ్)పై పేటెంట్ హక్కులు పొందిన థామస్ ఎడిసన్.

**1920**



నానాజాతి సమితిలో చేరిన నెదర్లాండ్స్.



**1959**

రాజ్యాంగాన్ని ఆవిష్కరించుకున్న గాబన్.

నేపాల్‌లోని లలిత్‌పూర్‌లోని ఒక పాఠశాలలో ఉపాధ్యాయుడు తమను లైంగికంగా తరచు వేధించినట్టు పదమూడేండ్ల లోపు బాలికలు రాతపూర్వక ఫిర్యాదు చేశారు. ఒక్క లలిత్‌పూర్‌లోనే కాదు, దేశవ్యాప్తంగా బడులలో ఇటువంటి లైంగిక వేధింపుల సమస్యలు ఉన్నాయని తెలుస్తున్నది. అయితే ఇవి సాధారణంగా బయటకు రావు. ఇటువంటి ఆరోపణలు వచ్చినప్పుడు దర్యాప్తు జరిపి చర్య తీసుకోవడం తమ బాధ్యత అని పాఠశాల యాజమాన్యాలు గుర్తించాలె. ప్రభుత్వం తగిన మార్గదర్శక సూత్రాలు జారీచేయాలె.

**ది హిమాలయన్ టైమ్స్**

బంగ్లాదేశ్‌లో రాజధాని ఢాకా రోడ్ల మీదనే నిషేధించిన త్రిచక్ర వాహనాలను తిరుగాడుతున్నాయి. వీటికి నంబర్ ప్లేట్స్ కూడా ఉండవు. డ్రైవర్లు ఇంత బాహాటంగా వీటిని ఎట్లా నడుపగలుగుతున్నారు? అధికారులు ముడుపులు తీసుకుంటున్నారనేది స్పష్టం. టూస్ట్రోక్ ఇంజిన్లు గల త్రిచక్ర వాహనాలను నిషేధించాలని 2003లోనే ప్రభుత్వం నిర్ణయించింది. అయినా ఇన్నేండ్ల తరువాత కూడా ఈ నిర్ణయం ఎందుకు అమలు జరుగడం లేదు? ఇటువంటి వాహనాలను వెంటనే రోడ్ల పై తిరుగకుండా చేయవలసిన బాధ్యత అధికార యంత్రాగానిది.

**ది డైలీ స్టార్**



# వివక్షపై విజయం

మహిళలు సుప్రీంకోర్టు సాక్షిగా మరో అడ్డుగోడను బద్దలుకొట్టారు! సైన్యంలో మహిళా అధికారుల పట్ల సాగుతున్న వివక్షను తొలిగిస్తూ సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. మహిళా అధికారులకు నాయకత్వ బాధ్యతలు (కమాండ్) అప్పగించాలని స్పష్టంగా చెప్పింది. పదేండ్ల కిందటే హైకోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా, అమలు కాకపోవడంతో కేంద్ర ప్రభుత్వాన్ని సవాలు చేస్తూ పోరాడిన మహిళా అధికారులు అభినందనీయులు. మహిళలు శారీరకంగా బలహీనంగా ఉంటారని, గర్భందాల్చడంతోపాటు, మాతృత్వ, కుటుంబ బాధ్యతలుంటాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొనడాన్ని న్యాయస్థానం తీవ్రంగా తప్పుపట్టింది. ఇది మూస ఆలోచనా విధానమని కొట్టివేసింది. సైనికులు గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన మగవారు ఉంటారని, వారు మహిళ నాయకత్వాన్ని అంగీకరించలేరనే వాదనను కూడా న్యాయస్థానం అంగీకరించలేదు. ఇంతకాలం మహిళలను షార్ట్ సర్వీస్ కమిషన్‌కే పరిమితం చేస్తూ పూర్తి ఉద్యోగ కాలం, పురుషులతో సమాన ప్రయోజనాలు ఇవ్వకుండా తృణీకరిస్తున్నారు. మహిళలు తమకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని, ప్రాధాన్యం ఇవ్వమని కోరడం లేదు. తాము పురుషులతో సమానంగా విధులు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామంటున్నారు. తమకున్న అడ్డంకులను తొలిగించాలని కోరుతున్నారు. తమ వివక్ష చూపకూడదనేదే వారి వాదన. తాము సమాన బాధ్యతలు నిర్వహిస్తామని అంటున్నప్పటికీ, మీకు సాధ్యం కాదని తిరస్కరించడమే ఇంతకాలం సాగింది. మహిళలకు సమాన అవకాశాలు లభించకపోవడానికి వారి కృషిలో లోపం కాదని, మగవారి ఆలోచనా విధానమే అడ్డంకి అని దీనివల్ల స్పష్టమవుతున్నది.

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పోరాటం మినహా ఇతరరంగాల్లో పైస్థాయి పురుషులతో సమానంగా పైస్థాయి పదవులు పొందే అర్హత ఏర్పడ్డ ది. మహిళా కల్నల్ 850 మందితో కూడిన బెటాలియన్‌కు నాయకత్వం వహించవచ్చు. బ్రిగేడియర్, మేజర్ జనరల్, లెఫ్టినెంట్ జనరల్ మాత్రమే కాదు, సూత్రప్రాయంగా ఆర్మీ చీఫ్ కూడా కావచ్చు. కానీ పోరాట విధుల్లో చూపిన ప్రతిభ ప్రాతిపదికగా ఉంటుంది. మహిళలను పోరాట విధులకు నియోగించడం లేదు కనుక ఈ అనుభవం వారికి లభించదు. మహిళా అధికారులకు సైన్యంలోని పది విభాగాలలో సమాన అవకాశాలు కల్పించడంపైనే సుప్రీంకోర్టు విచారించింది. పోరాట విధుల్లో నియోగించడంపై విచారణ జరుగలేదు. పిటిషనర్లు లేవనెత్తిన అంశాలలో ఈ విభాగం లేదు. అయినప్పటికీ సుప్రీంకోర్టు తాజా తీర్పు ద్వారా మహిళలు ఏమీ సాధించలేదని అనలేము. కల్నల్ హోదాలో ఉన్న అధికారికి స్వతంత్రంగా విధులు నిర్వహించే అవకాశాలు లభిస్తాయి. సైన్యంలో ఇంజినీరింగ్- ఇన్-చీఫ్, గూఢచారి విభాగం అధిపతి వంటి ఉన్నత స్థానాలు పొందవచ్చు. వైద్య విభాగంలో అవకాశం ఇప్పటికే ఉండటంతో జనరల్, ఎయిర్ మార్షల్, అడ్మిరల్ హోదాలను అందుకున్నారు. తెలంగాణ బిడ్డ రాణి రుద్రమ శతాబ్దాల కిందటే పరిపాలనా విధులు నిర్వర్తించడమే కాకుండా కరవాలం దూసి కదనరంగంలో తన ప్రతాపాన్ని ప్రదర్శించింది. ఝాన్సీ లక్ష్మీభాయి పోరాటం తెలిసిందే. మహిళల నాయకత్వ లక్షణాలను కించపరుచడం, అడ్డుగోడలు నిర్మించడం భావ్యం కాదు.

> **రాజకీయపక్షాలు పరస్పర విమర్శలకు దిగే కన్నా సామాజిక మార్పు కోసం తమవంతుగా ఇంకా ఏమి చేయగలమనేది ఆలోచించడం మంచిది. మహిళా సాధికారత దిశగా ప్రభుత్వాలు చేయవలసింది ఎంతో ఉన్నది. 2019 డిసెంబర్ నాటి వివరాల ప్రకారం ప్రపంచ ఆర్థిక వేదిక జెండర్ గ్యాప్ ఇండెక్స్‌లో మన దేశం 112 వ స్థానంలో ఉన్నది. గతంలో కన్నా మరో నాలుగు స్థానాలు దిగజారింది. ఈ సూచిక స్త్రీ పురుష తారతమ్యాన్ని సూచించదు.**

సుప్రీంకోర్టు ముందు కేంద్ర ప్రభుత్వం మహిళలకు వ్యతిరేకమైన వైఖరి తీసుకోవడం రాజకీయంగా కూడా వివాదాస్పదమైంది. మహిళా అధికారులు అర్హులు కాదని వాదించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం మహిళలను అవమానించిందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు. కానీ మహిళా అధికారుల తరపున వాదించిన బీజేపీ నాయకురాలు మీనాక్షి లేఖి మాత్రం హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టుకు అప్పీలు చేసింది యూపీఏ ప్రభుత్వమే అనేది గుర్తుచేశారు. కేంద్రం తమ అభిప్రాయాన్ని సమర్పించింది కూడా యూపీఏ హయాంలోనే అని ఆమె అన్నారు. యూపీఏ, ఎన్డీయే ప్రభుత్వాలు రెండూ మహిళా అధికారులకు వ్యతిరేకంగా వ్యవహరించాయనేది స్పష్టం. వాస్తవానికి రాజ్యాంగంలో సమానత్వాన్ని గుర్తించినప్పటికీ, అన్ని రంగాలలో ఆచరించడం ఇప్పుడిప్పుడే సాగుతున్నది. సైన్యంలో కూడా వివిధ హోదాలలో మహిళలు కీలక బాధ్యత పోషించే సమయం వచ్చింది. కాకపోతే కేంద్ర ప్రభుత్వం మహిళా అధికారులకు వ్యతిరేకమైన వైఖరి తీసుకోక పోవలసింది. రాజకీయపక్షాలు పరస్పర విమర్శలకు దిగే కన్నా సామాజిక మార్పు కోసం తమవంతుగా ఇంకా ఏమి చేయగలమనేది ఆలోచించడం మంచిది. మహిళా సాధికారత దిశగా ప్రభుత్వాలు చేయవలసింది ఎంతో ఉన్నది. 2019 డిసెంబర్ నాటి వివరాల ప్రకారం ప్రపంచ ఆర్థిక వేదిక జెండర్ గ్యాప్ ఇండెక్స్‌లో మన దేశం 112 వ స్థానంలో ఉన్నది. గతంలో కన్నా మరో నాలుగు స్థానాలు దిగజారింది. ఈ సూచిక స్త్రీ పురుష తారతమ్యాన్ని సూచించదు. ఆరోగ్యం, విద్య, ఆర్థిక, రాజకీయ రంగాలలో మహిళలు ఎంత అసౌకర్యంగా ఉన్నారో తెలుపుతుంది. ఈ అసమానత తొలగాలంటే మహిళలకు సమానస్థాయి కల్పించడానికి సమాజం మానసికంగా సిద్ధం కావాలె. మహిళల ఎదుగుదలకు ప్రధాన అడ్డంకి సమాజ ఆలోచనా ధోరణే.

**జనగళం**

## అప్పుడే ప్రజలు ఆదరిస్తారు

బీజేపీ నేతలకు తెలంగాణ సోయి లేదు. ఎంతసేపూ అధికారపార్టీపై విమర్శలు చేయడమే కానీ రాష్ట్ర ప్రయోజనాలు వారికి పట్టవు. పార్లమెంటు వేదికగా ఎన్నడూ రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టుల గురించి గానీ రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధుల గురించి గట్టిగా డిమాండు చేసిన దాఖలాలు కనిపించవు. కానీ టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం మేమే అని ఊకదంపుడు ఉపన్యాసాలు మాత్రం ఇస్తుంటారు. ఏ పార్టీ అయినా అధికారంలోకి రావాలనుకోవడంలో తప్పులేదు. కానీ అందుకు తగిన విధంగా రాష్ట్ర ప్రయోజనాలు, హక్కుల గురించి కూడా పనిచేయాలి. అప్పుడే ప్రజలు ఆదరిస్తారు. ఈ విషయం బీజేపీ నేతలకు తెలువదని అనుకోలేం. కానీ అసత్యాలు, విష ప్రచారాలతో అధికారంలోకి రావాలనుకోవడం హాస్యాస్పదం. తెలంగాణ ప్రజలు చాలా చైతన్యవంతులు. అందుకే రాష్ట్రం సిద్ధించేదాకా పోరాటాన్ని ఆపలేదు. ఈ విషయాన్ని బీజేపీ నేతలు తెలుసుకోవాలి. అధికారం కోసం అబద్ధాలు చెప్పి ప్రజల మభ్యపెట్టాలని అనుకుంటే ఏమౌతుందో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు తగినవిధంగా సమాధానం చెప్పారు. కాబట్టి ఇప్పటికైనా బీజేపీ నేతలు తెలంగాణ సోయితో పనిచేయాలి. విమర్శలకే పరిమితం కాకుండా రాష్ట్రాభివృద్ధి కోసం, కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి తమవంతు ప్రయత్నం చేయాలి. అప్పుడే ఎంతోకొంత ప్రజలు ఆదరిస్తారు.

- కె. కుమారస్వామి, జనగామ

## అనర్హులుగా ప్రకటించాలె

దేశవ్యాప్తంగా ఉన్నటువంటి రాజకీయ నాయకుల్లో ఎక్కువ మంది నేర చరిత్ర కలిగి ఉన్నవారే ఉన్నారని ఇటీవల సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఆయా పార్టీలు నేర చరిత్ర కలిగిన నాయకుల పేర్లు బహిర్గతం చేయాలంటూ కూడా ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా త్వరగా నేర విచారణ చేయించాలని, శిక్షలు పడ్డవారికి వెంటనే అనర్హులుగా ప్రకటించాలని తీర్పునిచ్చింది. అయితే ఈ తీర్పును అన్ని రాజకీయపార్టీలు ఆహ్వానించడం హర్షణీయం. విచారణలో నేరం రుజువైతే ఆయా నాయకులను శాశ్వతంగా రాజకీయాల నుంచి దూరం చేయాలి. అప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లు తుంది. ఆదిశగా చర్యలు తీసుకోవాలి.

- రాయపురం మనీష, బోయినపల్లి

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

భాష



**డాక్టర్ దేవరాజు మహారాజు**

# భాషే మన ఐడీ కార్డు

ప్రాణి మనుగడకు ముఖ్యంగా కావల్సింది గాలి, నీరు, ఆహారం. గాలి ఉంటేనే ప్రాణి బతుకుతుంది. దానికి నీరు, ఆహారం అవసరమౌతాయి. సాహిత్యానికి కూడా అలాంటివే మూడు కావాలి. భాష, రూపం, వస్తువు. భాష ఉంటేనే సాహిత్యానికి ఒక రూపం ఏర్పడుతుంది. రూపం పాఠకుడి మనసులో బొమ్మ కడితేనే వస్తువు ప్రకటింపబడుతుంది. దీన్నిబట్టి వస్తువు కన్నా, రూపానికన్నా భాష ఎంత ముఖ్యమో అర్థం చేసుకోవచ్చు. భాషే మన ఐడీ కార్డు.

భాషను మించిన ఐడెంటిటీ కార్డు మనకు ఇంకొకటి లేదు. సూది వెంట దారంలా భాష వెంట సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం వగైరా అన్నీ వాటంతట అవే సాహిత్యంలో వచ్చిచేరుతాయి. అయితే ఇప్పుడు వాటిని కొంచెం ఎడిట్ చేసుకోవాల్సిన తరుణం వచ్చింది.

సాహిత్యంలో భాషను, యాసను నిలుపుకోవడమంటే మన తల్లి పాల తీయదనాన్ని మనం గుర్తు చేసుకున్నట్టు. మన మట్టి వాసనను మనం ఎలుగెత్తి చాటుకున్నట్టు. రెపరెపమనే మన జెండాను మనం ఎగరేసుకున్నట్టు. మన చిరునామా మనం సరిగా చెప్పుకున్నట్టు. భాషే మూలం. యాసే కేంద్రకం. ఫలానా జిల్లావాణ్ని అని చెబితే చిరునామా పూర్తిగా చెప్పినట్టు కాదు. ఇంకా లోతుల్లోకి, మూలాల్లోకి వెళ్లాలి. ఏ మండలమో, ఏ గ్రామమో, ఏ వీధో చెపితే గాని మన చిరునామా పూర్తి కాదు. చిరునామాను విశ్లేషించి చూస్తే అది వర్గాన్ని, ఆర్థిక స్థోమతను కూడా తెలియజేస్తుంది. ఒక ప్రాంతం నుంచి వెలువడ్డ రచన మనకు అనేక విషయాలు తెలియజేస్తుంది. పువ్వు వెంట వచ్చే తావి లాగా. ఇక సాహిత్యం జీవిత దర్శనం అయినప్పుడు, జీవితానికి సంధించిన అన్ని అంశాలు, అన్ని పార్శ్వాలు అందులో చోటుచేసుకుంటాయి. ప్రధానంగా భాష! అసలు భాషే మూల వాహిక కనుక. భాష ఎంత స్పష్టంగా ఎంత సరళంగా వాడితే, ఆ రచన అంత స్పష్టంగా అంత సరళంగా అంత బలంగా తయారవుతుంది.

సాహిత్య పరిణామక్రమంలో ఒకప్పుడు పండితులు మాత్రమే రచనలు చేసేవారు. రచనలు గ్రాంధికంలో వచ్చేవి. భూస్వామ్య వ్యవస్థ పోయి ప్రజాస్వామ్య వ్యవస్థ వచ్చినట్లుగా సాహిత్యం గ్రాంధికంలోంచి వ్యావహారికంలోకి మారింది. వ్యావహారిక భాషను పత్రికా భాష, ఉమ్మ డి భాష అని ఏ పేరుతోనైనా పిలుచుకోవచ్చు. కానీ ప్రామాణిక భాష ఏదీ అంటే, ఏ ప్రాంతానికి ఆ ప్రాంతీయ భాషే ప్రామాణికం. సృజనాత్మక రచనలు ఆయా ప్రాంతీయ భాషల్లో వచ్చినప్పుడే బలంగా ఉంటున్నాయన్న విషయం నిర్వివాదాంశం. పరిపాలనా వ్యవస్థకు శాస్త్ర సాంకేతిక విషయ వివరణకు ఉమ్మడి భాషను ఉపయోగించుకోవచ్చు. ఎందుకంటే ఆ భాష. అందులోని విషయం అన్ని ప్రాంతాలవారికి అందాల్సి ఉంది గనుక. సృజనాత్మక రచనలు కూడా ఉమ్మడి భాషలో చేపట్టొచ్చు. విషయాన్ని ప్రతిభావంతంగా దర్శింపజేయొచ్చు. ఒక ప్రాంతానికి చెం దిన భాషను, యాసను ఉపయోగించి రచన వెలువడితే అది ఇతర ప్రాం తాలవారికి అర్థం కాదనేది తప్పు. కొన్ని సాహిత్య విలువలతో దానిలోని స్ఫూర్తి, ఆర్తి నేరుగా అన్ని ప్రాంతాల పాఠకులకు అందుతుంది. స్వానుభవంతో చెప్పేదేమంటే తెలంగాణ ప్రజల భాషలో నేను తొలుత రాసిన కవితలు, కథలూ తెలుగు రాష్ట్రాలలోనూ వాటి బయటా అన్ని ప్రాంతాల వారికి అర్థమయ్యాయి. పైగా అవి ప్రజ ల భాషలో రాసినందుకే శక్తిమంతమైనాయని అందరూ ఒప్పుకున్నారు. అర్థం కాలేదని ఎవరూ అనలేదు.

ప్రత్యేకంగా ప్రజల భాషలో రచనలు రావడానికి చాలా సంవత్సరాలకు ముందే ఆ భాషా పదాలు సాహిత్యంలో జొరబడ్డాయి. మన ప్రాచీన సాహిత్య ప్రక్రియలైన పద కవిత, తత్వ కవిత, మార్గ కవిత, శతకం, ద్విపద లాంటి వాటిలో ప్రజల భాషలోని పదాలు చాలా కనబడుతాయి. రచనలు ప్రజలకు అర్థం కావాలి. అందుబాటులోకి రావాలనే భావనలోంచే కవులు తమ రచనల్లో ప్రజా భాషా పదాల్ని ఎక్కువగా వాడి ఉంటారు. ఒకరకంగా చెప్పాలంటే ప్రాచీనకాలం నుంచి నేటి అత్యాధునిక యుగం వరకు ఉన్న కవులు, రచయితల్లో కొంతమంది తమ రచనలు జానపద సాహిత్యానికి దగ్గరగా లేదా సమాంతరంగా ఉండాలనుకోవడం వల్ల, ప్రజల భాషలోని పదాలు లిఖిత సాహిత్యంలో అంతర్భాగమయ్యాయి, అవుతున్నాయి, అవుతాయి.

ఉమ్మడి భాషలో ప్రాంతీయ పదాలు జొప్పించి ఒకరకమైన స్వతంత్ర ప్రత్యేక ప్రాంతీయ భాషకు రూపకల్పన జరుగుతూ ఉంది. ఉదాహరణకు 'బతుకులోని తండ్లాటను తెలుసుకో' అనే వాక్యంలో 'తండ్లాట' అనేది తెలంగాణ పల్లెల్లో విరివిగా వినిపించే మాట! మిగతా పదాలు అన్నీ తెలుగు ప్రాంతాల్లో వినిపించే మాటలు. నేత పనివారి జీవితాల గూర్చి వచ్చే రచనల్లో-వారి వృత్తికి సంబంధించిన పదాలు చేరుతాయి. బొగ్గు గనుల్లో పనిచేసే వారి జీవితాల గూర్చి వచ్చే రచనల్లో వారికి పరిమితమైన సాంకేతిక పదజాలం సాహిత్యంలో చేరుతుంది.

తెలుగైపోయిన ఉరుదూ పదాలతో ఒక రకమైన భాష హైదరాబాదు పాత బస్తీలో వినిపిస్తుంది. 'అద్దం వేసేయండి. గాలి జొరబడి బాధిస్తోంది' అని ఆ మాటకు అర్థం ఈ విధంగా తెలంగాణ ప్రజల భాష ఉరుదూ, ఫారసీ, అరబ్బీ, సంస్కృతం, కన్నడం, మరాఠీ లాంటి అనేక భాషల పదాలతో తయారయ్యింది. ఆధునికకాలంలో విద్యావంతుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ ఇంగ్లీషు పదాలు ఎక్కువగా చేరుతున్నాయి. ఫలితంగా ఉమ్మడి భాష పెరుగుతూ ఉండటంతో పాటే ప్రాంతీయ భాష కూడా పెరుగుతూ ఉంది. గమనించవల్సిన విషయమేమంటే, ఒక ప్రాంతీయ భాషలోనే అనేకానేక భాషా భేదాలున్నాయి. ఉంటాయి. ఎక్కడికక్కడ అవి ఉమ్మడి భాషలో కలిసిపోతుంటాయి. సమకాలీన సాహిత్యరంగంలో ఎంతోమంది ప్రతిభామూర్తులు నిజాయితీగా తమ తమ మూలాల్ని వెతికిచూపుతున్నారు. వారంతా తమ గళంలో ఒదిగిన భాష ను, యాసను తమ కలంలో జొప్పించి గర్వించదగిన సాహిత్యాన్ని సృష్టిస్తున్నారు. వారందరినీ మనస్ఫూర్తిగా అభినందించవల్సిందే!

> వాస్తవాలు తెలుసుకోవడంలోనే సగం జీవితం గడిచిపోయింది. కాలం వృథా అయిపోయింది అని బాధపడుతున్నది. ఆ పరిస్థితి రాబోయే తరాలకు రాకూడదు. సంస్కృతి, సంప్రదాయం పేరుతో గతంలోని చెత్తనంతా వచ్చే తరాల మీద బలవంతంగా రుద్దకూడదు. వారి రెక్కల మీద మోయలేని భారం వేసి, సంశయంలో పడదోసి వారి జీవితాలు దుర్భరం చేయకూడదు.

సాహిత్యం స్పష్టంగా ఉండాలి. నిజాయితీలోంచి రావాలి. చిత్తశుద్ధిలోంచి రావాలి. నిజాల్ని వెల్లడించాలి. మరి ఇవన్నీ ఉండాలన్నప్పుడు సమాజంలోని మనుషుల్లాగానే ఆయా ప్రాంతపు సాహిత్య పాత్రలు కూడా ఆయా సమాజాల్లోంచే రావాలి. అలాంటప్పుడు పలుకుబళ్ళు, జాతీయాలు, నుడికారాలు తప్పనిసరి. అవన్నీ ఉన్నప్పుడే సాహిత్యం సమాజపు ఆత్మలో అంతర్భాగమైపోతుంది. పచ్చి నిజాలు ఉన్నవి ఉన్నట్లుగా రాస్తే అది సాహిత్యం కాదు. వాస్తవాల మీద కాల్పనిక సృజనాత్మకత ఒక సన్నని పొరలా కప్పి ఉండాలి. అప్పుడే ఆ నిజాలు సాహి త్య విలువలుగా మారిపోతాయి. సరే, ఈ విషయాలు ఇట్లా ఉండనిద్దాం.

చివరగా మరొక ముఖ్యమైన విషయం గురించి ఆలోచిద్దాం. భాషా సాహిత్యాల గురించి మనం ఎన్ని విషయాలైనా మాట్లాడుకోవచ్చు. భాషా విద్వేషాల గురించి, భాషోద్యమాల గురించి ఎంతైనా చర్చించుకోవచ్చు. ప్రతి ఒక్కరూ తల్లి పాలు తాగి పెరిగితేనే ఆరోగ్యంగా ఉంటారు. అలాగే మాతృభాషలోనే విషయాలు సులువుగా నేర్చుకోగలుగుతారు. ఎదుగుతున్న కొద్దీ ప్రపంచదేశాలెన్ని తిరిగినా, ఎంతోమందిని కలిసినా, తల్లి స్థానం తల్లికే ఉంటుంది. తల్లి లాంటి పుట్టిపెరిగిన ఊరి స్థానం ఆ ఊరికే ఉంటుంది. ఎవరూ కాదనలేరు. కాని ఇప్పుడు కొంచెం వైజ్ఞానికంగా ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ యుగ స్పృహను జీవితానికి అన్వయించుకోవాల్సిన అవసరం వచ్చింది.

మాతృభాష సరే. కాని, అందులో మనం పిల్లలకు ఏం నేర్పుతున్నామన్నది కూడా ఇప్పుడు చాలా ముఖ్యం! పసి పిల్లలు నిలకడగా కూర్చుంటున్న దశలోనే మన వాళ్లు 'జేజకు దండం పెట్టు' అని చెపుతుంటారు. ఇంకొంచెం పెరగగానే 'చందమామ రావే జాబిల్లి రావే' అని పాడి వినిపిస్తుంటారు. కొంచెం కొంచెం మాటలు వస్తున్న దశలోనే 'చేత వెన్న ముద్ద. చెంగల్వ పూదండ' అని దేవుడి వర్ణనలతో పాఠాలు ప్రారంభమవుతాయి. జీవితంలో ఎప్పుడూ ఎక్కడా వెన్నముద్ద తినే కల్పిత పాత్ర కృష్ణుడు కనపడకపోయినా సరే-వాస్తవం ఏమంటే వేల యేళ్లు గడిచినా చందమామ దిగిరాలేదు. మనిషే చంద్రుడి పైకి వెళ్లి రావల్సి వచ్చింది. ఊహల్లోంచి, భ్రమల్లోంచి వచ్చేది సాహిత్యమైతే, వాస్తవంలోంచి, నిజంలోంచి వచ్చేది సైన్సు. 'పద పద పోదాం.. చంద్రుడి పైకి' అని పాడాల్సిన సమయం వచ్చింది కాదా? దేవుడు, దయ్యం, భూతాలు, మహిమలు, మాయల కథలు మానేసి మానవుడి శౌర్యగాథలు చెప్పాల్సిన సమయం, మానవుడి నూతన ఆవిష్కరణల గురించి చెప్పాల్సిన సమయం వచ్చేసింది.

'జానీ-జానీ -యస్ పాప్పా/ ఈటింగ్ షుగర్? / నో పాప్పా/ టెల్లింగ్ లైస్? లేదా 'అప్ ఎబౌవ్ ది హిల్' కాని 'ట్వింకిల్ లిటిల్ స్టార్' లాంటి ఇంగ్లీషు రైమ్స్ పర్యావరణం గూర్చి, సామాజిక జీవనం గూర్చి, వ్యక్తిత్వ వికాసం గూర్చి ఉన్నాయి. దేవుడి గూర్చి, భక్తి గూర్చి, మతం గూర్చి లేవు. ఏ దేశంలో ఏ భాషలో ఎలాంటి అబద్ధపు పాటలు ఉన్నా అవి పిల్లలకు నేర్పడం మానెయ్యాలి. వారికి వాస్తవాలు చెప్పడం అవసరం. ఇప్పుడున్న తరం ఏమనుకుంటోందంటే.. చిన్నప్పటి నుంచి పెద్దలు చెప్పినవన్నీ అబద్ధాలు కదా? వాస్తవాలు తెలుసుకోవడంలోనే సగం జీవితం గడిచిపోయింది. కాలం వృథా అయిపోయింది అని బాధ పడుతున్నది. ఆ పరిస్థితి రాబోయే తరాలకు రాకూడదు. సంస్కృతి, సంప్రదాయం పేరుతో గతంలోని చెత్తనంతా వచ్చే తరాల మీద బలవంతంగా రుద్దకూడదు. వారి రెక్కల మీద మోయలేని భారం వేసి, సంశయంలో పడదోసి వారి జీవితాలు దుర్భరం చేయకూడదు. చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూడనివ్వాలి. మానవీయ విలువల్ని దర్శింపనీయాలి. భాష మన ఐడి కార్డు నిజమే! బాల్యంలో బోధన మాతృభాషలోనే జరుగాలి. నిజమే! అదే న్యాయం. అయితే వాస్తవ దృక్కోణం లోంచి వైజ్ఞానికంగా జరుగాల్సి ఉంది.

# ప్రాణవాయువును పరిరక్షిద్దాం

హరితహారం



**బంధు శ్రీకాంత్ బాబు**

వేన కళ్లెదుట రెండు సంఘటనలు. ఒకటి అమెజాన్ అడవులు తగలపడటం, మరొకటి ఆస్ట్రేలియాలో కార్చిచ్చు. వాస్తవానికి అమెజాన్ అడవిని భూమాతకు ఊపిరితిత్తులతో పోల్చుతారు. అంటే ప్రపంచానికి అవసరమైన ఆక్సీజన్ సుమారు 20 శాతానికి పైగా ఒక్క అమెజాన్ అడవుల నుంచే మనకు అందుతుంది. అయితే గతేడాది ఈ అడవుల్లో మంటల వల్ల ఏకంగా 3,500 చ.కి.మీ.మేర అడవి నాశనమైంది. ఇది ప్రపంచానికి పశ్చిమాన జరిగితే, ఇక తూర్పున ఆస్ట్రేలియాలో బుష్ ఫైర్ అనే కార్చిచ్చు వ్యాపించింది. ఈ రెండు సంఘటనలు పర్యావరణపరంగా ప్రపంచానికి ముప్పు పొంచి ఉన్నదన్న సత్యాన్ని మన ముందుంచాయి. గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి ఆస్ట్రేలియాలో వేసవి ఉష్ణోగ్రతలు నలభై డిగ్రీలను దాటాయి. అంతేకాదు రానున్న కాలంలో ఈ వేడి 48-49 డిగ్రీలకు చేరుకోవచ్చని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రమాద ఘంటికలను మన దేశం అర్థం చేసుకోవాలి.

ఇక మన తెలంగాణ విషయానికి వస్తే, అదృష్టవశాత్తూ పర్యావరణ స్పృహ, అడవులపై ప్రేమ ఉన్న వ్యక్తి మనకు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆరేండ్ల కిందట సీఎం కాగానే తీసుకున్న ముఖ్యమైన నిర్ణయాల్లో తెలంగాణకు హరితహారం ఒకటి. రాష్ట్రవ్యాప్తంగా 230 కోట్ల మొక్కలు నాటడం, తెలంగాణను హరితవనంగా చేయటం ఈ కార్యక్రమ లక్ష్యం. అప్పటి చర్చల్లో పాల్గొని, హరితహారం రూపకర్తల్లో ఒకరైన ఓ సీనియర్ అధికారి ఇటీవల మాట్లాడుతూ ఓ మాట అన్నారు. అసలు చెట్టు అవసరాన్ని, పర్యావరణ హితాన్ని ఇంతలా కోరుకున్న ప్రభుత్వాన్ని తన సర్వీసులో చూడలేదన్నాడు. ప్రతీ నిర్ణయం ఓట్ల రాజకీయం, ప్రతీ పాలసీ వ్యక్తిగత ప్రయోజనాల చుట్టూ తిరుగుతున్న నేటి రాజకీయాలు మనం చూస్తున్నాం. కానీ అందుకు భిన్నంగా తెలంగాణలో ఉన్నది. మనం బాగుండాలి, మన చుట్టూ వాతావరణం బాగుండాలనే విన్-విన్ సూత్రం పాలకులు అమలుచేస్తున్నారు. పర్యావరణం, పచ్చని చెట్లు, ఇంటికి ఆరు మొక్కలు, కనిపెంచిన పిల్లలకు ఆస్తుల కంటే, మంచి నివాసయోగ్యమైన ఆవాసాన్ని ఇద్దామంటూ సీఎం కేసీఆర్ పదేపదే చెబుతున్నారు. సమయం, సందర్భం ఏదైనా సరే, పర్యావరణ అవసరాన్ని చెట్లు విరివిగా పెంచాల్సిన అగత్యాన్ని సీఎం పదేపదే వివరిస్తున్నారు. అందరి బుర్రల్లో పచ్చని మొక్కల అవసరాన్ని నాటే ప్రయత్నం చేస్తున్నారు. అనుకున్న ఫలితాల్లో ఆలస్యం జరుగొచ్చు. కానీ సంకల్పం మంచిదైనప్పుడు, తప్పకుండా పాజిటివ్ ఫలితమే వస్తుంది. విశాల ప్రయోజనాల కోసం కాళేశ్వరం లాంటి జనహిత ప్రాజెక్టులను నిర్మించుకోవటం వల్ల అటవీప్రాంతం కొంతమేర కోల్పోయాం. ప్రత్యామ్నాయ అటవీకరణ ద్వారా ఆ అడవిని మళ్లీ పునరుజ్జీవింపచేసుకోవాల్సిన బాధ్యత మనందరిదీ. కేవలం ప్రభుత్వ సంకల్పంతో ఫలితాలు రావు, అవసరాన్ని గుర్తించి ప్రతీపౌరుడూ ఓ పర్యావరణహిత కార్యకర్త కావాలి. నాటిన మొక్కలు ఎన్ని, వాటిలో బతికిన శాతం ఎంతో చూడాల్సిన బాధ్య త ఒక్క ప్రభుత్వానిదే కాదు పౌరులందరిది. నాటిన మొక్కలు బతుకాలంటే తన వంతుగా ఏం చేయాలన్న సామాజిక ప్రతీ వ్యక్తిలో, సంస్థలో తక్షణావసరం.

గ్రామాలన్నీ పచ్చగా, పరిశుభ్రంగా ఉండాలంటూ సీఎం కేసీఆర్ పల్లె ప్రగతిని ప్రారంభించారు. త్వరలో పట్టణ ప్రగతీ మొదలౌతుంది. వీటి లక్ష్యం ఒక్కటే పర్యావరణ సంకల్పం ప్రతీ ఒక్కరిలో ఉండాలి. ఇళ్లు, వాడలు, ఊళ్లతో పాటు రాష్ట్రమంతా చక్కనైన పరిశుభ్రత, చిక్కనైన పచ్చదనం నిండాలి. దేవుడు దయవల్ల ఈ ఏడాది మంచి వానలు పడ్డాయి. కాళేశ్వరం ఇచ్చిన ఫలితాలతో రాష్ట్రమంతటా నీటి భాండాగారమైంది. ఇప్పుడు చేయాల్సిందల్లా మన సొంత పనులతో పాటు, కాస్త సామాజిక బాధ్యత కూడా కలిగిఉండాలి. కంటికి కనిపించే మొక్కలకు కొన్ని నీళ్లు పోయటం, కొంత రక్షణ కల్పించటం. గత ఐదేండ్లుగా ప్రభుత్వం చేపట్టిన హరితహారం ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. అయితే చెట్లను కొట్టినంత వేగంగా అవి పెరుగవు. కానీ ఒక్కసారి వేళ్లూనుకుంటే మాత్రం పెరిగి, పెద్దవై మనకు జీవనాధారమైన ఆక్సీజన్ ఇవ్వటంతో పాటు, పుట్టిన వ్యక్తి గిట్టేదాకా చెట్టుతో అనుబంధం కొనసాగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా చెట్లు నాటి సామాజిక వనాలను పెంచవచ్చు. అదే పట్టణ ప్రాంతాలకు వచ్చేసరికి అనేకపరిమితులు. భూమి కొరతతో పాటు పట్టణ జీవితంలోని వేగం, సామాజిక స్పృహను దాటేస్తుంది. అందుకే ప్రభుత్వం పట్టణ ప్రాంతాలకు సమీపంలో ఉన్న అడవులను అభివృద్ధి చేసి పట్టణ ప్రాంత అటవీ పార్కులను ఏర్పాటు చేస్తున్నది. తెలంగాణలో ఒక్కో పట్టణ ప్రాంతానికి సమీపంలో కనీసం ఒక్కటైనా ఇలాంటి పార్కులను ఏర్పాటుచేయాలనేది ప్రభుత్వ ఆశయం. నగర జీవులకు నిత్య జీవితంలో ఉండే ఒత్తిళ్ల నుంచి ఉపశమనం కల్పించటం, నిత్యం వాకింగ్, జాగింగ్, సైక్లింగ్, యోగా లాంటి సౌకర్యాలతో పాటు వారాంతాల్లో కుటుంబాలతో సహా సేదతీరే పిక్నిక్ స్పాట్లుగా ఇవి అభివృద్ధి చెందుతున్నాయి. ప్లాస్టిక్‌రహిత ప్రాంతాలుగా, స్వచ్ఛమైన గాలిని అందించే అర్బన్ లంగ్ స్పేస్‌లుగా ఇవి మనకు అందుబాటులోకి వస్తున్నాయి.

> సీఎం కేసీఆర్ స్వయంగా చెప్పినట్లు రేపటి రోజు కోట్ల సంపాదన ఒకవైపు, కాలు ష్యకారకమైన పరిసరాలు మరోవైపు ఉంటే, మన వారసులకు మనం ఇవ్వాల్సిందేమిటి. ఆస్తులా, నివాసయోగ్యమైన పరిసరాలా? ప్రత్యేకంగా సమాధానం చెప్పాల్సిన అవసరం లేని ప్రశ్నలివి. అంతేకాదు ఈ ప్రశ్నలకు సమాధానం అందిరికీ తెలుసు, ఈ సమస్యకు పరిష్కారం కూడా అందరివద్దా ఉన్నది. పర్యావరణహితమైన సమాజం నిర్మాణం కోసం మన వంతు మొక్కలు నాటుదాం, వాటి రక్షణ కోసం పాటుపడుదాం.

ప్రభుత్వ నినాదమైన 'జంగల్ బచావో-జంగల్ బడావో' స్ఫూర్తిని మనమంతా అందిపుచ్చుకోవాలి. అడవి అవసరాలను భావితరాలకు అర్థమయ్యేలా చెప్పటంతో పాటు, ఉన్న అడవులను రక్షించుకోవటం, కొత్తగా పచ్చదనాన్ని విస్తరించుకోవటం ఈ నినాదం పరమార్థం. అత్యంత వేగంగా పట్టణీకరణ జరుగుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఒకటి, ఆ లెక్కన మనకు కూడా పర్యావరణ ప్రమాదం పొంచి ఉన్నట్లే. ప్రపంచవ్యాప్తంగా పట్టణీకరణ, పారిశ్రామిక అభివృద్ధి పర్యావరణానికి గొడ్డలిపెట్టుగా మారాయి. అగ్రదేశాలు కార్బన్ ఉద్గారాలను తగ్గించే విషయంలో అంతర్జాతీయ వేదికల మీద ఉపన్యాసాలను దంచుతున్నాయే తప్ప, వాస్తవంలో ఆచరణ శూన్యం. అన్ని నీతులు చెప్పే ఆ అగ్రదేశాలే పర్యావరణానికి కలిగిస్తున్న నష్టం ఎక్కువ. అందుకే మన జాగ్రత్తల్లో మనం ఉండాలి. మన చుట్టూ ఆవాసాన్ని, పచ్చదనాన్ని రక్షించుకోవాలి. పెంచుకోవాలి. లేదంటే రానున్నరోజుల్లో ప్రమాదం తప్పదు.

తెలంగాణలో ఉష్ణోగ్రతలు పరిధి దాటుతున్నాయి. కోస్తాకే పరిమితమైన ఉక్కపోత క్రమంగా మన వాతావరణంలోకి చొచ్చుకొస్తున్నది. సమయం మించిపోలేదు, ఇంతకు మించిన తరుణమూ లేదు. సామాజిక స్పృహ ఉన్న ముఖ్యమంత్రి, సహకరించే ప్రభుత్వం ఉన్నప్పుడు ఆ మేరకు పర్యావరణ లబ్ధి పొందకపోతే వ్యక్తులది, సమాజానిదే తప్పు అవుతుంది. భవిష్యత్ తరాలు కాలుష్యం కోరల్లో చిక్కుకొని, నేటి ఢిల్లీలా స్వచ్ఛమైన గాలిని పీల్చుకోలేని, శుభ్రమైన నీటిని తాగలేని పరిస్థితి వస్తే అందుకు కారణమైన మనమందరమూ దోషులమవుతాం. అందుకే సీఎం కేసీఆర్ స్వయంగా చెప్పినట్లు రేపటి రోజు కోట్ల సంపాదన ఒకవైపు, కాలుష్యకారకమైన పరిసరాలు మరోవైపు ఉంటే, మన వారసులకు మనం ఇవ్వాల్సిందేమిటి. ఆస్తులా, నివాసయోగ్యమైన పరిసరాలా? ప్రత్యేకంగా సమాధానం చెప్పాల్సిన అవసరంలేని ప్రశ్నలివి. అంతేకాదు ఈ ప్రశ్నలకు సమాధానం అందిరికీ తెలుసు, ఈ సమస్యకు పరిష్కారం కూడా అందరివద్దా ఉన్నది. పర్యావరణహితమైన సమాజం నిర్మాణం కోసం మన వంతు మొక్కలు నాటుదాం, వాటి రక్షణ కోసం పాటుపడుదాం.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com



ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్న హజ్ కమిటీ అధ్యక్షుడు మసిఉల్లాఖాన్



గ్రీన్ చాలెంజ్‌లో భాగంగా మొక్కనాటి నీళ్లుపోస్తున్న ఇన్ఫోసిస్ హైదరాబాద్ హెడ్ బొడ్డుపల్లి రఘు



గచ్చిబౌలిలోని హిల్‌రిడ్జ్ విల్లాస్‌లో మొక్కనాటుతున్న సంగీత దర్శకుడు కోటి. చిత్రంలో ఎమ్మెల్యే గువ్వల

## మామిడి హరికృష్ణకు ఉత్తమ అధికారి పురస్కారం

- భాషా సాంస్కృతికశాఖ డైరెక్టర్‌కు ప్రదానంచేసిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అధికారిగా పురస్కారాన్ని అందజేసింది. డైరెక్టర్ హోదాలో ఐదేండ్లుగా ఆయన అందించిన సేవలకుగాను ఈ అవార్డును ప్రదానం చేసింది. సోమవారం హైదరాబాద్‌లో పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ కార్యాలయంలో ఆయన.. హరికృష్ణకు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ.. ఈ అవార్డును 2018లోనే ప్రకటించినప్పటికీ.. అదే సమయంలో ఎన్నికలు రావడంతో అవార్డు ప్రదానం వాయిదా పడిందని తెలిపారు. సీఎం కేసీఆర్ పుట్టినరోజున ఈ పురస్కారం లభించడం చాలా ఆనందంగా ఉన్నదని చెప్పారు. ఈ అవార్డును భాషా సాంస్కృతికశాఖకు అంకితం చేస్తున్నట్టు పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, కళల విస్తరణకు మరింత కృషిచేస్తానని చెప్పారు.



హరికృష్ణకు అవార్డు ఇస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



## గుర్తింపులేని కాలేజీలపై కఠిన చర్యలు

- ఇంటర్ బోర్డు సమీక్షలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రారామచంద్రన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని గుర్తింపులేని ప్రైవేట్ జూనియర్ కాలేజీలపై కఠినవైఖరి అవలంబించేందుకు ఇంటర్ బోర్డు సిద్ధమైంది. మంగళవారం ఇంటర్ బోర్డు అధికారులతో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రారామచంద్రన్ సమీక్ష నిర్వహించారు. ఈసారి మే నెలలోనే ప్రైవేట్ కాలేజీల అఫిలియేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని భావిస్తున్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం యూట్యూబ్ చానల్ ఏర్పాటుచేసి వచ్చే జూన్ నుంచి వీడియో పాఠాలను అందుబాటులోకి తీసుకురావడంపై కసరత్తు చేస్తున్నారు. 79 ప్రైవేట్ కాలేజీలకు గుర్తింపులేని విషయాన్ని గుర్తించిన బోర్డు.. ఇందుకు సంబంధించిన నివేదికను బుధవారం ప్రభుత్వానికి అందజేయనున్నది. సమీక్షా సమావేశంలో ఇంటర్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఒమర్ జలీల్ తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కాలేజీల్లో 30% యాజమాన్య కోటా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో వచ్చే (2020-21) విద్యాసంవత్సరం నుంచే 30 శాతం యాజమాన్య కోటా అమలుచేయాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించి, ఇందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. 3 లక్షలకుపైగా ఉన్న డిగ్రీ సీట్లలో 30 శాతం సీట్లు యాజమాన్య కోటా ద్వారా భర్తీచేస్తే, మిగిలిన 70 శాతం సీట్లు దోస్త్-2020 కన్వీనర్ కోటా ద్వారా భర్తీచేయాలని భావిస్తున్నది. ఈ మేరకు ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు వెసులుబాటు కల్పించినట్టు దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ లింబాద్రి తెలిపారు. కన్వీనర్ కోటా మాదిరిగానే యాజమాన్య కోటా సీట్ల భర్తీ, సర్టిఫికెట్ల పరిశీలన ఆన్‌లైన్ ద్వారా చేపడుతామని చెప్పారు. పలు అంశాలపై చర్చించడానికి మార్చి మొదటివారంలో దోస్త్ కమిటీ సమావేశం కానుంది. ఆ వెంటనే నోటిఫికేషన్ విడుదల చేస్తారు.

## వినూత్న పీజీ డిప్లొమా కోర్సులు

- బాలవికాస, టిస్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బాలవికాస సంస్థ, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్) సంయుక్త ఆధ్వర్యంలో వినూత్న పీజీ డిప్లొమా కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చామని బాలవికాస సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇన్నోవేటివ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ , సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పేరిట 18 నెలల కోర్సులను ఏప్రిల్ 1 నుంచి ప్రారంభించనున్నట్టు చెప్పారు. అభ్యర్థులు ఈ నెల 19 నుంచి మార్చి 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు www.bvic.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు.

## ఉగ్రవాది తుండా కేసులో తీర్పు మార్చి 3న

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉగ్రవాది అబ్దుల్ కరీం తుండా కేసులో తుది తీర్పును మార్చి 3వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు నాంపల్లి ప్రత్యేక కోర్టు మంగళవారం వెల్లడించింది. వాస్తవానికి మంగళవారం తుది తీర్పు వస్తుందని భావించినప్పటికీ మరోమారు తీర్పు వాయిదాపడింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గజియాబాద్ జైల్లో ఉన్న తుండాను నాంపల్లి ప్రత్యేక కోర్టు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించింది. దేశంలో పలుచోట్ల జరిగిన పేలుళ్లు, పేలుళ్ల కుట్ర కేసుల్లో అబ్దుల్ కరీం తుండా నిందితుడిగా ఉన్నాడు. సీసీఎస్‌లో పేలుళ్లకు కుట్రపన్నిన కేసులో కూడా తుండా నిందితుడు.

## వరద జలాల వినియోగంపై కమిటీ వేయండి

కృష్ణాబోర్డుకు తెలంగాణ ఈఎన్సీ లేఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కృష్ణాబేసిన్‌లో ప్రాజెక్టులు పొంగిపొర్లిన సమయంలో రెండు రాష్ట్రాలు వినియోగించుకున్న కృష్ణాజలాల లెక్కలను తేల్చేందుకు కమిటీని నియమించాలని తెలంగాణ నీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్‌రావు.. కృష్ణాబోర్డును కోరారు. తాజాగా బోర్డు సభ్యకార్యదర్శికి లేఖరాశారు. జనవరి 9న జరిగిన బోర్డు సమావేశంలో ఈ అంశం చర్చకు వచ్చిందని, తదుపరి బోర్డు సమావేశంలో దీనిని ఎజెండాగా ఉంచాలని రెండురాష్ట్రాలు నిర్ణయించినట్టు తెలిపారు. దీనిపై ఒక కమిటీని నియమిస్తామని బోర్డు చైర్మన్ చెప్పిన విషయాన్ని లేఖలో గుర్తుచేశారు.

## బస్టాండుల్లో చాటింపు

మైక్‌ల ద్వారా బస్సుల వివరాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'ముఖ్యగమనిక.. ఫలానా రైలు మరికొద్ది సేపట్లో ప్లాట్‌ఫాం నంబర్ 3 నుంచి బయలుదేరనున్నది' అంటూ రైల్వేస్టేషన్లలో ఎప్పటికప్పుడు ప్రయాణికులను అప్రమత్తం చేస్తున్న విధానాన్ని టీఎస్‌ఆర్టీసీ బస్టాండ్లలోనూ ప్రవేశపెట్టింది. ప్రయాణికులను ఆకర్షించడంపై దృష్టిసారించిన రవాణా సంస్థ.. రూట్లు, బస్సులు, రిజర్వేషన్ తదితర వివరాలను ప్రయాణికులు సులువుగా తెలుసుకొనేలా కొత్త విధానాన్ని చేపట్టింది. అన్ని వివరాలను ప్రయాణికులకు చేరవేసేందుకు మైక్ అనౌన్స్‌మెంట్ సిస్టంను తీసుకొచ్చింది. తొలుత ఎంజీబీఎస్, జేబీఎస్ బస్టాండ్లలో ఏర్పాటుచేసిన ఈ సదుపాయంతో ప్రయాణికులు మరింత సౌకర్యంగా గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. మంగళవారం వీటిని పరిశీలించిన ఆర్టీసీ ఎండీ సునీల్‌శర్మ, ఈడీ యాదగిరి.. మెరుగైన సేవలందిస్తున్న సిబ్బందిని అభినందించారు. త్వరలో అన్ని డిపోల పరిధిలోని ప్రయాణ ప్రాంగణాల్లో, ముఖ్యమైన కూడళ్లలో ఈ విధానాన్ని ఏర్పాటుచేసి, సంస్థ ఆర్థికాభివృద్ధికి కృషిచేయాలని కోరారు.

## గాంధీలో కొనసాగుతున్న కొవిడ్ నిర్ధారణ పరీక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొవిడ్-19 వైరస్ పట్ల ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తున్నది. జాతీయ ఆరోగ్య విభాగం సూచనల ప్రకారం తెలంగాణ వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీ దవాఖానలో వైరస్ అనుమానితులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిరంతరం కొనసాగుతున్నాయి. మంగళవారం వరకు 99 మందికి నిర్ధారణ పరీక్షలు చేయగా.. అందులో 98 మందికి వ్యాధి లక్షణాలు లేవని నిర్ధారించారు. ఒక వ్యక్తికి సంబంధించిన నివేదిక అందాల్సి ఉన్నది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇప్పటివరకు 10,652 మందికి థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.

# చరిత్ర తెలుసుకో కిషన్!


మొదటిపేజీ తరువాయి...


హైదరాబాద్ గల్లీ నుంచి ఢిల్లీకి పంపిన ప్రజల రుణం తీర్చుకోవాల్సిందిపోయి అవమానించారని పలువురు మండిపడుతున్నారు. ప్రస్తుతం ఆయన ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్‌లోనే దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కేంద్రం ఉన్నది. దేశంలో రైల్వేశాఖకు భారీ ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న జోన్ ఇదే. గతంలో ఆయన ఎమ్మెల్యేగా పనిచేసిన అంబర్‌పేట నియోజకవర్గంలో మరో ప్రముఖ రైల్వేస్టేషన్ కాచిగూడ ఉన్నది. ప్రధాని మోదీకి భజనచేసేందుకు తెలంగాణను కించపరుచొద్దని, కిషన్‌రెడ్డి చరిత్ర చదువుకోవాలని తెలంగాణవాదులు సూచిస్తున్నారు. అహంకార పూరిత వ్యాఖ్యల్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### రైల్వేలో తెలంగాణది ఘన చరిత్ర

తెలంగాణలో రైల్వేప్రస్థానాన్ని పరిశీలిస్తే.. దాదాపు 130 ఏండ్ల కిందటే ఇక్కడ రైల్వేవ్యవస్థకు బీజంపడింది. 1870లో నిజాం స్టేట్ రైల్వేవ్యవస్థ తెలంగాణ ప్రజల సొంతడబ్బుతో ఏర్పాటయింది. 1907లో నాంపల్లి రైల్వేస్టేషన్, 1916లో కాచిగూడ రైల్వేస్టేషన్ నిర్మించారు. ఆ సమయంలో దేశంలోని అనేక రాష్ట్రాల పరిధిలో అసలు రైలు అంటేనే తెలియని పరిస్థితి. 1966లో నిజాం స్టేట్ రైల్వే దక్షిణ మధ్యరైల్వేగా మారింది. కిషన్‌రెడ్డికి ఈ మాత్రం అవగాహన లేకపోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. కిషన్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం అంతా హైదరాబాద్‌తోనే ముడిపడి ఉన్నది. ఆయన ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన అంబర్‌పేట పరిధిలోనే కాచిగూడ రైల్వేస్టేషన్ ఉండగా, బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి దగ్గర్లోనే నాంపల్లి రైల్వేస్టేషన్ ఉన్నది. వీటికి శతాబ్దాల చరిత్ర ఉంటే, మోదీ ప్రధాని అయ్యాకే కొత్తగా రైళ్లు తిరుగుతున్నాయని వ్యాఖ్యానించడం ఆయన అవగాహనారాహిత్యానికి నిదర్శనంగా నిలుస్తున్నదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. 'హోదా ఆభరణంలా ఉండాలి.. ప్రజాసేవలో ఉన్న రాజకీయనాయకులైతే హుందాగా వ్యవహరించాలి. ఏకంగా కేంద్రమంత్రి హోదాలో ఉన్న కిషన్‌రెడ్డి.. ప్రధానికి భజనచేసే క్రమంలో స్థాయిని, అవగాహనను అటకెక్కించి.. పుట్టినగడ్డను, తలెత్తుకొనేలా సహకరించిన ప్రజలను కించపరిచారు. తెలంగాణ చరిత్రపై అవగాహన లేకపోవడంతోపాటు మోదీ భజన కోసం లేనిగొప్పల్ని చెప్పేప్రయత్నంలో నీచానికి దిగజారారు' అని తెలంగాణవాదులు విమర్శిస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ తోటి బీజేపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేసినప్పటికీ, కిషన్‌రెడ్డి రాజీనామా చేయకుండా తప్పించుకొన్నారని గుర్తుచేస్తున్నారు. తెలంగాణపై కిషన్‌రెడ్డికి ఎంతప్రేమ ఉన్నదో.. ఉద్యమ సమయం నుంచి నేటి ఎర్రబస్సు మాటలవరకు అర్థమవుతూనే ఉన్నదని ఎద్దేవాచేస్తున్నారు.



### నెట్టింట చెడుగుడు

తెలంగాణ చరిత్రను మరుగునపడేస్తూ కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణవాదులు నెట్టింట చెడుగుడు ఆడుతున్నారు. తెలంగాణ రైల్వే ప్రస్థానాన్ని ఉదహరిస్తూ.. ఆయన తీరును ఎండగడుతున్నారు. 1938లో జనవరి 12న.. అంటే 82 ఏండ్ల కిందట నిజాం స్టేట్‌రైల్వే ముక్కోటి ఏకాదశికి భద్రాచలం వెళ్లే భక్తులకు రైల్వేలో రాయితీపై ఇచ్చిన ప్రకటన అచ్చయిన గోల్కొండ పత్రికను పోస్టుచేసి కిషన్‌రెడ్డిపై విరుచుకుపడుతున్నారు. మోదీ వచ్చాకే తెలంగాణకు రైలంటే తెలిసిందనే వ్యాఖ్యలపై సెటైర్లు వేస్తున్నారు. 'ప్రధానిమోదీ పుట్టిన సంవత్సరం 1950, మోదీ అమ్మగారు పుట్టిన సంవత్సరం 1920, మోదీ అమ్మమ్మగారు పుట్టిన సంవత్సరం 1890 (సుమారుగా).. మరి తెలంగాణలో రైల్వే మొదలైన సంవత్సరం 1870. ఎవరికి ఎవరు రైల్వే అంటే తెలియజెప్పారు?' అంటూ చురకలంటిస్తున్నారు. మోదీ వచ్చాకే ఇక్కడ రైల్వే సౌకర్యం వచ్చిందా? అసలు తెలంగాణలో రైళ్లు తిరగడం మొదలుపెట్టినపుడు ప్రధాని మోదీ సొంతరాష్ట్రమైన గుజరాత్‌లో విద్యుత్ కూడా లేదంటూ నెటిజన్లు వాస్తవాన్ని కండ్లముందుంచారు. 'తెలంగాణ భూమి పుత్రులారా.. పొరపాటున బీజేపీ వంటి పార్టీలను నమ్మితే బతుకును కుక్కలు చింపిన విస్తరిచేస్తరు తస్మాత్‌జాగ్రత్త' అంటూ నెటిజన్లు హెచ్చరిస్తున్నారు.

## తెలంగాణ ప్రజలకు ఎర్రబస్సే తెలుసు

కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జీ కిషన్‌రెడ్డి వ్యాఖ్య

**కంటోన్మెంట్, నమస్తే తెలంగాణ:** 'రైల్వే అంటే తెలంగాణ ప్రజలకు తెల్వదు. ఎర్రబస్సు తప్ప నో రైల్వేస్ ఇన్ తెలంగాణ ఏరియా. కేవలం ఎర్రబస్సు మాత్రమే ఎక్కే అలవాటుండేది. నరేంద్ర మోదీ ప్రభుత్వం వచ్చాకే అనేక కొత్త రైళ్లను ప్రారంభించారు' అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జీ కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ ప్రారంభించారు. అనంతరం క్లాక్‌టవర్ సమీపంలోని టైమ్‌స్క్వేర్ హోటల్‌లో మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం వచ్చాక తెలంగాణలో 48 కొత్త రైళ్లను అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. అనేక దశాబ్దాలుగా తెలంగాణ నిర్లక్ష్యానికి గురైందని, మోదీ ప్రభుత్వంలో తెలంగాణకు న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, ఎంపీలు బండి సంజయ్, ధర్మపురి అరవింద్, సోయం బాపురావు తదితరులు పాల్గొన్నారు.



నిజాం రైల్వేకు సంబంధించి కాచిగూడ రైల్వే మ్యూజియంలో భద్రపరిచిన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పాత చిత్రం




హైదరాబాద్ పర్యటనలో భాగంగా 1933లో నాంపల్లి రైల్వేస్టేషన్‌ను సందర్శించిన లార్డ్ అండ్ లేడీ విల్లింగ్‌డన్ (ఫైల్)


నిజాంస్టేటు రైల్వే

ముక్కోటి ఏకాదశి పర్వ దినము

తగ్గింపు రిటర్ను టిక్కెట్లు

1938లో జనవరి 12న నిజాం స్టేట్‌రైల్వేలో రాయితీ గురించి గోల్కొండ పత్రికలో ప్రచురితమైన వార్త

# డబుల్ ఇండ్ల పేరిట మోసం

- జీహెచ్‌ఎంసీ ఉద్యోగి సహా ఐదుగురిపై కేసు
- నలుగురు నిందితుల అరెస్ట్.. పరారీలో ఒకరు

**బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ:** డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇప్పిస్తానని రూ.లక్షలు కాజేసిన ఓ ముఠాలోని నలుగురిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టుచేశారు. ముఠాలో కీలక సభ్యుడైన జీహెచ్‌ఎంసీ ఉద్యోగి పరారీలో ఉన్నాడు. మంగళవారం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో వెస్ట్‌జోన్ డీసీపీ ఏఆర్ శ్రీనివాస్ వివరాలు తెలిపారు. మెహదీపట్నంకు చెందిన మహ్మద్ షహర్యార్‌అలీ అలియాస్ హైదర్ అలీ గతంలో బహుదూర్‌పుర మండల కార్యాలయంలో రెవెన్యూఇన్‌స్పెక్టర్‌గా పనిచేశాడు. ఇటీవల జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని భూసేకరణ విభాగానికి డిప్యూటేషన్‌పై వచ్చాడు. బహుదూర్‌పుర మండల కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగినిగా పనిచేస్తున్న ఛత్రినాక సుల్తాన్‌షాహీకి చెందిన మేకల జ్యోతి(43)తో కలిసి భారీమోసానికి పథకం రచించాడు. రహ్మత్‌నగర్‌కు చెందిన మందర అనుపమ(39), అసిఫ్‌నగర్‌కు చెందిన గోప లక్ష్మి(39), రహ్మత్‌నగర్‌కు చెందిన ఒగ్గు జయంతి (30)తో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్మిస్తున్న డబుల్‌బెడ్‌రూం ఇండ్లను ఇప్పిస్తామంటూ వందలమంది నుంచి రూ.18 వేల చొప్పున వసూలుచేశారు. అనుమానం రాకుండా మీ సేవ కేంద్రాల్లో చలానా కట్టించడంతోపాటు దరఖాస్తులు అందినట్టు రశీదు ఇచ్చారు. జిల్లా కలెక్టర్ పేరిట రూపొందించిన స్టాంప్‌వేసి ఇల్లు మంజూరు పత్రాలను సృష్టించారు. లక్కీడ్రాలో లబ్ధిదారులను ఎంపికచేసినట్టు నమ్మించేందుకు టోకెన్లను కూడా తయారుచేయించారు. రహ్మత్‌నగర్‌లోని కే శ్రీదేవి నుంచి మందర అనుపమ డబ్బుతీసుకొని నకిలీ ఇంటి మంజూరుపత్రాలు ఇవ్వడంతోపాటు త్వరలో మాదాపూర్‌లో ఇల్లు కేటాస్తారని నమ్మించింది. ఈ విషయం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు చేరడంతో, స్థానిక టీఆర్‌ఎస్ నాయకులు ఆరాతీయగా మోసం బయటపడింది. ఎమ్మెల్యే సూచనతో శ్రీదేవి ఈ నెల 12న జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులు మేకల జ్యోతి, అనుపమ, లక్ష్మి, జయంతిని మంగళవారం అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు హైదర్‌అలీ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. విలేకరుల సమావేశంలో బంజారాహిల్స్ ఏసీపీ కేఎస్‌రావు, జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ సత్తయ్య పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న డీసీపీ ఏఆర్ శ్రీనివాస్, ఏసీపీ కేఎస్ రావు

## సమత దోషులకు ఉరి ధ్రువీకరించండి

- శిక్ష ధ్రువీకరణకు కేసును హైకోర్టుకు రిఫర్ చేసిన ఆదిలాబాద్ కోర్టు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆదిలాబాద్ సమత లైంగికదాడి కేసులో దోషులుగా తేలిన షేక్‌బాబు, షేక్‌షాబుద్దీన్, షేక్‌మగ్దూంకు విధించిన ఉరిశిక్షను ధ్రువీకరించాలని కోరుతూ ఆదిలాబాద్ కోర్టు.. కేసు ప్రొసీడింగ్స్‌ను రిఫర్ ట్రయల్ (ఆర్టీ) నిబంధన కింద హైకోర్టుకు సిఫారసు చేసింది. మంగళవారం ఈ రిఫర్ ట్రయల్‌పై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం.. దోషులకు నోటీసులు జారీచేసి వారి వివరణ సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 24వ తేదీకి వాయిదా వేసింది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్పీసీ)-1973లోని సెక్షన్ 366 ప్రకారం ఏదైనా తీవ్ర నేరానికి సంబంధించి దిగువ కోర్టు ఉరిశిక్ష విధిస్తే.. ఆ శిక్షను హైకోర్టు ధ్రువీకరించాల్సి ఉంటుంది.

## ఇండియా సిమెంట్స్ ఈడీ కేసులు వాయిదా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** క్విడ్ ప్రో కో కింద ఏపీ సీఎం జగన్ సంస్థల్లో భారీగా పెట్టుబడులు పెట్టారన్న ఆరోపణలపై ఈడీ తనపై నమోదుచేసిన కేసులను కొట్టేయాలని కోరుతూ ఇండియా సిమెంట్స్ ఎండీ శ్రీనివాసన్ దాఖలుచేసిన క్వాష్ పిటిషన్లపై విచారణను హైకోర్టు ఏప్రిల్ 15కు వాయిదా వేసింది. శ్రీనివాసన్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్ నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఇవే ఆరోపణలపై సీబీఐ దాఖలుచేసిన కేసులను సుప్రీంకోర్టు కొట్టేసిందని తెలిపారు. ఈడీ కేసులను కూడా కొట్టేయాలని హైకోర్టుకు విజ్ఞప్తిచేశారు. 75 ఏండ్ల వయసు దాటుతున్నందున ఈడీ కేసుల్లో వ్యక్తిగత హాజరు నుంచి శ్రీనివాసన్‌కు మినహాయింపు ఇవ్వాలని కోరారు. తాము మనీలాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం దర్యాప్తు చేపడుతున్నట్టు ఈడీ తరపు న్యాయవాది పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. తదుపరి విచారణను ఏప్రిల్ 15కు వాయిదా వేసింది. శ్రీనివాసన్ వ్యక్తిగత హాజరుపై హైకోర్టు ఎలాంటి ఉత్తర్వులు జారీచేయలేదు.

## వీఐటీలో విటోపియా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వీఐటీ ఏపీ యూనివర్సిటీలో అంతర్జాతీయ క్రీడా, సాంస్కృతిక ఫెస్ట్ విటోపియా-2020 వాల్‌పోస్టర్‌ను కృష్ణా జిల్లా మాజీ కలెక్టర్ లక్ష్మీకాంతం మంగళవారం ఆవిష్కరించారు. విటోపియా కన్వీనర్ కల్యాణ్‌చక్రవర్తి, వర్సిటీ రిజిస్ట్రార్ సీఎల్వీ శివకుమార్ పాల్గొన్నారు.

## మార్చి 23న ఢిల్లీలో బీసీల జనగర్జన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేంద్ర ప్రభుత్వం.. బీసీల సమస్యలను పరిష్కరించాలని, దేశంలో బీసీ జనగణన చేపట్టాలని డిమాండ్‌చేస్తూ మార్చి 23న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీల జనగర్జన మహాసభ నిర్వహించనున్నట్టు తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, జాతీయ సమన్వయకర్త జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకర్‌రావు, భారత బీసీ ఫెడరేషన్ తెలంగాణ అధ్యక్షుడు విజయభాస్కర్ తెలిపారు. జనాభాలో ఎక్కువున్న బీసీలకు ప్రాధాన్యం కల్పిస్తూ కేంద్రం ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటుచేయాలని మంగళవారం ఓ ప్రకటనలో కోరారు.

## టీజీయూజీసెట్ ఫలితాలు విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యాలయాల్లో డిగ్రీ ప్రవేశం కోసం నిర్వహించిన టీజీయూజీసెట్ ఫలితాలను మంగళవారం విడుదలచేశారు. 2020-21 విద్యా సంవత్సరానికిగాను సంబంధిత గురుకుల కళాశాలల్లో డిగ్రీ ప్రవేశానికి జనవరి 19న అర్హత పరీక్ష నిర్వహించగా, 23,607 మంది హాజరయ్యారు. ఎస్సీ గురుకుల సొసైటీ ద్వారా నడుస్తున్న ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ మహిళా కళాశాలల్లో ప్రవేశానికి 821 మంది అర్హత సాధించారు. ఫలితాలకు www.tswreis.in <http://www.tswreis.in> వెబ్‌సైట్‌ను సందర్శించాలని నిర్వాహకులు సూచించారు.

# నిపుణ

Indian Coast Guard

ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో యాంత్రిక్ (మెకానికల్) ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

# విద్య ఉద్యోగ సమాచారం

## నావికా దళంలో

డెహ్రాడూన్‌లోని నేషనల్ హైడ్రోగ్రాఫిక్ ఆఫీస్ కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

- **పోస్టు:** డ్రాఫ్ట్స్‌మెన్ (కార్టోగ్రాఫిక్)
- **మొత్తం ఖాళీలు:** 6
- **అర్హతలు:** పదోతరగతి ఉత్తీర్ణతతో పాటు డ్రాఫ్ట్స్‌మెన్‌షిప్‌లో ఐటీఐ సర్టిఫికెట్.
- **వయస్సు:** 18-25 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ (ఫిబ్రవరి 15-21)లో ఈ ప్రకటన వెలువడిన తేదీ నుంచి 21 రోజుల్లోపు దరఖాస్తులు పంపాలి.
- **వెబ్‌సైట్:** https://www.indiannavy.nic.in

## ఐటీడీసీలో

న్యూఢిల్లీలోని ఇండియన్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐటీడీసీ) కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **మొత్తం ఖాళీలు:** 12
- **పోస్టులు:** జీఎం, డీజీఎం, మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో సీఏ/ ఐసీడబ్ల్యూఏ, ఎంబీఏ, పీజీ డిగ్రీ/ డిప్లొమా ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 13
- **వెబ్‌సైట్:** https://itdc.co.in

## కోస్ట్‌గార్డ్‌లో యాంత్రిక్ పోస్టులు

- **పోస్టు:** యాంత్రిక్ టెక్నికల్
- **మొత్తం ఖాళీలు:** 37
- **పోస్టులవారీగా ఖాళీలు:** యాంత్రిక్ టెక్నికల్ (మెకానికల్)-19, యాంత్రిక్ టెక్నికల్ (ఎలక్ట్రికల్)-3, యాంత్రిక్ టెక్నికల్ (ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్)-15
- **అర్హతలు:** మెట్రిక్యులేషన్ అర్హతతోపాటు ఎలక్ట్రికల్/మెకానికల్ లేదా ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ (రేడియో/పవర్) ఇంజినీరింగ్ డిప్లొమాలో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.



- **వయస్సు:** 1988, ఆగస్టు 1 నుంచి 2002, జూలై 31 మధ్య జన్మించి ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, పీఎఫ్‌టీ, మెడికల్ ఎగ్జామినేషన్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో మార్చి 16
- **చివరితేదీ:** మార్చి 22
- **వెబ్‌సైట్:** www. joinindian coastguard.gov.in

## కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.




- **పోస్టు:** ప్రాజెక్ట్ ఆఫీసర్
- **మొత్తం ఖాళీలు:** 18
- **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్, ఐటీ తదితరాలు ఉన్నాయి.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఇంజినీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 30 ఏండ్లు మించరాదు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో, **చివరితేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** https://cochinshipyard.com

## స్పాలో ప్రవేశాలు

స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా) 2020-21 విద్యాసంవత్సరానికి కింది ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేసింది.

- **కోర్సులు:** పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు 2020-21
- **పీజీ కోర్సులు:** ఆర్కిటెక్చరల్ కన్జర్వేషన్, అర్బన్ డిజైన్, ఇండస్ట్రియల్ డిజైన్, బిల్డింగ్ ఇంజినీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ ప్లానింగ్, హౌజింగ్, రీజినల్ ప్లానింగ్, ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్, అర్బన్ ప్లానింగ్.
- **అర్హత:** పీజీ ప్రోగ్రాములకు సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ ప్రోగ్రాములకు ప్లానింగ్/ఆర్కిటెక్చర్ సబ్జెక్టులో పీజీ ఉత్తీర్ణతతోపాటు గేట్/జేఆర్‌ఎఫ్/సీడ్ స్కోర్ ఉండాలి.
- **ఎంపిక:** టెస్ట్/ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 13
- **వెబ్‌సైట్:** http://spa.ac.in

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 40,894 | 11,992 |
| ↘ 161 | ↘ 53 |

ముడి చమురు (బ్రెంట్) ↘ 57.25 డాలర్లు

## 50 పైసల చార్జీ ఉండదట!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** రోజువారి పరిమితి దాటితే ప్రతీ ఎస్ఎంఎస్‌పై వసూలు చేస్తున్న 50 పైసల చార్జీని ఎత్తివేయాలని టెలికం రెగ్యులేటర్ ట్రాయ్ భావిస్తున్నది. ఈ మేరకున్న ప్రతిపాదనపై వచ్చే నెల మూడుకల్లా కస్టమర్లు, టెలికం ఆపరేటర్లు తమ అభిప్రాయాల్ని వ్యక్తం చేయాలని మంగళవారం ట్రాయ్ కోరింది. కౌంటర్ కామెంట్ల కోసం మార్చి 17 వరకు గడువిచ్చింది. ప్రతీ సిమ్ కార్డు వినియోగదారుడికి రోజుకు ఉచితంగా లేదా రాయితీ రేటుపై 100 ఎస్ఎంఎస్‌ల వరకు పొందే వెసులుబాటున్నది.

## ఏడేండ్లలో రూ.10 వేల కోట్ల పెట్టుబడి

హీరో మోటోకార్ప్ సీఎండీ పవన్ ముంజల్



**జైపూర్, ఫిబ్రవరి 18:** ద్విచక్ర వాహన తయారీలో అగ్రగామి సంస్థయైన హీరో మోటోకార్ప్..వచ్చే ఐదు నుంచి ఏడేండ్ల కాలంలో రూ.10 వేల కోట్ల వరకు పెట్టుబడులు పెట్టబోతున్నట్లు ప్రకటించింది. పరిశోధన, అభివృద్ధి విభాగాన్ని మరింత బలోపేతం చేయడంతోపాటు నూతన ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి రూ.10 వేల కోట్ల వరకు పెట్టుబడులు పెట్టబోతున్నట్లు హీరో మోటోకార్ప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పవన్ ముంజల్ తెలిపారు. విజన్ 2020లో భాగంగా వచ్చే పదేండ్లకాలంలో కాలుష్య రహిత వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ప్రకటించిన ఆయన..ఇందుకు వచ్చే ఐదు నుంచి ఏడేండ్లకాలంలో సుస్థిరమైన రవాణా పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి ఈ భారీ మొత్తంలో ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. హీరో నుంచి విడిపోయిన తర్వాత 2011 నుంచి ఇప్పటి వరకు నూతన ప్లాంట్‌లు, యంత్రాలు, వాహనాల అభివృద్ధి కోసం రూ.7 వేల కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు, వీటితోపాటు ఆర్‌అండ్‌డీ కోసం మరో 600 మిలియన్ డాలర్లు నిధులు వెచ్చించినట్లు చెప్పారు. 1985లో దేశీయ మార్కెట్లోకి అడుగు పెట్టిన సంస్థ ఈ ఏడాది చివరినాటికి 10 కోట్ల మైలురాయిని చేరుకునే అవకాశాలున్నాయన్నారు. మరోవైపు సంస్థ దేశీయంగా తయారు చేసిన గ్లామర్, ప్యాషన్ ప్రో బైకులను బుధవారం విడుదల చేసింది. వీటిలో గ్లామర్ మోటార్‌సైకిల్ రూ.68,900 నుంచి రూ.72 వేల మధ్యలో లభించనుండగా, ప్యాషన్ ప్రో మాత్రం రూ.64,990 నుంచి 67,190 మధ్యలో నిర్ణయించింది. వీటితోపాటు వచ్చే నెలలో అందుబాటులోకి రానున్న ప్రీమియం బైకు ఎక్స్‌ట్రీమ్ 160ఆర్‌ను ప్రదర్శించింది కూడా.

HSBC

## 35 వేల మందిపై హెచ్‌ఎస్‌బీసీ వేటు!

**హాంకాంగ్, ఫిబ్రవరి 18:** అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థ హెచ్‌ఎస్‌బీసీ.. 35 వేల మంది సిబ్బందిని తొలగించడానికి సిద్ధమైంది. వరుసగా మూడో ఏడాది లాభాల్లో భారీ గండిపడటంతో నిర్వహణ ఖర్చులు తగ్గించుకోవడంలో భాగంగా అమెరికా, యూరప్ దేశాల్లో వ్యాపారాన్ని తగ్గించుకోవడానికి వచ్చే మూడేండ్లలో 35 వేల మంది తొలగించాలనుకుంటున్నట్లు బ్యాంక్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న శాఖల్లో 30 శాతం శాఖలను మూసివేసేయోచనలో ఉన్న బ్యాంక్.. వీటిలో అత్యధికంగా యూఎస్, యూరప్‌లలో ఉండనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అమెరికా-చైనా దేశాల మధ్య వాణిజ్యంపై అనిశ్చితి నెలకొన్నప్పటికీ ఆసియా దేశాల్లో వృద్ధి కనబరిచిన బ్యాంక్..బ్రిటన్, జీవీలు చైనాను కబళిస్తున్న కరోనా వైరస్ బ్యాంకింగ్ కార్యకలాపాలపై ప్రభావం చూపనున్నదని తెలిపింది. ప్రస్తుతం బ్యాంకులో 2.35 లక్షల మంది సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా, వచ్చే రెండు నుంచి మూడేండ్లకాలంలో ఈ సంఖ్యను 2 లక్షలకు కుదించాలనుకుంటున్నట్లు సంస్థ సీఈవో నోయల్ క్విన్ తెలిపారు. 2022 నాటికి తన ఖర్చులను 4.5 బిలియన్ డాలర్లు తగ్గించుకోవాలనుకుంటున్న బ్యాంక్.. ఇదివరకే చర్యలు ప్రారంభించిందని సంకేతాలిచ్చారు. గతేడాదికిగాను బ్యాంక్ లాభం ఏడాది ప్రాతిపదికన 33 శాతం తగ్గి 13.3 బిలియన్ డాలర్లకు పరిమితమైంది.

# భయాలు అక్కర్లేదు

## కరోనా నేపథ్యంలో పరిశ్రమకు కేంద్రం అభయం

### త్వరలోనే సమర్థవంతమైన చర్యలు: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

### వైరస్ విస్తృతిపట్ల వ్యాపార, పరిశ్రమ వర్గాలతో సమీక్షా సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ/శాన్‌ఫ్రాన్సిస్కో, ఫిబ్రవరి 18:** దేశీయ పరిశ్రమపై కరోనా వైరస్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం త్వరలోనే పలు చర్యలను తీసుకుంటుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. చైనాలో విలయం సృష్టిస్తున్న ఈ ప్రాణాంతక వైరస్.. దేశీయ పరిశ్రమను ఏ మేరకు ప్రభావితం చేస్తుందన్నదానిపై, ప్రస్తుత పరిస్థితులపై వ్యాపార, పారిశ్రామిక వర్గాలతో మంత్రి మంగళవారం ఇక్కడ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫార్మా, టెక్స్‌టైల్స్, కెమికల్స్, ఎలక్ట్రానిక్స్, ఐటీ హార్డ్‌వేర్, సోలార్, ఆటో, సర్జికల్ ఎక్విప్‌మెంట్, పెయింట్, ఫర్టిలైజర్, టెలికం, గ్లాస్, మొబైల్ మ్యానుఫ్యాక్చరింగ్, వంట నూనెలు, షిప్పింగ్, టూరిజం రంగాల ప్రతినిధులు దీనికి హాజరైయ్యారు. సమావేశం అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడుతూ ఔషధ, సౌర, రసాయన పరిశ్రమల నుంచి కొన్ని రకాల ఆందోళనలు వినిపిస్తున్నాయని, వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. ఎగుమతులు, ముడి సరుకు దిగుమతుల సమస్యలను తమ దృష్టికి తెచ్చారన్నారు. ప్రధాన మంత్రి కార్యాలయంతో చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. కాగా, బుధవారం వివిధ మంత్రిత్వ శాఖల కార్యదర్శులతో తాను సమావేశం అవుతానని ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ తెలిపారు. ఆ తర్వాత తగిన చర్యలను ప్రకటిస్తామని చెప్పారు. కాగా, వివిధ రకాల ఉత్పత్తుల ధరల పెరుగుదల గురించి ఆందోళనలు అవసరం లేదన్న నిర్మలా సీతారామన్.. 'మేక్ ఇన్ ఇండియా'పై కరోనా ప్రభావం గురించి ఇప్పుడే మాట్లాడటం తొందరపాటే అవుతుందని వ్యాఖ్యానించారు. ఔషధాలు, వైద్య పరికరాల కొరత ఏమీ లేదన్నారు. అయితే చైనాలో ఇప్పుడున్న భయానక పరిస్థితులు ఇలాగే మరికొంతకాలం కొనసాగితే కీలక ఔషధాల ధరలు పెరుగవచ్చని జైడస్ గ్రూప్ చైర్మన్ పంకజ్ పటేల్ అన్నారు. అక్కడి నుంచి వచ్చే దిగుమతులు ఇలాగే ఆగిపోతే ఇబ్బందులేనన్నారు.

### ఆసియా-పసిఫిక్ వృద్ధి ఢమాల్

ఆసియా-పసిఫిక్ దేశాల్లో ఈ ఏడాది వృద్ధిరేటు తగ్గనుందని ప్రముఖ గ్లోబల్ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ అంచనా వేసింది. చైనాలో విజృంభిస్తున్న కరోనా వైరస్ ప్రభావం వల్లేనని తెలిపింది. ఈ అంటువ్యాధి దెబ్బకు ప్రపంచ తయారీ కేంద్రంగా విరాజిల్లుతున్న చైనాలో వేలాది పరిశ్రమలు ఒక్కసారిగా మూతబడ్డాయి. ఈ ప్రభావం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోని ఇతర దేశాలపైనా ఉంటుందని, దీంతో ఆయా దేశాల జీడీపీ పడిపోవచ్చని మూడీస్ పేర్కొంది. చాలా దేశాలకు చైనా నుంచి ముడి ఉత్పత్తులు ఎగుమతి అవుతుండటంతో ఇప్పుడు అవన్నీ దాదాపు ఆగిపోయాయి. ఫలితంగా వాటి ఆధారంగా నడిచే వివిధ రకాల పరిశ్రమలు నిలిచిపోతున్నాయి. కాగా, ఇప్పటిదాకా ఈ మహమ్మారి తీవ్రతకు 1,860 మందికిపైగా మృతిచెందగా, 72వేలకుపైగా బాధితులైయ్యారు.

### ఎయిర్‌లైన్స్ పరిశ్రమకు దెబ్బ

చైనాలో మరణమృదంగం మోగిస్తున్న కరోనా వైరస్.. ఆ రంగం, ఈ రంగం అన్న తేడా లేకుండా అన్ని రంగాలనూ కుదిపేస్తున్నది. విమానయాన పరిశ్రమనూ కరోనా వేధిస్తుండగా.. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆయా సంస్థలు తమ సర్వీసులను తగ్గించేస్తున్నాయి. సింగపూర్ ఎయిర్‌లైన్స్ తమ విమానాల సంఖ్యను ప్రపంచవ్యాప్తంగా తాత్కాలికంగా తగ్గించేయనున్నట్లు మంగళవారం ప్రకటించింది. ముంబై, ఫ్రాంక్‌ఫర్ట్, జకార్తా, లండన్, లాస్‌ఏంజిల్స్, పారిస్, సియోల్, సిడ్నీ, టోక్యో తదితర నగరాలు, ప్రాంతాలకు మే నెలదాకా విమాన సర్వీసులు తగ్గిపోతాయని స్పష్టం చేసింది. మరోవైపు వైరస్‌ను అంతమొందించేందుకు సింగపూర్ తమ ఆర్థిక ప్యాకేజీలో 4.6 బిలియన్ డాలర్లను కేటాయించింది. ఈ దేశంలో 77 కేసులు నమోదైయ్యాయి.

### ఐఫోన్‌కు సెగ



ఈ జనవరి-మార్చి త్రైమాసికంలో తమ ఆదాయ లక్ష్యాలను నెరవేరకపోవచ్చని యాపిల్ అంటున్నది. కరోనా వైరస్ ఐఫోన్ సరఫరా వ్యవస్థను దెబ్బతీస్తున్నదని తాజాగా పేర్కొన్నది. చైనాలో తమ భాగస్వామ్య సంస్థలున్నాయని, కరోనా కారణంగా వాటి తయారీ కేంద్రాలు మూతబడ్డాయని, ఈ పరిణామం ఐఫోన్ తయారీపై పడుతున్నదని వెల్లడించింది. ఇక ఈ ప్రాణాంతక మహమ్మారి కారణంగా రవాణా వ్యవస్థలోనూ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికే వరల్డ్ మొబైల్ క్రాంగెస్, ఆటో షోలతోపాటు పలు క్రీడా సంరంభాలకు బ్రేక్ పడిన విషయం తెలిసిందే. ఒక దేశం నుంచి మరో దేశానికి కరోనా వ్యాప్తి చెందవచ్చున్న భయాలు వెంటాడుతున్నాయి మరి. ఐఫోన్ విక్రయాల్లో చైనా మార్కెట్ కూడా కీలకమవగా, వైరస్ దెబ్బకు అక్కడి అమ్మకాలు అటకెక్కాయి. ఇది కూడా సంస్థ ఆదాయ లక్ష్యాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నది.

### ఎల్ ఈడీ బల్బుల ధరలు ప్రియం



ఎల్‌ఈడీ బల్బులు, లైట్ల ధరలు వచ్చే నెల మార్చి నుంచి 10 శాతం వరకు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. కరోనా వైరస్ వ్యాప్తి కారణంగా చైనా నుంచి భారత్‌కు ఎలక్ట్రానిక్ కంపోనెంట్ల సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. కరోనా భయాలతో చైనా ఎలక్ట్రానిక్ కంపోనెంట్ల తయారీ పరిశ్రమ మూతబడింది. దీంతో మార్కెట్ డిమాండ్‌ను తయారీదారులు అందుకోలేని పరిస్థితి వస్తుండగా, ఈ క్రమంలో పెరుగుతున్న ఉత్పత్తి వ్యయం, ఇబ్బందుల దృష్ట్యా ధరలు పెరిగే వీలుందని పరిశ్రమ సంఘం ఎల్కోమా అంటున్నది. మొబైల్, టెలివిజన్, ఇతరత్రా ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలను, దేశీయ లైటింగ్ పరిశ్రమనూ కరోనా వైరస్ ప్రభావితం చేస్తున్నదని ఎల్కోమా ఉపాధ్యక్షుడు సుమిత్ పద్మాకర్ జోషి పీటీఐ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు.

## బీఎస్-6తో ఇగ్నిస్

రూ.4.89- 7.19 లక్షల మధ్యలో ధర



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ ఇండియా..దేశీయ మార్కెట్లోకి ఒక్కొక్కటి బీఎస్-6 వెర్షన్లను విడుదల చేస్తున్నది. తాజాగా ప్రీమియం కాంప్యాక్ట్ కారు ఇగ్నిస్‌ను సైతం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఢిల్లీ షోరూంలో ఈ కారు రూ.4.89 లక్షల నుంచి రూ.7.19 లక్షల మధ్యలో లభించనున్నది. 1.2 లీటర్ల పెట్రోల్ ఇంజిన్ కలిగిన ఈ కారు మాన్యువల్, ఆటో గేర్ షిఫ్ట్(ఏజీఎస్) ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లను ఎంపిక చేసుకునే అవకాశం కొనుగోలుదారుడికి ఉందని ఒక ప్రకటనలో వెల్లడించింది. ఎస్‌యూవీ లాగా తీర్చిదిద్దిన ఈ ఇగ్నిస్ కారు వినియోగదారులను ఆకట్టుకుంటుందన్న ఆశాభావాన్ని కంపెనీ ఎండీ, సీఈవో కెనిచి అయుకవా వ్యక్తంచేశారు. ఆరు మోడళ్లలో లభించనున్న ఈ కారు మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ కలిగిన వాహనం రూ.4.89-6.73 లక్షల మధ్యలోను, ఏజీఎస్ ఆప్షన్ మోడల్ రూ.6.13-7.19 లక్షల మధ్యలో లభించనున్నదని పేర్కొంది.

## ఇప్పటి వరకైతే ప్రతిపాదన రాలేదు..

ఎల్‌ఐసీ ఐపీవోపై ఐఆర్‌డీఏఐ చైర్మన్ ఎస్‌సీ ఖుంతియా

**ముంబై, ఫిబ్రవరి 18:** బీమా దిగ్గజం ఎల్‌ఐసీ ఐపీవోకు సంబంధించి ఎలాంటి ప్రతిపాదన రాలేదని బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ చైర్మన్ ఎస్‌సీ ఖుంతియా స్పష్టంచేశారు. బీమా పాలసీలపై ఆదాయం పన్ను మినహాయింపును ఎత్తివేసేయోచనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు వచ్చిన సంకేతాలపై ఖుంతియా స్పందిస్తూ అలాంటి ప్రతిపాదనేది ప్రభుత్వం వద్ద లేదని ఆయన స్పష్టంచేశారు. అలాగే బీమా రంగ సంస్థలు నష్టాలు తెచ్చే ప్రాడక్టుల నుంచి బయటకు రావాలని ఆయన సూచించారు. . వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో ఎల్‌ఐసీని స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై ఇప్పటి వరకైతే ఎల్‌ఐసీ ఎలాంటి ప్రతిపాదన పంపలేదని ఖుంతియా విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఐపీవోకి రానున్న సంస్థల్లో కార్పొరేట్ గవర్నెన్స్, ఆయా సంస్థ పనితీరు మెరుగుపడనున్నదన్నారు. ప్రతి ఒక్క బీమా సంస్థ ఐపీవోకి రావాలనుకుంటున్నట్లు..చిన్న స్థాయి సంస్థలు ఇంకా బీమా రంగంలో కుదురుకోలేదని, వీటికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన ప్రకటించారు. గతేడాది జనరల్ ఇన్సూరెన్స్ విభాగం 14 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా, ఇదే సమయంలో లైఫ్ ఇన్సూరెన్స్ కూడా 10 శాతం వృద్ధిని కనబరిచింది.

## మూడు వారాల కనిష్ఠానికి రూపాయి



**ముంబై, ఫిబ్రవరి 18:** దేశీయ కరెన్సీ విలువ మూడు వారాల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. దేశ ఆర్థిక వ్యవస్థపై ఆందోళన వ్యక్తంకావడం, మరోవైపు కరోనా వైరస్ భయాలు ఫారెక్స్ మార్కెట్లో సెంటిమెంట్‌ను ప్రభావితం చేసింది. ఫలితంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 22 పైసలు పతనం చెంది 71.54 వద్ద ముగిసింది. దేశీయ ఈక్విటీ మార్కెట్లోకి విదేశీ పెట్టుబడులు నిలిచిపోవడం, స్టాక్ మార్కెట్ల పతనం కూడా రూపాయి పతనాన్ని శాసించాయి. 71.56 వద్ద ప్రారంభమైన రుపీ-డాలర్ ఎక్స్ఛేంజ్ రేటు చివరకు 22 పైసలు నష్టపోయి 71.54 వద్ద ముగిసింది. జనవరి 30 తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు 1.89 శాతం తగ్గి 56.58 డాలర్ల వద్ద ముగిసింది.

## జెట్ ఎయిర్‌వేస్‌పై రష్యా ఫండ్ ఆసక్తి

**ముంబై, ఫిబ్రవరి 18:** పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయి విమానయాన సేవలకు దూరమైన ప్రైవేట్ రంగ సంస్థ జెట్ ఎయిర్‌వేస్‌ను కొనేందుకు రష్యా సంస్థ ఆసక్తి చూపిస్తున్నది. రష్యా సర్కారు దన్నుతో నడుస్తున్న ఫార్ ఈస్ట్ డెవలప్‌మెంట్ ఫండ్.. జెట్ ఎయిర్‌వేస్‌ను చేజిక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నదని సమాచారం. బ్యాంక్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఫారిన్ ఎకనామిక్ అఫైర్స్ లేదా వీఈబీ బ్యాంక్ ద్వారా నవంబర్ 2011లో ఏర్పాటైన ఈ ఫండ్ బోర్డు చైర్మన్ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కావడం గమనార్హం. ఫార్ ఈస్ట్, బైకల్ రీజియన్‌లో మౌలిక రంగ ప్రాజెక్టులు, గనుల తవ్వకాలు, వ్యవసాయం, స్వల్ప-మధ్య శ్రేణి సంస్థలకు నిధులను అందించడం ఈ ఫండ్ ప్రధాన బాధ్యత. కాగా, భారతీయ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రుడెంట్ సైతం జెట్ ఎయిర్‌వేస్‌ను సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నది. మంగళవారం ఈ సంస్థ విజ్ఞప్తిని జెట్ ఎయిర్‌వేస్ రుణదాతలు పరిశీలించారు కూడా. మార్చి 9దాకా రిజల్యూషన్ ప్లాన్‌ను దాఖలు చేయాలని గడువిచ్చారు.

# మూసివేత?

## వొడాఫోన్ ఐడియాపై ఏజీఆర్ పిడుగు

### రూ.53 వేల కోట్ల బకాయిలు చెల్లించలేక సతమతం

### దివాలా తీస్తుందన్న అనుమానాలు • సంస్థ రుణ భారం రూ.1.16 లక్షల కోట్లపైనే





**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** దేశీయ టెలికం రంగాన్ని ఏజీఆర్ బకాయిలు కుదిపేస్తున్నాయి. పీకల్లోతు నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న భారతీయ టెలికం సంస్థలపై సవరించిన స్థూల ఆదాయం (ఏజీఆర్) పిడుగులా పడింది. వొడాఫోన్ ఐడియా లిమిటెడ్‌పై అత్యధికంగా రూ.53,038 కోట్ల భారం పడగా, ఇప్పుడీ బాకీలను తీర్చడం సంస్థకు తలకు మించిన పనిగా పరిణమించింది. దీంతో సంస్థ మనుగడపైనే ఇప్పుడు సందేహాలు నెలకొన్నాయి. మొత్తం 15 సంస్థలు టెలికం శాఖకు ఇవ్వాల్సిన ఏజీఆర్ బకాయిలు రూ.1.47 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇందులో స్పెక్ట్రం వినియోగ చార్జీల బకాయిలు రూ.55,054 కోట్లైతే, లైసెన్స్ ఫీజు బాకీలు రూ.92,642 కోట్లు. వొడాఫోన్ ఐడియా వాటా రూ.53,038 కోట్లుగా ఉన్నది. ఇందులో రూ.24,729 కోట్లు స్పెక్ట్రం బకాయిలవగా, మరో రూ.28,309 కోట్లు లైసెన్స్ ఫీజు.

### కష్టమ్మీద రూ.2,500 కోట్లు చెల్లింపు

సోమవారం రాత్రికిగానీ అతి కష్టమ్మీద టెలికం శాఖకు రూ.2,500 కోట్లు డిపాజిట్ చేసిన సంస్థ.. శుక్రవారంలోగా మరో వెయ్యి కోట్ల రూపాయలను ఇస్తామని చెప్పింది. ఏజీఆర్ బకాయిల విషయంలో తామిచ్చిన తీర్పుపై టెలికం శాఖ డెస్క్ అధికారి స్టే విధిస్తారా అంటూ గత శుక్రవారం అత్యున్నత న్యాయస్థానం మండిపడిన నేపథ్యంలో సర్కిళ్ల, జోన్లవారీగా టెలికం శాఖ అదేరోజున తాఖీదులను జారీ చేసింది. వెంటనే బాకీలు తీర్చకపోతే లైసెన్స్ నిబంధనల ప్రకారం తదుపరి నోటీసులు ఇవ్వకుండానే చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. దీంతో సోమవారం ఎయిర్‌టెల్ రూ.10 వేల కోట్లు, వొడాఫోన్ ఐడియా రూ.2,500 కోట్లు, టాటా టెలీ సర్వీసెస్ రూ.2,197 కోట్లు చెల్లించాయి. మిగతా బకాయిలు సుప్రీం ఇచ్చిన గడువు మార్చి 17కల్లా తీరుస్తామని విజ్ఞప్తి చేశాయి. కానీ వొడాఫోన్ ఐడియా మాత్రం తమ వల్ల కాదన్న సంకేతాలను ఇస్తున్నది.

### సుప్రీంలో ఊరట కరువు

ఏజీఆర్ బకాయిల చెల్లింపుపై సోమవారం సుప్రీం కోర్టుకు వొడాఫోన్ ఐడియా ఓ ప్రతిపాదన చేయగా, అది తిరస్కరణకు గురైంది. సోమవారం రూ.2,500 కోట్లు, శుక్రవారం మరో రూ.1,000 కోట్లు ఇస్తామన్న సంస్థ.. తమపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని విజ్ఞప్తి చేసింది. కానీ ఇందుకు అత్యున్నత న్యాయస్థానం అంగీకరించలేదు. నిజానికి గత నెల 23కల్లా ఏజీఆర్ బకాయిలన్నింటినీ తీర్చాలని టెలికం సంస్థలకు నిరుడు అక్టోబర్‌లో సుప్రీం గడువిచ్చింది. అయినప్పటికీ ఆ దిశగా అడుగులు పడకపోవడంతో ఈ నెల 14న ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫలితంగానే సోమవారం దాదాపు రూ.15 వేల కోట్లు వసూలవగా, మిగతా చెల్లింపుల్లో తాము కోరిన వెసులుబాటు లభించకపోతే వొడాఫోన్ ఐడియా చేతులెత్తేసేలాగానే కనిపిస్తున్నది. ఇప్పటికే ఇందుకు సంబంధించి కొద్దిరోజుల క్రితం సంస్థ నుంచి స్పష్టమైన ప్రకటన కూడా వెలువడింది. సుప్రీం కోర్టులో తాము దాఖలు చేసిన అభ్యర్థనపై వచ్చే తీర్పే భారత్‌లో సంస్థ భవితవ్యాన్ని నిర్ణయిస్తుందని చెప్పిన విషయం తెలిసిందే. ఇక గతేడాది డిసెంబర్ 31 నాటికి సంస్థ రుణ భారం రూ.1,15,850 కోట్లుగా ఉన్నది. ఇందులో రూ.88,530 కోట్ల వాయిదా వేసిన స్పెక్ట్రం బకాయిల చెల్లింపులుండగా, లీజు బకాయిలు మాత్రం అదనంగా ఉన్నాయి.

### టెలికం కార్యదర్శితో బిర్లా భేటీ

టెలికం శాఖ కార్యదర్శి అన్షు ప్రకాశ్‌తో మంగళవారం వొడాఫోన్ ఐడియా చైర్మన్ కుమార్ మంగళం బిర్లా సమావేశమైయ్యారు. ఏజీఆర్ బకాయిలను తీర్చేందుకు నానా తంటాలు పడుతున్న సంస్థ.. బ్యాంక్ గ్యారెంటీలను నగదుగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ నేపథ్యంలో తాజా భేటీ ప్రాధాన్యతను సంతరించుకోగా, గంటకుపైగా జరిగిన ఈ సమావేశ వివరాలను చెప్పేందుకు బిర్లా నిరాకరించారు. 'నేనిప్పుడు ఏం మాట్లాడలేను' అని విలేకరులతో అంటూ వెళ్లిపోయారు. ఆయన వెంట వొడాఫోన్ ఐడియా ఎండీ, సీఈవో రవీందర్ టక్కర్ కూడా ఉన్నారు. రెండు త్రైమాసికాల లైసెన్స్ ఫీజు, ఇతరత్రా బకాయిలకు ఈ బ్యాంక్ గ్యారెంటీ సమానం. ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలకు ఇది రూ.5,000 కోట్ల శ్రేణిలో ఉండే వీలున్నది. దీంతో ఈ మొత్తం చేతికందితే బకాయిలను తీర్చడంలో కొంతైనా ఉపశమనం ఉంటుందని వొడాఫోన్ ఐడియా ఆలోచన. రిలయన్స్ జియో రాకతో భారతీయ టెలికం రంగ ముఖచిత్రం మారిపోగా, ధరల యుద్ధంతో ఎయిర్‌టెల్, వొడాఫోన్, ఐడియాల ఆదాయం ఆవిరైపోయింది. ఈ క్రమంలో ఏజీఆర్ బకాయిలు గుదిబండలా మారాయి. ఎయిర్‌టెల్ బకాయిలు రూ.35 వేల కోట్లకుపైగా ఉండగా, వొడాఫోన్ ఐడియా దివాలా తీస్తే.. దేశంలో ఇక మిగిలే ప్రైవేట్ రంగ సంస్థలు ఎయిర్‌టెల్, జియోలే కావడం గమనార్హం.

## కేసీపీ చీఫ్ వెలగపూడి లక్ష్మణదత్ కన్నుమూత



సంతాపం ప్రకటించిన ఉపరాష్ట్రపతి, నామా నాగేశ్వరరావు

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** ప్రముఖ వ్యాపారవేత్త, కేసీపీ సంస్థల అధినేత వెలగపూడి లక్ష్మణదత్ (82) కన్నుమూశారు. చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు. లక్ష్మణదత్‌కు భార్య ఇందిరాదత్, కుమార్తె కవిత ఉన్నారు. డిసెంబర్ 27, 1937న జన్మించిన ఆయన..రాష్ట్ర పారిశ్రామికీకరణలో కీలక పాత్ర పోషించారు. అలాగే ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫిక్కీ) ప్రెసిడెంట్‌గా 1991-92లో విధులు నిర్వహించారు. కృష్ణా జిల్లా ఉయ్యూరు, గుంటూరు జిల్లా మాచర్ల, చెన్నైలలో సిమెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన ఆయన..వ్యాపారాన్ని దేశవ్యాప్తంగా విస్తరించారు. లండన్‌లోని బిజినెస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ పట్టాపొందిన ఆయన సారథ్యంలో కేసీపీ గ్రూపు సిమెంట్, చక్కెర, భారీ యంత్రాల వ్యాపారాలకు విస్తరించింది. దత్ మృతి పట్లా ప్రస్తుత ఫిక్కీ ప్రెసిడెంట్ సంగీతా రెడ్డి తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తంచేశారు. దేశం, పారిశ్రామిక రంగానికి ఆయన చేసిన సేలు అమోఘమని, దేశ ఆర్థిక వ్యవస్థ పతనవ్యవస్థలో ఉన్నప్పుడు ఫిక్కీ చైర్మన్‌గా వ్యవహరించినట్లు ఆమె చెప్పారు.

**పారిశ్రామికానికి లోటు: వెంకయ్యనాయుడు**

వీఎల్ దత్ మృతిపట్ల ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మరణవార్త తెలిసిన అనంతరం ఆ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి పరామర్శించారు. దత్ మృతి భారత పారిశ్రామిక రంగానికి తీరని లోటన్నారు.

**మిత్రుడినికోల్పోయా : నామా నాగేశ్వర్‌రావు**

కేసీపీ సిమెంట్స్ అధినేత వీఎల్ దత్ మరణం పట్ల టీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంచి మిత్రుడిని కోల్పోయానన్నారు. దత్ మంచి వ్యాపారవేత్త అనీ, ఎన్నో సామాజిక కార్యక్రమాల్లో ముందుండేవారని గుర్తుచేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి పరామర్శించారు. బుధవారం చెన్నై వెళ్లి భౌతిక కాయానికి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొంటానని నామా తెలిపారు.

# కుదేలైన స్టాక్ మార్కెట్లు

**ముంబై, ఫిబ్రవరి 18:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగోరోజు పతనాన్ని నమోదు చేసుకున్నాయి. ఏజీఆర్ బకాయిలపై ఆందోళన వ్యక్తంకావడంతో టెలికం, ఆర్థిక రంగాలకు చెందిన షేర్లలో భారీగా క్రయవిక్రయాలు జరిగాయి. ప్రారంభం నుంచే నష్టాల బాట పట్టిన బీఎస్ఈ సెన్సెక్స్ ఒక దశలో 444 పాయింట్లకు పైగా నష్టపోయింది. చివరకు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలతో సెన్సెక్స్ 161.31 పాయింట్లు నష్టపోయి 40,894.38 వద్ద ముగియగా, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 12 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. మార్కెట్ ముగిసే సమయానికి 53.30 పాయింట్లు తగ్గి 11,992.50 వద్ద ముగిసింది. ఏజీఆర్ బకాయిలు చెల్లించాల్సిందేనని సుప్రీం ఆదేశాలతో టెలికం రంగ షేర్లు కుదేలయ్యాయి. భారతీ ఎయిర్‌టెల్ షేరు ధర ఏకంగా 3 శాతం తగ్గి టాప్ లూజర్‌గా నిలిచింది. వీటితోపాటు ఇండస్‌ఇండ్ బ్యాంక్, మారుతి సుజుకీ, హీరో మోటోకార్ప్, రిలయన్స్ ఇండస్ట్రీస్‌ల షేర్లు మదుపరులను ఆకట్టుకోలేకపోయాయి. కానీ, ఎస్బీఐ, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్, టీసీఎస్‌ల షేర్లు మాత్రం కోలుకున్నాయి. రంగలవారీగా చూస్తే టెలికం రంగ షేర్లు నాలుగు శాతానికి పైగా పతనం చెందాయి. వీటితోపాటు మెటల్, ఆటో, రియల్టీ షేర్లు క్షీణించాయి. 2,654 షేర్లలో 1,655 షేర్లు పతనమవగా, కేవలం 854 షేర్లు లాభాల్లో ముగిశాయి.

### కొనసాగుతున్న వొడాఫోన్ షేర్ల పతనం

ఏజీఆర్ బకాయిలపై ఆందోళన వ్యక్తం కావడంతో టెలికం రంగ షేర్లు భారీ మూల్యం చెల్లించకతప్పడం లేదు. వరుసగా రెండోరోజు వొడాఫోన్ ఐడియా షేరు అయితే ఏకంగా 11 శాతం పతనం చెందింది. దేశీయ టెలికం వ్యాపారం నుంచి వైదొలిగే అవకాశాలు ఉన్నట్లు వచ్చిన సంకేతాలతో వరుసగా ఏడోరోజు మంగళవారం కూడా కంపెనీ షేరు ఒక దశలో 17.25 శాతం పతనమవగా, చివరకు ఇంతటి నష్టం నుంచి తిరిగి కోలుకొని 11.40 శాతం నష్టంతో రూ.3.03 వద్ద ముగిసింది. అటు ఎన్ఎస్ఈలోనూ కంపెనీ షేరు 10.29 శాతం తగి గరూ.3.03 వద్ద నిలిచింది. బీఎస్ఈలో 15 కోట్ల షేర్లు చేతులు మారగా, అదే ఎన్ఎస్ఈలో 64 కోట్ల షేరు ఇతరుల చేతిలోకి వెళ్లిపోయాయి. ఈ నెల 7 నుంచి ఇప్పటి వరకు కంపెనీ షేరు ఏకంగా 43.9 శాతం పతనం చెందింది. దీంతో సంస్థ మార్కెట్ విలువ రూ.5,800 కోట్లు హారతి కర్పూరంలా కరిగిపోయింది.

## ఉద్యోగులకు నిరాశే!

### 2020లో సరాసరిగా పెరుగనున్న వేతనాలు 9.1 శాతం





**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18:** వేతనాల పెంపు విషయంలో సగటు ఉద్యోగికి నూతన సంవత్సరంలోనూ నిరాశ తప్పడం లేదు. 2020లో దేశీయ కార్పొరేట్ సంస్థలు తమ ఉద్యోగుల జీతాలను సరాసరిగా 9.1 శాతం పెంచబోతున్నాయి. అయినప్పటికీ ఆసియా పసిఫిక్ దేశాల్లో పెరుగనున్న వేతనాలతో పోలిస్తే భారత్‌లో అధికంగా ఉండటం విశేషం. అధిక నైపుణ్యం, స్కిల్ కలిగిన సిబ్బందిని నియమించుకోవడానికి మొగ్గుచూపుతున్న సంస్థలు, వీరికి ఎంతైన జీతాలు చెల్లించడానికి ఆసక్తి చూపుతున్నాయని లీడింగ్ హెచ్‌ఆర్ కన్సల్టెన్సీ ఓన్స్ వార్షిక నివేదికలో వెల్లడించింది. 2019లో సరాసరిగా పెరిగిన 9.3 శాతంతో పోలిస్తే ఇది తక్కువ కాగా, అలాగే గడిచిన పదేండ్లలోనూ ఇదే అత్యల్పం. సర్వేలో పాల్గొన్న కంపెనీల్లో 39 శాతం సంస్థలు 10 శాతం పెంచేందుకు ఆసక్తి చూపుతుండగా, 42 శాతం 8-10 శాతం వరకు పెంచబోతున్నట్లు ప్రకటించాయి. 20 పారిశ్రామిక రంగాలకు చెందిన వెయ్యి కంపెనీల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నివేదికను రూపొందించింది. ఆసియా పసిఫిక్ దేశాల్లో భారత్‌లోనే అత్యధికంగా 9.1 శాతం పెరుగనుండగా, చైనాలో 6.3 శాతం అధికమవనున్నది. అలాగే ఫిలిప్పీన్స్‌లో 5.8 శాతం పెరుగనున్న జీతాలు..మలేషియాలో 5.3 శాతం, సింగపూర్‌లో 3.8 శాతం, ఆస్ట్రేలియాలో 3.1 శాతం పెరుగనున్నాయని తెలిపింది. గతేడాది నిరాశాజనక ఆర్థిక పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్‌లో జీతాలు అధికంగానే పెరుగుతున్నాయని, ముఖ్యంగా ఆసియా పసిఫిక్ ప్రాంతాల్లో కెల్లా ఇక్కడే అధికమని వోన్ భాగస్వామి ఫెర్నాడేజ్ వెల్లడించారు. తయారీ, ఫార్మాస్యూటికల్స్ రంగాల్లో పనిచేస్తున్న వారి జీతభత్యాలు అధికంగా పెరుగనుండగా, ఆ తర్వాతి ఎఫ్ఎంసీజీ, కెమికల్స్, ఇతర విభాగాలు ఉన్నాయని సర్వే పేర్కొంది.


తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధిశాఖ, పర్యవేక్షక ఇంజినీర్ వారి కార్యాలయం, ఇరిగేషన్ సర్కిల్, కరీంనగర్. ఫోన్: 0878-2950033.

ఈక్రింది కరీంనగర్, పెద్దపల్లి మరియు రాజన్న సిరిసిల్ల జిల్లాలలోని చెక్ డ్యాం నిర్మాణం పనుల యొక్క బిడ్లను ఆహ్వానించడమైనది.

నం. SE: 31/19-20 తేది: 14-02-2020 నుండి 40/19-20 తేది: 14-02-2020
డివిజన్ పేరు: కరీంనగర్ డివిజన్ పరిధిలోని (5), పెద్దపల్లి డివిజన్ పరిధిలోని (3), సిరిసిల్ల డివిజన్ పరిధిలోని (2) చెక్ డ్యాంల నిర్మాణం. మొత్తం అంచనా విలువ: రూ. 15280.07 లక్షలు. టెండరు స్వీకరించు చివరి తేది మరియు సమయం: 26-02-2020, మ. 3.00గంటల వరకు. గమనిక: మిగితా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ tender.telangana.gov.in. శ్రీ జి. అశోక్ కుమార్, బి.ఇ., పర్యవేక్షక ఇంజినీర్, ఇరిగేషన్ సర్కిల్, కరీంనగర్
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, I &CADD, ఇరిగేషన్ సర్కిల్, కరీంనగర్
DIPR RO. No. 05/18-DP/CL/Advt/1/2019-20, Dt: 18/02/2020

తెలంగాణ ప్రభుత్వం
తెలంగాణ మైనార్టీల గురుకుల విద్యాలయాల సంస్థ
ఇ-టెండరు ప్రకటన
NIT No. E/2605/TMREIS/2020 తేది: 18-02-2020
తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలలోగల 204 పాఠశాలలు మరియు 83 జూనియర్ కళాశాలలను నిర్వహిస్తున్న TMREI సొసైటీ దిగువవాటి సరఫరా కొరకు ప్రభుత్వ/ప్రభుత్వరంగ ఏజెన్సీల నుండి రెండు భాగాలలో (సాంకేతిక బిడ్ మరియు ఆర్థిక బిడ్) ఇ-టెండరు కోరుతోంది: i) సింగిల్ కాట్స్, ii) క్లాస్ రూమ్ చైర్ iii) క్లాస్‌రూమ్ టేబుల్, iv) గ్రీన్ బోర్డ్ (మాగ్నటిక్), v) ఆఫీస్ టేబుల్, vi) స్టీల్ అలమారాలు, vii) యాంగ్యులర్ రాక్స్, viii) ప్రిన్సిపాల్ చైర్, ix) ప్రిన్సిపాల్ టేబుల్, x) కంప్యూటర్ టేబుల్, xi) కంప్యూటర్ చైర్ xii) లైబ్రరీటేబుల్, xiii) లైబ్రరీచైర్స్, xiv) లైబ్రరీబుక్స్ రాక్స్, గ్లాస్ డోర్‌తో xv) ఫస్ట్ ఎయిడ్ మెడిసిన్ గ్లాస్ డోర్, xvi) ప్లాస్టిక్ చైర్స్, xvii) 8 డోర్ పర్సనల్ లాకర్ యూనిట్, xviii) వెజిటబుల్ కట్టింగ్ టేబుల్ xix) వైట్‌బోర్డ్, xx) నోటీసుబోర్డు, xxi) డిస్‌ప్లేబోర్డ్, xxii) కాలేజ్ మెయిన్‌బోర్డ్, xxiii) ప్రమోషన్ బోర్డ్, xxiv) కొలేటరల్ 4 వాల్యూబోర్డులు. దీనికి సంబంధించి ఇ-టెండరు వెబ్‌సైట్ https://tender.telangana.gov.inలో 19-02-2020 నుండి 12-03-2020 వరకు లభిస్తుంది. 1) ఇ-టెండరు ప్రచురణ: 19-02-2019, 2) TMR స్కూల్, సనత్‌నగర్, బాయ్స్-1, ధరంకరం రోడ్, హైదరాబాద్ వద్ద టెండరుదార్లతో శాంపిల్స్‌తో ప్రి-బిడ్ సమావేశం: 25-02-2020, మ.3.00గం. 3) ఆన్‌లైన్ టెండర్ల దాఖలుకు మరియు TMR స్కూల్, సనత్‌నగర్, బాయ్స్-1, ధరంకరం రోడ్, హైదరాబాద్ వద్ద తుది భౌతిక శాంపిల్స్ దాఖలుకు ఆఖరి తేది: 12-03-2020, సా. 5.00గం.వరకు. 4) సాంకేతిక బిడ్లు తెరుచుట: 13-03-2020, మ. 3.00గం.కు, 5) ఆర్థిక బిడ్లు తెరుచుట: 17-03-2020, మ. 3.00గం.కు.
సం/- సెక్రటరీ, TMREIS
DIPR RO. No. 14/18-PP/CL/Advt/1/2019-20, Dt: 18/02/2020

నమస్తే తెలంగాణ
WWW. NTNEWS.COM
/nt.zindagi
జిందగీ
బుధవారం 19 ఫిబ్రవరి 2020





# ఓ ఐడియా.. చెత్తనే మార్చేసింది!

**ఒక ఆలోచన ఎప్పుడు.. ఎక్కడ.. ఎలా వస్తుందో తెలియదు. చెట్టుపై నుంచి ఆపిల్ కింద పడగానే న్యూటన్‌కు ఐడియా వచ్చినట్లుగా.. ఇంట్లో వంటచేయగా వచ్చిన చెత్తను చూడగానే శిఖరకు ఐడియా వచ్చింది. ఈ ఐడియా పాతదే.. కానీ కొత్తగా వెలుగులోకి తీసుకురావాలనుకున్నది. దీనికి 'అవర్ సాక్రెడ్ స్పేస్'ను వేదికగా చేసుకున్నది శిఖర. వర్క్‌షాపులతో 'హోమ్ కంపోస్టింగ్' మొదలుపెట్టింది. అంతేకాకుండా యోగా, వీగన్ డైట్‌లలో మెళకువలు నేర్పుతూ ఉన్నత శిఖరాలకు చేరుకున్న శిఖరారెడ్డితో 'జిందగీ' ముచ్చటించింది.**

**గేటుమీద** బోర్డు. దానిపై 'అవర్ సాక్రెడ్ స్పేస్' అని రాసి ఉంది. బయటకు చెట్లు, పుట్టలు ఉన్నట్లు కనిపించినా లోపలికి అడుగు పెట్టగానే ప్రశాంతమైన ప్రదేశం. పచ్చనిచెట్లు.. మట్టితో కట్టిన గోడలు.. హాయిగొలిపే వాతావరణం. కాస్త లోపలికి వెళ్తే.. జనాల హడావిడి. ఏంటా? అని ఆరాతీస్తే.. 'హోమ్ కంపోస్టింగ్ అండ్ ఎంజైన్' వర్క్‌షాప్. తెలుగులో చెప్పాలంటే.. 'చెత్తతో ఎరువు తయారీ' అన్నమాట. 'దీనిపైన కూడా వర్క్‌షాప్ పెడతారా?' అని అక్కడున్న ఒకరిని అడిగితే సమాధానం ఇలా ఉంది. 'పల్లెటూరులో అయితే ప్రతిరోజూ వచ్చే చెత్తను ఒకచోట చేరుస్తారు. అది ఎండకు ఎండి, వానకు తడిసి ఏడాదికి ఎరువుగా తయారవుతుంది. దాన్ని తీసుకెళ్లి పంటలకు ఉపయోగిస్తారు రైతులు. మరి పట్టణాలల్లో.. ఇది అసాధ్యం కదా. అందుకనే ఇంటికొక డస్ట్‌బిన్. ప్రతిరోజూ మున్సిపాలిటీ బండి వచ్చి చెత్తను తీసుకెళ్తుంది. ఈ పద్ధతి బాగానే ఉంది కదా అనుకుంటారు. ఇప్పుడు సిటీలలో టెర్రస్ మీద మినీ గార్డెన్ పెట్టి సాగు చేస్తున్నారు. మరి ఆ మొక్కలకు ఎరువు కావాలంటే మార్కెట్లో దొరికే ఎరువు కొనాల్సిందే! అదేదో ఇంట్లో ఉండే చెత్తతో తయారు చేసుకుంటే ఈ తలనొప్పి ఏం ఉండదు కదా' అని సమాధానం ఇచ్చారు వర్క్‌షాపుకు హాజరైనవారు. ఇలాంటి ఓ ఆలోచన చేసింది ఎవరో కాదు శిఖరారెడ్డి. అమెను పలుకరిస్తే ఎన్నో కొత్త విషయాలు చెప్పింది.

### ఎలాంటి చెత్త?

చెత్త ఎక్కడెక్కడ నుంచి వస్తుందో తెలుసుకోవాలంటున్నది శిఖర. వంట చేయాలంటే కూరగాయలు కట్ చేయాలి. వాటితొక్కలతో ఏమీ చేయలేం కాబట్టి చెత్తబుట్టలో పడేస్తాం. పెరట్లో చెట్లు ఉంటాయి. ఉదయం శుభ్రంగా ఊడ్చినా సాయంత్రానికల్లా మళ్లీ ఆకులు రాలుతాయి. వాటిని కూడా చెత్తబుట్టలో పడేస్తాం. రెస్టారెంట్లు, ఫంక్షన్లు ఇలా పదిమంది కలిసి తిన్న ప్రదేశంలో కచ్చితంగా ఆహారం వృథా అవుతుంది. దీన్ని ఎవరికి దానం చేయకుండా రోడ్డుపైనే పడేస్తారు. కారణం ఏదైనా సరే చెత్త పడేయడం మాత్రం కామన్. ఈ చెత్తతో ఎరువు తయారుచేయవచ్చని అందరికీ తెలుసు. కానీ ఎలా చేయాలో తెలియదు. ఈ ప్రయత్నంలో విఫలమైనవారెందరో. వారు సక్సెస్ సాధించేలా.. నేర్చుకోవాలని తపన పడే ప్రతివారినీ శిఖరం దాటిస్తానంటున్నది శిఖర.

### ఎరువు తయారీ ఎలాగంటే..?

పెద్ద పెద్ద ప్రయోగాలు కూడా చిన్న ఆలోచనలతోనే మొదలవుతాయి. అప్పుడప్పుడు ఇలాంటి సిద్ధాంతాలు ఉపయోగపడుతాయని అంటున్నది శిఖరా. చెత్తబుట్టలకోసం కొత్తవి కొనాల్సిన పనిలేదు. పెయింటింగ్ డబ్బాలాంటివి ఏవైనా మూత ఉండేవి ఉంటే సరిపోతాయి. ఇలా మూడు డబ్బాలు ఒకదాని మీద ఒకటి పెట్టాలి. వాటికి కింద మూడు చిన్న రంధ్రాలు పెట్టాలి. మరుసటి రోజు కూరగాయల తొక్కలను డబ్బాలో వేయాలి. దానికి ముందు కొబ్బరినార పెట్టాలి. దానిపై తొక్కలు. వాటిపైన పేపర్‌తో కప్పి మూత పెట్టేయాలి. తరువాతి రోజు పేపర్ తీసి మరలా కొబ్బరినార పెట్టి ఆకులు, కూరగాయల తొక్కలు ఇలా ఏవి ఉంటే అవి పెట్టి మరలా పేపర్ పెట్టాలి. ఇలా క్రమం తప్పకుండా పాటించాలి. ఈ చెత్తబుట్టలను ఎండలో కాకుండా ఒక మూలన పెడితే సరిపోతుంది. కింద రంధ్రాల ద్వారా గాలి బయటకు పోయి, కొత్తగాలి లోపలికి వచ్చి కుల్లిన వాసన రాకుండా చేస్తుంది. ఇలా ఐదు వారాలకు మూడు డబ్బాలు మారేసరికి ఎరువు పొడిపొడిగా మారుతుంది. ఎలాంటి రసాయనాలు కలుపని ఎరువు మొక్కలకు అందుతుంది. దీంతో మొక్కల పెరుగుదలలో, వాటిని తినేవారిలో ఆరోగ్యం పెరుగుతుంది. ఈ ప్రాసెస్ అంతా వర్క్‌షాపులో చేసి చూపిస్తున్నది శిఖర.

### మూడురకాల వర్క్‌షాపులు

ఈ పద్ధతిని శిఖర ఎక్కడా నేర్చుకోలేదు. ఎవరినీ సలహా అడగలేదు. సొంతంగా పట్టుసాధించింది. నెట్‌లో సెర్చ్ చేసింది. పుస్తకాలు చదివింది. ఇతర రాష్ట్రాలలో చేస్తున్న వారి వీడియోలు చూసింది. ఇంట్లో తయారు చేసేందుకు సిద్ధం చేసుకున్నది. ఇంట్లో చెత్త నిల్వ ఉంచాలంటే మామూలు విషయం కాదు. అది ఏ మాత్రం గాడి తప్పినా భరించలేని వాసన వస్తుంది. 'ఇవన్నీ నీకెందుకు?' అని తల్లితో తిట్లుతిన్నది. ఈమె ప్రయత్నానికి కుటుంబసభ్యులే సాయం చేయడం మొదలుపెట్టారు. మామూలుగా ఇంట్లో కంటే హాస్టల్స్, రెస్టారెంట్లు లాంటి ప్రదేశాలలో ఈ పద్ధతి పాటిస్తే ఎక్కువ ఎరువు వస్తుందని అంటున్నది శిఖర. డిసెంబర్ 21న జరిగిన వర్క్‌షాపుకు ఇంట్లోని డబ్బాలనే ఉదాహరణగా చూపించింది.

### మరికొన్ని వర్క్‌షాపులు..

కంపోస్టింగ్ వర్క్‌షాపులే కాదు యోగా, వీగన్ డైట్ మీద కూడా వర్క్‌షాపులు నిర్వహిస్తున్నది శిఖరా. ఇర్రెగ్యులర్ పీరియడ్స్ గురించి ఇంటి దగ్గరే కొంతమందికి యోగా నేర్పిస్తున్నది. దీంతో చాలామంది సమస్యను అధిగమిస్తున్నారు. శిక్షణకు వచ్చేవారి వీలును బట్టి ఉదయం, సాయంత్రం గంట చొప్పున యోగా క్లాసులు చెబుతున్నది. నేర్పమని ఎక్కువమంది అడిగితే వర్క్‌షాపులు నిర్వహిస్తున్నది. ఫిబ్రవరి 2న అవర్ సాక్రెడ్ స్పేస్‌లో 'యోగా ఫర్ పికాస్' పేరుతో వర్క్‌షాపు నిర్వహించింది. రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 1000. యోగా ఒకటే చేస్తే సరిపోదు డైట్ కూడా పాటించాలి. చాలామంది 'వీగన్ డైట్' వెజిటేరియన్ గాని, నాన్‌వెజిటేరియన్ అని అనుకుంటారు. దీన్ని పూర్తిగా పాటించాలంటే జంతువుల నుంచి వచ్చే పదార్థాలను కూడా వాడకూడదు. భూమినుంచి పండించిన వాటిని మాత్రమే ఆహారంగా తీసుకోవాలి. ఫిబ్రవరి 2న వీగన్‌డైట్‌పై వర్క్‌షాపు పెట్టింది. నెలలు, సమయాన్ని బట్టి ఫీజు ఉంటుంది. మార్చిలో 'హోమ్ కంపోస్టింగ్ బయోఎంజైమ్' మీద వర్క్‌షాపు ఉంటుంది. పూర్తి వివరాల కోసం www.facebook.com/OurSacredSpace ను సంప్రదించండి.



### నచ్చితే చాలు

నేను పుట్టింది హైదరాబాద్‌లోనే. నాన్న రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్. అమ్మ హౌస్‌వైఫ్. నాకో తమ్ముడు. నేను పెర్మాకల్చర్ డిజైన్, ఇంజినీరింగ్ చేసి ఏడాదిపాటు ఉద్యోగం చేశాను. ఉద్యోగం మానేసి 2018 అక్టోబర్‌లో ముంబై వెళ్లి 'హఠయోగా' కోర్స్ చేశాను. హైదరాబాద్‌కు వచ్చాక అవర్ సాక్రెడ్ స్పేస్‌లో వర్క్‌షాపులు నిర్వహించడానికి పర్మిషన్ అడిగాను. వారు నన్ను 'పార్ట్‌టైమ్‌గా పనిచేస్తావా?' అని అడిగారు. ఓకే చెప్పాను. అప్పటినుంచి వర్క్‌షాపులు, ఆ ప్రదేశంలో జరిగే ప్రోగ్రామ్స్‌కి కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నాను. దీంతోపాటు అమెరికన్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ మెడిసిన్‌లో క్లినికల్ న్యూట్రిషన్ కోర్సు చేస్తున్నాను. ఇది పూర్తయ్యాక ప్రజలకు ఆహార విషయాలపై అవగాహన కల్పిస్తాను.

**- శిఖరారెడ్డి**

...సరస్వతి వనజ | వీరగోని రజినీకాంత్

## కాటుక పెట్టుకునే ముందు..



**రవ్వంత కాటుక పెట్టుకున్నా కళ్లకు అందమే. కళ్లు పలికే భావాల్ని కాటుక రెట్టింపు చేస్తుంది. కాటుక పెట్టుకుంటే అందానికి అందం, కంటికి ఆరోగ్యం కూడా..**

- కాటుక పెట్టుకునే ముందు ముఖాన్ని శుభ్రంగా కడుక్కొని కళ్లపై తడి లేకుండా తుడుచుకోవాలి.
- ఎక్కువగా చెమట పట్టే చర్మతత్వంగలవారు ఉక్కపోతగా ఉన్నప్పుడు కాటుక పెట్టుకునే వారు ముఖాన్ని ఐస్ ముక్కలతో మర్దన చేసుకోవాలి. దీనివల్ల చెమట పట్టడం తగ్గి తద్వారా కాటుక చెదరకుండా ఉంటుంది.
- కాటుక పెట్టుకునే ముందు మెత్తని వస్త్రంతో కనురెప్పను తుడుచుకోవాలి. దీనివల్ల కనురెప్పలపై ఉండే జిడ్డు పూర్తిగా తొలిగిపోతుంది. లేదా కొద్దిగా పౌడర్ కళ్ల చుట్టూ రాస్తే చర్మంపై ఉండే జిడ్డును పౌడర్ పీల్చుకొని కళ్లు తాజాగా ఉంటాయి.
- కనురెప్పల కొన భాగంలో కాటుక పెట్టుకొంటే చెరిగిపోయే అవకాశం ఎక్కువ. అందుకని కనురెప్పల మధ్యన కాటుక పెట్టుకోవాలి.
- కాటుక పెట్టుకునే ముందు కళ్లకు లైట్ కలర్ ఐషాడో బేస్‌గా వేసుకున్నా కాటుక చెదిరిపోకుండా చూసుకోవచ్చు.
- నాణ్యమైన కాటుక వాడాలి. కాటుక వాడినప్పుడు దురద, కళ్లు మంటలు పుట్టడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే దానిని వాడడం ఆపేయాలి.

## మేజోళ్లు వాడుతున్నారా?



- టైట్‌గా ఉన్న సాక్సులు రక్త ప్రసరణ మీద తీవ్ర ప్రభావం చూపుతాయి. బిగుతు సాక్సులు కాళ్లలో బ్లడ్ సర్క్యులేషన్ తగ్గుతుంది. దీంతో అసౌకర్యాన్ని పొందుతారు. సాక్సులు విప్పిన తర్వాత కాళ్ల ప్రాంతమంతా తెల్లగా, ఉబ్బినట్లుగా కనిపిస్తుంది. కనుక బిగుతుగా ఉన్న సాక్సులు ధరించవద్దు.
- మార్కెట్లో చాలారకాల సాక్సులు అందుబాటులో ఉన్నాయి. కానీ కేవలం కాటన్‌తో తయారు చేసిన సాక్సులు మాత్రమే కాలి సంరక్షణకు ఉపయోగపడుతాయి. వీలైనంత వరకు కాటన్ సాక్సులనే ఉపయోగించాలి.
- కొందరు షూ విప్పితే చాలు అదోరకమైన వాసన వస్తుంటుంది. కారణం సాక్సులు లేకుండా షూ వేసుకోవడం, సాక్సులు వేసుకున్నా చాలారోజులుగా వాటిని ఉతక్కపోవడం. ఇలా చేయడం వల్ల ఎదుటివారికి ఇబ్బంది కలుగుతుంది. చెడు అభిప్రాయం ఏర్పడుతుంది.
- సాక్సులు చాలారోజుల వరకు ఉతక్కపోతే అందులో బ్యాక్టీరియా చేరుతుంది. దీని కారణంగా కాలి చర్మానికి పుండ్లు ఏర్పడే ప్రమాదం ఉంటుంది.

# మెలానియా.. నీ రాక కోసం..

**అగ్రదేశానికి ప్రథమ మహిళ . వివాదాల భర్తకు సరైనా సలహాలిచ్చి, కుటుంబ బాధ్యతలు నిర్వర్తించే హోమ్ మినిస్టర్. ఒక బిడ్డకు తల్లి, పేరున్న మోడల్.. ఓ సామాజిక కార్యకర్త. అంతకుమించి మనసున్న సమాజ సేవకురాలు. ఇన్ని ప్రత్యేకతలు కలబోసిన విలక్షణ మహిళ మెలానియా ట్రంప్. త్వరలో మనదేశంలోకి అడుగు పెట్టబోతున్నారు. విభిన్న సంస్కృతులకు నిలయమైన భారతదేశంలో పర్యటించేందుకు ఎంతో ఉత్సాహం చూపుతున్నట్లు ట్విటర్ వేదికగా ప్రకటించారామె. ఇప్పుడు మెలానియా రాకకోసం.. దేశమంతా ఎదురుచూస్తున్నది. ఈ క్రమంలో అమెరికా ప్రథమ మహిళ శ్రీమతి మెలానియా ట్రంప్ గురించి ప్రత్యేక కథనం.**



Melania Trump @FLOTUS · 1d
Thank you @narendramodi for the kind invitation. Looking forward to visiting Ahmedabad & New Delhi later this month. @POTUS & I are excited for the trip & to celebrate the close ties between the #USA & #India.

Narendra Modi @narendramodi · 1d
Extremely delighted that @POTUS @realDonaldTrump and @FLOTUS will visit India on 24th and 25th February. India will accord a memorable welcome to our esteemed guests...

అమెరికా సామ్రాజ్యానికి అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ ఎన్నికైన దగ్గర్నుంచి.. నేటికీ ఎన్నో వివాదాలు ఆయన్ని చుట్టుముడుతున్నాయి. 'ట్రంపరితనం' వల్ల డెమోక్రాట్లు కూడా ఆయన్ను తప్పుపడుతున్నారు. ఈ మధ్యనే సొంత పార్టీ ఆవిశ్వాసం కూడా నెగ్గారు. అలాంటి వ్యక్తికి భార్యగా అమెరికా ప్రథమ పౌరురాలిగా, కష్టనష్టాల్లో అండగా నిలిచే శ్రీమతిగా మెలానియా ట్రంప్ సేవలు కొనియాడదగినవి. భర్తపై ఎన్ని వివాదాలు వస్తున్నా.. మీడియాలో పుకార్లు షికారు చేస్తున్నా.. ట్రంప్ మాజీ భార్యలు ఆమె వ్యక్తిత్వం గురించి కారుకూతలు కూసినా.. బెడిసిపోకుండా ధైర్యంగా సమాధానాలిస్తున్న ధీశాలి మెలానియా. అమెరికా దేశ రక్షణ కోసం అధ్యక్షుడి హోదాలో తన భర్త తీసుకోనే కొన్ని సాహసోపేత నిర్ణయాలను కూడా.. ఓ మాతృమూర్తిగా వ్యతిరేకించారు మెలానియా. ట్రంప్ ఇద్దరి భార్యల పిల్లలతో సఖ్యతగా ఉంటూ.. తన కొడుకు జీవితానికి బంగారు బాటలు వేస్తూ.. వైట్‌హౌస్‌కు వచ్చే విదేశాల అధ్యక్షులకు మర్యాదలో ఎలాంటి లోటు రాకుండా చూసుకుంటూ, పెద్ద బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. వీటితోపాటుగా సమాజసేవ, సామాజిక కార్యక్రమాలు, తనకిష్టమైన ఫ్యాషన్ షోలకు వెళ్తూ.. తన అభిరుచిని, సేవా గుణాన్ని చాటుతున్నారు. అందుకే మెలానియా ట్రంప్ చాలా ప్రత్యేకం.

### తల్లిగా.. వైట్‌హౌస్ గృహిణిగా..

మెలానియా అంతర్ముఖురాలని, ప్రైవేటు పర్సన్ అనీ ఎక్కువగా బయటకు వెళ్లడం, బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొనటం ఇష్టముండదని ట్రంప్ ఒక సందర్భంలో పేర్కొన్నారు. నిజమే ఈ ఫస్ట్ లేడీ మొదట తన 15యేండ్ల కుమారుడికి తల్లిగా బాధ్యతలు నిర్వర్తించడానికే ఆసక్తి చూపుతున్నారు. జాన్ ఎఫ్ కెన్నడీ జూనియర్ తరువాత 50 యేండ్ల అనంతరం వైట్‌హౌస్‌లో పెరుగుతున్న మొదటి మగపిల్లాడు మెలానియా కొడుకు బరాన్. మెలానియా ఇప్పుడు వైట్‌హౌస్‌లో తన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తున్నారు. వైట్‌హౌస్‌లోని ప్రయివేట్ క్వార్టర్స్‌లో ఉన్న అతిథులకు అవసరమైన లంచ్ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. కాంగ్రెస్ నేతలకు వైట్‌హౌస్ లాన్‌లో 'పిక్నిక్' ఏర్పాట్ల విషయంలో సలహాలు ఇస్తున్నారు. బరాన్ ఇప్పుడు వైట్‌హౌస్‌కి అలవాటు పడ్డాక ఆమె మరింత చురుగ్గా బాధ్యతలు స్వీకరిస్తున్నారు. ఇప్పుడు వైట్‌హౌస్‌కు సంబంధించిన అన్ని పనుల్లో తన మార్క్ చూపిస్తున్నారు మెలానియా.

### విమర్శలకు దీటుగా జవాబు..

ట్రంప్ మాజీ భార్యలు, మీడియా తనపై చేసే విమర్శలకు దీటైన జవాబు ఇస్తుంటారు మెలానియా. ఈ క్రమంలోనే మొదటి భార్య ఇవానా ట్రంప్‌కు సోషల్ మీడియా వేదికగా చురకలంటించారు మెలానియా. అమెరికా ఎన్నికల సమయంలో 'డెయిలీ మెయిల్' వార్తాసంస్థ మెలానియాపై చెడుగా ప్రచారం చేయటంతో ఆ సంస్థపై ఆమె 150 మిలియన్ డాలర్ల పరువునష్టం దావా వేశారు. దావా వేసిన రెండు గంటల్లోనే 'డెయిలీ మెయిల్' తన కథనాన్ని ఉపసంహరించుకోవడం విశేషం. 'పీపుల్ మ్యాగజైన్' మాజీ స్టాఫ్ రిపోర్టర్ నటాషా స్టాయ్‌నాఫ్‌కు కూడా గట్టి కౌంటర్ ఇచ్చి భర్తకు మద్దతుగా నిలిచారు. ఇప్పటికీ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటూ.. వైట్‌హౌస్ అధికారిక కార్యక్రమాల విశేషాలను, విదేశీ పర్యటనలను, కొడుకు బారన్ సంగతులను నెటిజన్లతో పంచుకుంటారు మెలానియా.

### మెలానియా జీవిత విశేషాలు..

- మెలానియా డోనాల్డ్ ట్రంప్‌తో 1998 నుంచి డేటింగ్ మొదలుపెట్టి 2005లో వివాహం చేసుకున్నారు.
- మరుసటి సంవత్సరమే వారికి కుమారుడు బారెన్ జన్మించాడు.
- ట్రంప్ మొదటి భార్య ఇవానా కుమారుడు జూనియర్ ట్రంప్ కంటే మెలానియా 8 యేండ్లు పెద్ద.
- 1998లో న్యూయార్క్‌లో జరిగిన ఒక పార్టీలో బిలియనీర్ ట్రంప్ మెలానియాని కలిశారు. తన ఫోన్ నంబర్ అడిగినా 28 యేండ్ల మెలానియా ఇవ్వలేదు. తర్వాత వీరి పరిచయం ప్రేమగా, పెండ్లిగా మారింది.
- మెలానియాకు స్లొవేన్, ఇంగ్లీషు, ఫ్రెంచ్, సెర్బియన్, జర్మన్ భాషలు తెలుసు. కానీ ఆమె భాషలో తన దేశ భాష తాలూకూ యాస ఎక్కువగా పలకడం వలన ఎక్కువగా ప్రసంగాలు ఇవ్వరు.
- అమెరికా ఫస్ట్ లేడీ అయిన మొట్టమొదటి కమ్యూనిస్ట్ దేశస్తురాలు ఆమె. అలాగే లూయిసా యాడమ్స్ తరువాత రెండవ విదేశీ అమెరికా ప్రథమ మహిళ కూడా.
- పత్రికలకు నగ్నంగా పోజిచ్చిన ఒక మోడల్ అమెరికా ప్రథమ మహిళ కావటం మొదటిసారనే పేరుని మెలానియా భరించాల్సి వచ్చింది.
- స్లోవేనియాలో ఏప్రిల్ 26, 1970లో జన్మించారు మెలానియా.



...డప్పు రవి

నమస్తే తెలంగాణ
# చిత్రం
[ కరీంనగర్ ]
బుధవారం 19 ఫిబ్రవరి 2020


'లవ్‌స్టోరీ' చిత్రంలో సాయిపల్లవి, నాగచైతన్య


వెంకీ కుడుముల, త్రివిక్రమ్, రష్మిక మందన్న, నితిన్, నాగవంశీ

# త్రివిక్రమ్ నాకు మార్గదర్శకుడు!

'**భీ**ష్మ' చిత్రాన్ని చూశాను. చాలా బాగుంది. ప్రతి ఒక్కరు ఈ సినిమాను ఆస్వాదిస్తారని నమ్ముతున్నా. నితిన్‌కు నా శుభాకాంక్షలు' అన్నారు ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్న 'భీష్మ' ప్రీరిలీజ్ వేడుక సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. నితిన్, రష్మిక మందన్న జంటగా నటించిన ఈ చిత్రానికి వెంకీ కుడుముల దర్శకత్వం వహించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మించారు. ఈ నెల 21న ప్రేక్షకులముందుకురానుంది. త్రివిక్రమ్ మాట్లాడుతూ 'సినిమాలో వెంకట్ మాస్టర్ మంచి ఫైట్‌ను డిజైన్ చేశారు. 'బుట్టబొమ్మ' సాంగ్ మాదిరిగా 'వాటే బ్యూటీ' అనే పాటను జానీ మాస్టర్ చక్కగా తీర్చిదిద్దాడు. 'జెర్సీ' తర్వాత నిర్మాత వంశీ మరో మంచి సినిమాతో ముందుకొస్తున్నాడు' అన్నారు. 'దర్శకుడు వెంకీ కుడుముల నా అభిమాని. ఒక ఫ్యాన్‌బాయ్ సినిమా చేస్తే ఎలా ఉంటుందో ఈ సినిమా అలా ఉంటుంది. 'దిల్' 'సై' తర్వాత మళ్లీ నన్ను ఆ కోణంలో చూపించాడు. ఈ సినిమాలో నేను చేసిన డ్యాన్స్ చూసి అభిమానుల ఆకలి తీరుతుందని భావిస్తున్నా. స్వరసాగర్ సుస్వరాలతో సినిమాకు లైఫ్ నిచ్చారు. ఈ సినిమాతో రష్మిక నాకు మంచి ఫ్రెండ్ అయింది. ఆమె ఇంకా పెద్ద స్థాయికి వెళ్లాలని కోరుకుంటున్నా. నా లైఫ్‌లో పంచప్రాణాలు..మా అమ్మానాన్నలు, అక్క, బావ, పవన్‌కల్యాణ్, త్రివిక్రమ్. ఇప్పుడు పెళ్లిచేసుకోబోతున్నా కాబట్టి నా భార్య ఆరోప్రాణం. త్రివిక్రమ్‌గారితో పరిచయంకావడం, 'అఆ' సినిమా చేయడం...నా జీవితంలో ఆయన ఉండటం అదృష్టంగా భావిస్తా. ఆయన నాకు మార్గదర్శకుడు' అని నితిన్ చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'త్రివిక్రమ్‌కు నేను భక్తుడిని. ఈ సినిమా కథకు సమయం తీసుకుంది. అందువల్లే కొంచెం లేట్ అయింది. నిరీక్షణకు తగినట్లుగా సినిమా బాగా వచ్చింది. ఈ సినిమా ప్రతి ఒక్కరిని మెప్పిస్తుంది' అని చెప్పారు. 'ఈ సినిమా ద్వారా దర్శకుడు వెంకీ కుడుముల, హీరో నితిన్ వంటి నిజాయితీ కలిగిన వ్యక్తులతో మంచి స్నేహం ఏర్పడింది. వారిద్దరికి జీవితాంతం మంచి ఫ్రెండ్‌గా ఉంటాను' అని రష్మిక మందన్న చెప్పింది. దిల్‌రాజు మాట్లాడుతూ 'ఈ సినిమా చూసి హ్యాపీగా ఫీలయ్యా. అంత బాగా నవ్వించారు. నితిన్ డ్యాన్సులు అద్భుతంగా చేశాడు. పాటలన్నీ బాగున్నాయి. ప్రేక్షకులలందరూ సినిమాను ఎంజాయ్ చేస్తారు' అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

# శంకరాభరణం చిరస్మరణీయం

**తె**లుగు చిత్రసీమ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పిన చిత్రాల్లో కె. విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన 'శంకరాభరణం' ఒకటి. ఈ సినిమా విడుదలై నలభై ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా బాపు-రమణ అకాడెమీ సోమవారం హైదరాబాద్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా కె. విశ్వనాథ్ మాట్లాడుతూ '1980లో ఈ సినిమా విడుదలైంది. ఇప్పుడు చూసినా నలభై ఏళ్లు వెనక్కి వెళ్లిన భావన కలుగుతుంది' అని తెలిపారు. సిరివెన్నెల సీతారామశాస్త్రి మాట్లాడుతూ ''శంకరాభరణం' సినిమా తీయడం మన తెలుగు చిత్ర పరిశ్రమ చేసుకున్న అదృష్టం. చిరస్మరణీయమైన సినిమా ఇది' అని తెలిపారు.


కె.విశ్వనాథ్

''శంకరాభరణం, 'సాగరసంగమం' లాంటి చిత్రాలను ప్రస్తుత దర్శకుల నుంచి ఆశించకూడదు. కె. విశ్వనాథ్ ఒక్కరే ఈ సినిమాలకు చిరునామా. మళ్లీ ఇలాంటి సినిమాలు రావు. తీసేవారు లేరు' అని దర్శకుడు హరీష్‌శంకర్ అన్నారు. విశ్వనాథ్‌తో తన కాంబినేషన్‌లో ఎన్నో విజయవంతమైన చిత్రాలొచ్చాయని నటుడు చంద్రమోహన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డబ్బింగ్‌జానకి, వంశీ, ఏడిదరాజా, ఏడిద శ్రీరామ్, కాశీవిశ్వనాథ్, రెంటాల జయదేవ తదితరులు పాల్గొన్నారు.

# గ్రహణం వీడితే..


అభిరామ్, కృతిగార్గ్

''**రా**హు' టైటిల్, ట్రైలర్ ఆసక్తికరంగా ఉన్నాయి. పాటలు విజయవంతమయ్యాయి. సినిమా ప్రేక్షకుల ఆదరణను పొందాలి' అని చెప్పింది జీవిత రాజశేఖర్. అభిరామ్ వర్మ, కృతిగార్గ్ జంటగా నటిస్తున్న చిత్రం 'రాహు'. సుబ్బు వేదుల దర్శకత్వం వహిస్తూ ఏ.వి.ఆర్ స్వామి, శ్రీ శక్తి బాబ్జీ, రాజా దేవరకొండలతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 28న విడుదలకానుంది. మంగళవారం హైదరాబాద్‌లో ఆడియో విజయోత్సవ వేడుకను చిత్రబృందం నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'కన్వర్షన్ డిజార్డర్ అనే సమస్యతో బాధపడే ఓ యువతి కథ ఇది. టెన్షన్‌కు గురైతే ఆమెకు కళ్లు కనిపించవు. ఆమె లైఫ్‌లోకి ఓ రాహు లాంటి వ్యక్తి వస్తాడు? అతడెవరూ? తన సమస్యను అధిగమిస్తూ శత్రువుతో ఎలాంటి పోరాటం సాగించింది? చివరకు రాహు గ్రహణం ఎలా వీడింది? అన్నది ఆసక్తిని పంచుతుంది. పాటలు పెద్ద విజయాన్ని సాధించడం ఆనందంగా ఉంది' అని తెలిపారు. 'చిన్న సినిమాలోని పాటలు విజయవంతమైతే ఓపెనింగ్స్ బాగుంటాయి. ప్రస్తుతం థ్రిల్లర్ సినిమాల ట్రెండ్ కొనసాగుతుంది. ఆ కోవలో ఈ సినిమా విజయం సాధించాలి' అని మధుర శ్రీధర్ చెప్పారు. సినిమా చూశానని, తనను ఎంతగానో ఆకట్టుకున్నదని రాజ్ కందుకూరి పేర్కొన్నారు. కథాబలమున్న మంచి సినిమాతో హీరోగా పరిచయం కానుండటం ఆనందంగా ఉందని అభిరామ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో అదితి భావరాజు, శ్రీనివాస మౌళి తదితరులు పాల్గొన్నారు.

# జీరో నుంచి హీరో..


విజయ్‌ధరన్, రాశీసింగ్

**ఆ**ర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్య థియేటర్ పేరు వినగానే వంద రోజుల ఆడిన ఎన్నో సినిమాలు గుర్తుకొస్తాయి. ఆ థియేటర్‌లో ప్రొజెక్టర్ ఆపరేటర్‌గా దశాబ్ద కాలం పనిచేసిన టి.మహిపాల్‌రెడ్డి దర్శకుడిగా మారి రూపొందించిన చిత్రం 'పోస్టర్'. విజయ్‌ధరన్, రాశీసింగ్, అక్షత సోనావానే నాయకానాయికలుగా నటించారు. టి.శేఖర్‌రెడ్డి, ఏ.గంగారెడ్డి, ఐ.జి. రెడ్డి నిర్మించారు. ఈ చిత్ర టీజర్‌ను నిర్మాత సురేష్‌బాబు విడుదలచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'థియేటర్ బ్యాక్‌డ్రాప్‌లో దర్శకుడు మహిపాల్ ఆసక్తికరంగా సినిమాను తెరకెక్కించినట్లుగా కనిపిస్తున్నది. ప్రేక్షకుల్ని ఆకట్టుకునే అన్ని హంగులు సమపాళ్లలో ఉన్నాయి' అని తెలిపారు. దర్శకుడు మాట్లాడుతూ 'పోస్టర్స్ అంటించడానికి పనికిరాని ఓ వ్యక్తి పోస్టర్‌లలో తన ఫొటో ముద్రితమయ్యే స్థాయికి ఎలా చేరుకున్నాడన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. సమస్యల్ని అధిగమించి ముందుకు వెళితే జీవితం బాగుంటుంది. చిన్న సమస్యలకు క్రుంగిపోయి ఆత్మహత్యలకు పాల్పడటం సరికాదనే సందేశాన్ని చాటిచెబుతున్నాం. సెన్సార్ జరుగుతున్నది. రాహుల్ సిప్లిగంజ్ ఆలపించిన పాటకు చక్కటి స్పందన లభిస్తున్నది' అని చెప్పారు. జీరో నుంచి హీరోగా మారిన ఓ వ్యక్తి కథ ఇదని విజయ్ ధరన్ పేర్కొన్నారు. శివాజీరాజా, మధుమణి, కాశీవిశ్వనాథ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శాండీ అద్దంకి, కెమెరా: రాహుల్.

# అర్జున రాజకీయం


రాజశేఖర్

**రా**జశేఖర్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'అర్జున'. కన్మణి దర్శకుడు. నట్టి క్రాంతి, నట్టి కరుణ నిర్మాతలు. మరియం జకారియా కథానాయిక. మార్చి 6న ఈ సినిమా విడుదలకానుంది. నిర్మాతలు మాట్లాడుతూ 'తండ్రీకొడుకులుగా రాజశేఖర్ ద్విపాత్రాభినయంలో నటించిన చిత్రమిది. సమకాలీన రాజకీయాల నేపథ్యంలో రూపొందింది. సూర్యనారాయణ అనే రైతుగా, అర్జున అనే యువకుడిగా భిన్న పార్శ్వాలతో రాజశేఖర్ పాత్రలు కొత్త పంథాలో సాగుతాయి. వాస్తవ ఘటనల స్ఫూర్తితో వాస్తవికతను ప్రతిబింబిస్తూ దర్శకుడు కన్మణి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. త్వరలో ట్రైలర్‌ను విడుదలచేస్తాం' అని తెలిపారు.

# హర్భజన్‌తో ఫ్రెండ్‌షిప్


అర్జున్

**ప్ర**ముఖ క్రికెటర్ హర్భజన్ సింగ్ హీరోగా అరంగేట్రం చేస్తున్న చిత్రం 'ఫ్రెండ్‌షిప్'. జాన్‌పాల్‌రాజ్, శ్యామ్ సూర్య దర్శకులు. జేపీఆర్, స్టాలిన్ నిర్మిస్తున్నారు. లోస్లియా మరియనేసన్ కథానాయిక. ఈ సినిమాలో సీనియర్ నటుడు అర్జున్ కీలక పాత్రను పోషించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. 'తెలుగు, తమిళంతో పాటు పలు భారతీయ భాషల్లో ఈ సినిమాను విడుదలచేయనున్నాం. త్వరలో ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని వెల్లడిస్తాం. హర్భజన్, అర్జున్ పాత్రలు కొత్తగా ఉంటాయి. వేసవిలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని చిత్ర బృందం తెలిపింది.

**సౌ**కర్యవంతమైన స్థితి నుంచి బయటకు వచ్చి సాహసాలకు పూనుకున్నప్పుడే జీవితంలో అనుకున్న విజయాల్ని సాధించగలమని చెప్పింది కన్నడ సోయగం పూజాహెగ్డే. ప్రస్తుతం ఈ అమ్మడు తెలుగు చిత్రసీమలో సత్తా చాటుతోంది. వరుస విజయాలతో అగ్ర కథానాయికగా దూసుకుపోతున్నది. ఇటీవలే 'అల వైకుంఠపురములో' కెరీర్‌లోనే అపూర్వమైన విజయాన్ని సొంతం చేసుకుంది. తాను సాధిస్తున్న విజయాల వెనక ధైర్యంగా తీసుకున్న నిర్ణయాలే కారణమని చెబుతున్నది పూజాహెగ్డే. ఆమె మాట్లాడుతూ 'మనలో చాలా మంది కాస్త సంపాదన మొదలుపెట్టగానే లైఫ్‌లో సెటిల్ అయిపోయామనుకుంటారు. జీవితం హాయిగా గడచిపోతుంది

# రొటీన్‌కు గుడ్‌బై చెప్పాలి..

కదా.. అనవసరమైన రిస్క్‌లు తీసుకోవద్దని భావిస్తారు. తమలో ఉన్న ప్రతిభను వెలికితీసే ప్రయత్నం ఏమాత్రం చేయరు. అలా ఒకే రకమైన లైఫ్‌స్టైల్‌కు అలవాటుపడిపోతే క్రమంగా జీవితం బోర్ కొడుతుంది. కాబట్టి జీవితంలో సాహసాలు చేయడం చాలా అవసరం. ఇతరుల కంటే భిన్నంగా ఆలోచించడం..కార్యసాధనలో వైవిధ్యతను చూపించడం ఈ రోజుల్లో చాలా ముఖ్యం. అప్పుడే మనకంటూ ఓ ప్రత్యేకత ఏర్పడుతుంది. అంతిమంగా కంఫర్ట్‌జోన్ నుంచి బయటపడి రొటీన్ లైఫ్‌కు గుడ్‌బై చెప్పినప్పుడే విజయాలు దక్కుతాయి' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ సుందరి తెలుగులో ప్రభాస్ 'జాన్'తో పాటు అఖిల్ సరసన 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్'లో కథానాయికగా నటిస్తున్నది.


పూజాహెగ్డే


తాప్సీ

# జర్మన్ సినిమా రీమేక్‌లో..

**బా**లీవుడ్‌తో పాటు దక్షిణాది చిత్రసీమలో భిన్నత్వానికి చిరునామాగా నిలుస్తున్నది తాప్సీ. సరికొత్త కథాంశాల్ని ఎంచుకుంటూ నవతరం తారల్లో వైవిధ్యతను చాటుకుంటున్నది. కమర్షియల్ సినిమాలకు దూరంగా ఉంటూ ప్రయోగాలకు ప్రాముఖ్యతనిస్తున్న ఈ పంజాబీ సొగసరి తాజాగా జర్మన్ సినిమా రీమేక్‌లో నటించబోతున్నట్లు ప్రకటించింది. ఫ్రాంకా పొటెంటే, మోర్టిజ్ బ్లెబిట్ర్యూ ప్రధాన పాత్రల్లో 1998లో విడుదలైన జర్మనీ చిత్రం 'రన్ లోలా రన్' విమర్శకుల ప్రశంసలతో పాటు పలు పురస్కారాల్ని దక్కించుకున్నది. ఈ చిత్రాన్ని హిందీలో 'లూప్ లపేటా' పేరుతో రీమేక్ చేస్తున్నారు. ఇందులో తాప్సీ కథానాయికగా నటించనున్నది. ట్విట్టర్ ద్వారా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది తాప్సీ. 'మంచి కథల్లో నటించాలనే ఆత్యాశ ఎక్కువ. అలాంటి వాటిలో ఈ సినిమా ఒకటిగా నిలుస్తుంది' అని పేర్కొన్నది. కామెడీ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ఆకాష్ భాటియా దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 29న ఈ చిత్రం విడుదలచేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. తన ప్రేమికుడిని కాపాడుకోవడం కోసం ఓ యువతి సాగించిన ప్రయాణం నేపథ్యంలో ఈ కథ సాగుతుంది.

# దిశ అదృశ్యమైతే ?

**క**మర్షియల్ సినిమాలతో నటనకు ఆస్కారమున్న పాత్రలను ఎంచుకుంటూ తన ప్రయాణాన్ని కొనసాగిస్తానని చెబుతున్నది దిగంగనా సూర్యవన్షీ. ఆమె కథానాయికగా నటించిన చిత్రం 'వలయం'. లక్ష్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి రమేష్ దర్శకుడు. ఈ నెల 21న విడుదలకానుంది. మంగళవారం హైదరాబాద్‌లో దిగంగనా సూర్యవన్షీ మాట్లాడుతూ 'సస్పెన్స్ థ్రిల్లింగ్ అంశాలతో ముడిపడిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. దిశ అనే యువతిగా నా పాత్ర సింపుల్‌గా ఉంటుంది. పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకొని సంతోషంగా వైవాహిక జీవితాన్ని మొదలుపెట్టాలని ఆశిస్తుంది. అనూహ్యంగా పెళ్లైన తర్వాత రోజు దిశ అదృశ్యమవుతుంది. ఆమె అదృశ్యం వెనకున్న కారణాలేమిటనే ప్రశ్నలకు సమాధానమే ఈ చిత్రం. కాన్సెప్ట్‌ను నమ్మి ఈ సినిమాను అంగీకరించాను. కథ వింటున్నప్పుడే తర్వాత ఏం జరుగుతుందోననే ఉత్కంఠ నాలో కలిగింది. తొలి సినిమా 'హిప్పీ' ఫలితంతో సంబంధం లేకుండా కథానాయికగా నన్ను తెలుగు ప్రేక్షకులు స్వీకరించడం ఆనందంగా ఉంది. ఆ సినిమాలో పూర్తిగా గ్లామర్ పాత్రను పోషించాను. మూసధోరణికి పరిమితం కాకుండా నా ఇమేజ్‌ను మార్చుకోవాలనే ఆలోచనతో నటనకు ప్రాధాన్యమున్న ఈ కథను ఎంచుకున్నాను. గోపీచంద్ హీరోగా నటిస్తున్న 'సీటీమార్' ఓ కథానాయికగా నటిస్తున్నాను' అని తెలిపింది.


దిగంగనా సూర్యవన్షీ

## భారీగా మేడారం హుండీ ఆదాయం

ఏడు రోజుల లెక్కింపులో రూ.10.29 కోట్లు..

**వరంగల్ కల్చరల్:** మేడారం సమ్మక్క సారలమ్మ జాతర హుండీల లెక్కింపు కొనసాగుతున్నది. మొత్తం 494 హుండీలకు గాను ఈ ఏడు రోజుల్లో 436 హుండీలను లెక్కించగా రూ.10,29,92,912 ఆదాయం సమకూరినట్టు ఈవో తెలిపారు. మిగతా హుండీలను బుధవారం లెక్కిస్తామన్నారు. భక్తులు సమర్పించిన కానుకలను గురువారం తూకం వేసి లెక్కకడుతామని ఈవో తెలిపారు.

## డీసీసీబీ, డీసీఎంఎస్‌లన్నీ టీఆర్‌ఎస్‌కే!

- సహకార ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం
- ఏకగ్రీవం లాంఛనమే.. నేడు ఓటరు జాబితా ఖరారు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ఎన్నికల్లో టీఆర్‌ఎస్ విజయదుందుభి మోగించనున్నది. అన్ని జిల్లాల్లో మెజార్టీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను టీఆర్‌ఎస్ మద్దతుదారులు చేజిక్కించుకోవడంతో ప్రతి జిల్లా డీసీసీబీ, డీసీఎంఎస్‌ల చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులను గులాబీ పార్టీ ఏకగ్రీవంగా దక్కించుకోవడం లాంఛనంగా మారింది. కనీసం చైర్మన్, వైస్‌చైర్మన్ స్థానాలకు నామినేషన్‌వేసే పరిస్థితి కూడా విపక్షాలకు లేకుండాపోయింది. రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన 9 డీసీసీబీ, 9 డీసీఎంఎస్‌లకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. ప్రతి డీసీసీబీకి 20 మంది డైరెక్టర్లు, డీసీఎంఎస్‌లకు 10 మంది డైరెక్టర్ల చొప్పున పాలకవర్గాలను ఎన్నుకోనున్నారు. ఈ నెల 20న ఎన్నికల నిర్వహణకు సంబంధించి నోటిఫికేషన్ జారీఅయ్యే అవకాశాలున్నాయి. ఓటర్ల తుదిజాబితా బుధవారం ఖరారుకానున్నది. ఆదిలాబాద్ జిల్లాలో 77 పీఏసీఎస్‌లకు గాను 72, నల్లగొండలో 109కిగాను 93, నిజామాబాద్‌లో 144కి 136, మెదక్‌లో 111కి 92, రంగారెడ్డిలో 68కి 49, ఖమ్మంలో 97కి 82, మహబూబ్‌నగర్‌లో 76కి 72, కరీంనగర్‌లో 125కు 118, వరంగల్‌లో 97కి 89 పీఏసీఎస్‌లను టీఆర్‌ఎస్ గెలుచుకున్నది. డీసీసీబీ, డీసీఎంఎస్‌కు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 904 మంది ఓటర్లు ఉన్నారు.

## నాన్నలేని లోకంలో ఉండలేను..

- తండ్రి మరణాన్ని తట్టుకోలేక గోదావరిలో దూకిన కూతురు
- గల్లంతైన యువతి కోసం గాలింపు


సాయిప్రియ

**ఫెర్టిలైజర్‌సిటీ:** తండ్రి మరణాన్ని తట్టుకోలేక కూతురు గోదావరిలోకి దూకింది. గల్లంతైన యువతికోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ ఘటన పెద్దపల్లి జిల్లాలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు చెందిన వసంతం సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతదేహాన్ని చెన్నూర్‌కు అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా.. వెనుక కారులో కుటుంబ సభ్యులు వస్తున్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని సమీపంలోని గోదావరి బ్రిడ్జివద్దకు రాగానే, కారులో ఉన్న వసంతం ఆరో కుమార్తె సాయి ప్రియ (32) తనకు వాంతులు వస్తున్నాయంటూ కారు ఆపాలని డ్రైవర్‌కు చెప్పింది. కారు దిగి ఒక్కసారిగా వంతెనపైనుంచి గోదావరిలోకి దూకింది. కుటుంబ సభ్యులు కారు దిగి వచ్చేసరికే సాయి ప్రియ గోదావరిలో గల్లంతైంది. పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు.




దొంగతనం జరిగిన ఇల్లు వద్ద విచారణ చేపడుతున్న పోలీసు బృందాలు

## ముసుగు దొంగల అలజడి

- ఇంట్లో చొరబడి మహిళపై దాడి
- నగదు అపహరించి పరార్
- కేసును త్వరలోనే ఛేదిస్తామన్న డీసీపీ

**ఖైరతాబాద్:** ముసుగులు ధరించిన ముగ్గురు వ్యక్తులు తెల్లవారుజామున పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో చొరబడి అలజడి సృష్టించారు. మహిళపై దాడిచేసి, నగదు దోచుకెళ్లారు. అమీర్‌పేట లాల్‌బంగ్లా సమీపంలోని అపరాజిత కాలనీలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఇంటి నం. 6-3-953/1/2లో నివసిస్తున్న పద్మా రఘురాజ్ (86), ఆమె కుమార్తె నందితాకపూర్ (56), మనుమరాలు కీర్తి యాసం (24) మంగళవారం తెల్లవారుజామున గాఢ నిద్రలో ఉన్నప్పుడు గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు తీగ సాయంతో ప్రధాన ద్వారం తెరిచి లోనికి ప్రవేశించారు. ఆ అలికిడికి నందితాకపూర్ నిద్రలేచి వారికి ఎదురుగా వెళ్లగా..డబ్బులు, నగదు ఇవ్వాలని బెదిరించారు. అందుకు నిరాకరించడంతో దొంగలు తమవెంట తెచ్చుకున్న సుత్తితో ఆమె తలపై మోదారు. దీంతో ఆమె అపస్మారక స్థితికి చేరుకున్నది. ఇంతలో పద్మారఘురాజ్, కీర్తి కూడా అక్కడికి రావడంతో ముగ్గురిని బాత్ రూమ్‌లో వేసి గడిపెట్టిన దొంగలు.. ఆ ఇంట్లో బీరువాలు, కప్‌బోర్డులను తనిఖీ చేశారు. అక్కడ ఏమీ లభించకపోవడంతో ఓ టేబుల్‌పై ఉన్న రూ.1,500 నగదు తీసుకొని పరారయ్యారు. ఆ తర్వాత బాధితులు అతికష్టంమీద తలుపులు తెరుకొని పంజగుట్ట పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వెస్ట్‌జోన్ డీసీపీ, జాయింట్ కమిషనర్ ఏఆర్ శ్రీనివాస్, పంజగుట్ట ఏసీపీ తిరుపతన్న, ఎస్‌హెచ్‌వో నిరంజన్‌రెడ్డి, డీఐ నాగయ్య, డీఎస్సై షఫీ, సీసీఎస్ పోలీసుల బృందం అక్కడికి చేరుకొని విచారణ చేపట్టారు. క్లూస్‌టీమ్స్‌తో పాటు జాగిలాలను రప్పించారు. చోరీకి ముందు ఆ ఇంటివద్ద దొంగలు మూడురోజులపాటు రెక్కీ నిర్వహించినట్టు తెలుస్తున్నది. ముసుగులు ధరించిన ముగ్గురు వ్యక్తులు మంగళవారం తెల్లవారుజామున 2.30 గంటలకు ఆ ఇంటి చుట్టుపక్కల తచ్చాడినట్టు సీసీ ఫుటేజీలో గుర్తించారు. వీరిని ఉత్తరాదికి చెందినవారుగా భావిస్తున్నామని, నిందితులను త్వరలోనే పట్టుకొంటామని డీసీపీ శ్రీనివాస్ తెలిపారు.

# ఎస్సారార్ @ 24.850 టీఎంసీలు

- కాళేశ్వరం లింక్-1, 2లో ఎత్తిపోతలు
- 10.228 టీఎంసీలకు చేరిన ఎల్‌ఎండీ


జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని లక్ష్మి పంప్‌హౌజ్‌లో నడుస్తున్న మోటర్లు

**కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, కరీంనగర్/కాళేశ్వరం:** కాళేశ్వరం ప్రాజెక్ట్ లింక్-1, 2లో గోదావరి జలాల ఎత్తిపోతలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని లక్ష్మి పంప్‌హౌజ్‌లో 1, 3, 4, 5వ మోటర్లను నడిపించి గోదావరి జలాలను గ్రావిటీ కెనాల్ ద్వారా సరస్వతి బరాజ్‌కు తరలించారు. ఈ బరాజ్‌లో ప్రస్తుతం 9.05 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. సరస్వతి, పార్వతి బరాజ్‌లలో నీటి మట్టం పూర్తి స్థాయికి చేరుకుంటుండటంతో సాయంత్రం ఈ పంప్‌హౌస్‌లోని అన్ని మోటర్లను ఆఫ్‌చేసినట్టు ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు తెలిపారు.

**పార్వతి నుంచి ఎల్లంపల్లికి ఎత్తిపోతలు..**

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోలివాడలోని పార్వతి పంప్‌హౌజ్ నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి నీటిని ఎత్తిపోస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు 4, 5, 6, 7వ మోటర్లను ఆన్‌చేయగా, అవి 10,440 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నాయి. పార్వతి బరాజ్ 130.00 మీటర్లకు ఫోర్‌బేలో 128.30 మీటర్ల నీటి నిల్వఉన్నట్టు అధికారులు తెలిపారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారంలోని ఆరో ప్యాకేజీలో నంది పంప్‌హౌజ్‌లో ఎత్తిపోతలు కొనసాగాయి. మంగళవారం 3, 5, 6వ మోటర్ల ద్వారా నీటిని ఎత్తిపోశారు. ఒక్కో మోటర్ 3,150 క్యూసెక్కుల చొప్పున 9,450 క్యూసెక్కుల నీటిని నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోశారు. నంది రిజర్వాయర్ నుంచి ఏడో ప్యాకేజీలోని జంట సొరంగాల ద్వారా 8 ప్యాకేజీలోని కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌజ్‌కు తరలుతున్నాయి. ఇక్కడ మంగళవారం 1, 2, 3వ పంపులు నీటిని ఎత్తిపోశాయి. వీటి ద్వారా 9,450 క్యూసెక్కుల నీరు డెలివరీ సిస్టర్న్ నుంచి గ్రావిటీ కాల్వ ద్వారా వరద కాల్వకు, అక్కడి నుంచి ఎస్సారార్‌కు వెళ్తున్నాయి. మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు 5.333 టీఎంసీల నీటిని ఎత్తిపోసినట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

**ఎల్‌ఎండీకి 6,250 వేల క్యూసెక్కుల నీరు..**

రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం ఎస్సారార్ జలాశయం నుంచి ఎల్‌ఎండీకి మంగళవారం 6,250 క్యూసెక్కుల నీటిని పంపించారు. రివర్స్ స్లూయిస్ ద్వారా దిగువకు నీటిని పంపుతున్నారు. 10, 11, 16, 17వ గేట్ల ద్వారా రెండు రోజులుగా ఎత్తి దిగువకు నీటినివదిలిన అధికారులు మంగళవారం ఆగేట్లను మూసి వేశారు. ఎస్సారార్ జలాశయంలో 24.850 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. లక్ష్మీపూర్ పంపు హౌజ్ నుంచి వచ్చిన నీటిని యథావిధిగా దిగువకు వదలుతున్నట్టు వారు పేర్కొన్నారు. మంగళవారం ఎస్సారార్ జలాశయం నుంచి దిగువకు రివర్స్ స్లూయిస్ (4 తూముల)తో 6,250 క్యూసెక్కుల నీటిని పంపినట్టు తెలిపారు.

**10 టీఎంసీలకు ఎల్‌ఎండీ నీటిమట్టం**

ఎస్సారార్ జలాశయం స్లూయిస్ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో తిమ్మాపూర్ మండలంలోని ఎల్‌ఎండీలో నీటిమట్టం పెరుగుతున్నది. ప్రస్తుతం ఎల్‌ఎండీలోకి 10,439 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 265 క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో రూపంలో వెళ్తున్నది. ఎల్‌ఎండీలో ప్రస్తుతం 10.228 టీఎంసీలు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.

## తాసిల్ కార్యాలయం ఎదుట..
## రైతు కుటుంబం ఆత్మహత్యాయత్నం

**పెంట్లవెల్లి:** రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని ఓ రైతు కుటుంబం తాసిల్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. జటప్రోల్‌కు చెందిన బింగి పెద్ద నాగన్న అనే రైతుకు పెంట్లవెల్లి సమీపంలోని 658 సర్వేనంబర్‌లో 6 ఎకరాల పొలం ఉన్నది. ఆ భూమి 2015 వరకు ఆయన పేరు మీద ఉన్నది. 2017లో అందులోని 1.20 ఎకరాలను అధికారులు ఇతరుల పేరు మీదకు మార్చారు. ఈ విషయమై నాగన్న తాసిల్ కార్యాలయం చుట్టూ తిరిగినా వారు పట్టించుకోవడం లేదు. దీంతో విసుగుచెందిన రైతు మంగళవారం కుటుంబసభ్యులతో కలిసి పెంట్లవెల్లి తాసిల్ కార్యాలయం వద్దకు వచ్చి కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. అక్కడే ఉన్న వీఆర్‌ఏలు గమనించి అడ్డుపడి కిరోసిన్ డబ్బాను లాక్కున్నారు. తాసిల్దార్‌ను వివరణ కోరగా బింగి పెద్ద నాగన్న అనే రైతు చెందిన 1.20 ఎకరాల భూమి 2017లో మణెమ్మ భర్త మల్లయ్య పేరుమీద రికార్డులోకి నమోదైందని దీనిపై పరిశీలించి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## చెల్లి పెండ్లికి వస్తూ..

- రైలుదిగుతూ ప్రమాదవశాత్తు ఆర్మీజవాన్ దుర్మరణం
- రాజన్న సిరిసిల్ల జిల్లా గాలిపెల్లిలో విషాదం


అనిల్ (ఫైల్)

**ఇల్లంతకుంట/అంతర్గాం:** చెల్లి పెండ్లి కోసం వస్తున్న ఓ ఆర్మీ జవాన్ రైలు దిగుతుండగా ప్రమాదవశాత్తు కిందపడి ప్రాణాలు కోల్పోయారు. మంగళవా రం రాత్రి రామగుండలో జరిగిన ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపెల్లిలో విషాదం నింపింది. ఇల్లంతకుంట మండలం గాలిపెల్లికి చెందిన నంది పరుశురాం, పద్మ దంపతుల కొడుకు అనిల్ (24) మూడేండ్లుగా జమ్మూకశ్మీర్‌లో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. వచ్చే నెల 20న అతడి చెల్లెలు పెండ్లి ఉండటంతో మంగళవారం ఉదయం జమ్మూకశ్మీర్ నుంచి బయలుదేరారు. ఢిల్లీ నుంచి కర్ణాటక వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలులో బయలు దేరాడు. రామగుండంలో స్టాప్ లేకపోవడంతో రైలు నెమ్మదిగా వెళ్తుండగా దిగేందుకు ప్రయత్నించి అదే రైలుకింద పడి ప్రాణాలు విడిచాడు.

# నిరుపేదలకే 'డబుల్' ఇండ్లు

- కోటి ఎకరాలకు సాగునీరే లక్ష్యం
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- నెరవేరనున్న నిరుపేదల కల: మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- వనపర్తి జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇండ్లు ప్రారంభం


డబుల్ బెడ్‌రూం ఇండ్ల ప్రారంభోత్సవం సందర్భంగా లబ్ధిదారులతో స్పీకర్ పోచారం, మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** అర్హులైన నిరుపేదలకే డబుల్‌బెడ్‌రూం ఇండ్లను పంపిణీ చేస్తున్నామని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సమైక్య రాష్ట్రంలో పేదల పేరుతో పెద్దవాళ్లే ఇండ్లు కట్టుకున్నారని ఆరోపించారు. మంగళవారం వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలం కర్నెతండా, గార్లబండ తండా, రేవల్లి మండలం చెన్నారం గ్రామాల్లో నిర్మించిన 92 డబుల్ బెడ్‌రూం ఇండ్లను మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డితో కలిసి స్పీకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల నిర్వహించిన సమావేశాల్లో స్పీకర్ పోచారం మా ట్లాడుతూ.. నిరుపేదలు ఊహించని రీతిలో ఇండ్ల నిర్మాణం జరుగుతున్నదన్నారు. రాష్ట్రం లో డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకాన్ని పక్కాగా చేపడుతున్నట్టు తెలిపారు. ప్రాధాన్యక్రమంలో పేదలందరికి ఇండ్లు నిర్మించి ఇస్తామని చెప్పా రు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో వ్యవసాయానికి పెద్దపీట వేసి భారీ మార్పులకు శ్రీకారం చు ట్టారన్నారు. కోటి ఎకరాలకు సాగునీరందించేందుకు సీఎం కేసీఆర్ అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతులకు సంక్షేమపథకాలు అమలు చేస్తున్నారన్నారని చెప్పారు. సీఎం కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి.. ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేశారన్నారు. మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. వనపర్తి జిల్లాలో డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలు విజయవంతంగా సాగుతున్నాయని చెప్పారు. నిర్మాణంలో ఉన్న ఇండ్లను త్వరగా పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామని చెప్పారు. వనపర్తి నియోజకవర్గంలో 1,400 ఇండ్లు మంజూరు కాగా మొదటి విడుతలో 100 ఇండ్లను పూర్తిచేసినట్టు చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వారం రోజుల్లో పెండ్లి..

అంతలోనే దారుణహత్య


దివ్య (ఫైల్)

**గజ్వేల్‌టౌన్:** వారంలో పెండ్లి పీటలు ఎక్కాల్సిన యువతి దారుణ హత్యకు గురైంది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో మంగళవారం రాత్రి చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటకు చెందిన న్యాలకంటి లక్ష్మీరాజ్యం, మణెమ్మ దంపతుల కూతురు దివ్య (26) గజ్వేల్‌లోని గ్రామీణబ్యాంకులో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. తల్లిదండ్రులతో కలిసి దివ్య పట్టణంలోని లక్ష్మీప్రసన్నకాలనీలో అద్దెఇంట్లో నివాసం ఉంటున్నారు. మంగళవారం సాయంత్రం విధులు ముగించుకొని ఇంటికి చేరుకున్నారు. రాత్రి సమయంలో దివ్య ఒంట రిగా ఉండటం చూసి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి మెడ కోసి హత్య చేసి పారిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. దివ్య మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉన్నది.

## స్కౌట్స్ అండ్ గైడ్స్ పేరిట టోకరా?

- నిరుద్యోగుల నుంచి రూ.లక్షలు వసూలు!
- వరంగల్ సీపీని కలిసిన తెలంగాణ జాగృతి నేత

**వరంగల్ క్రైం:** కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆర్గనైజేషన్ పేరును ఓ స్వచ్ఛంద సంస్థ అక్రమంగా వాడుకుంటూ నిరుద్యోగులకు టోకరా పెట్టిందని తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొరబోయిన విజయ్‌కుమార్ ఆరోపించారు. ఈ విషయమై మంగళవారం ఆయన వరంగల్ సీపీ రవీందర్‌ను కలిసి సదరు స్వచ్ఛంద సంస్థ వ్యవహారంపై ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులకు కేంద్రప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగాలు ఇస్తామని నమ్మిం చి స్వచ్ఛంద సంస్థ లక్షలరూపాయలు వసూలు చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ రాష్ట్ర చీఫ్ కమిషనర్‌గా మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత బాధ్యతలు నిర్వర్తిస్తున్న నేపథ్యంలో చీఫ్ కమిషనర్‌కు తెలియకుండానే పొరిక అనసూర్య అనే మహిళ కమిషనర్‌గా స్వచ్ఛందంగా ప్రకటించుకొని స్కౌట్స్ అండ్ గైడ్స్ పేరును వాడుకుంటున్నట్టు ఆరోపించారు. భారత్ పేరు తొలిగించి స్కౌట్స్ అండ్ గైడ్ ఆర్గనైజేషన్ పేరుతో హన్మకొండలోని జవహర్ కాలనీలో కమిషనర్ కార్యాలయాన్ని స్థాపించి రాష్ట్రవ్యాప్తంగా 180 మంది ట్రైనర్స్‌ను నియమించుకొని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ ఇప్పిస్తున్నదన్నారు. ఈ నెల 21 నుంచి ఢిల్లీలో జరిగే వరల్డ్‌స్కౌట్స్ అండ్ గైడ్స్ డే పురస్కరించుకొని హన్మకొండలోని ప్రభుత్వ బాలికల పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు, మర్కజీ పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులను ఢిల్లీకి తీసుకెళ్లడంతో సదరు సంస్థ వ్యవహారం వెలుగుచూసిందన్నారు. దీనిపై లష్కర్‌బజార్ పాఠశాల హెచ్‌ఎం శైలజ పోలీసులకు ఫిర్యాదు చేశారని విజయ్‌కుమార్ తెలిపారు. విద్యార్థులను క్షేమంగా అప్పగించేలా చర్యలు తీసుకోవాలని హన్మకొండ ఏసీపీ జితేందర్‌రెడ్డిని కోరినట్టు పేర్కొన్నారు. ఈ విషయమై ఏసీపీ రవీందర్‌ను వివరణ కోరగా సదరు సంస్థపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

# ముగ్గురిని బలిగొన్న ఈత సరదా

సంగారెడ్డి జిల్లా అన్నారంలో విషాదం


మహిపాల్, సందీప్, పల్లవ్‌కుమార్ (ఫైల్)

**గుమ్మడిదల:** ఈత సరదా ముగ్గురు చిన్నారులను బలిగొన్నది. ఈ విషాదఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అన్నారంలో మంగళవారం చోటుచేసుకున్నది. ఎస్సై రాజేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అన్నారం గ్రామానికి చెందిన చింతగుడ్డి భీమయ్య కొడుకు మహిపాల్(13), మేరీపాల్ కుమారుడు కే సందీప్(13), సూరారం గ్రామానికి చెందిన పల్లవ్‌కుమార్(13)తోపాటు మరో ముగ్గురు స్నేహితులు తరుణ్, రిత్విక్, దినేశ్ దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలోని కేంద్రీయ విద్యాలయంలో ఎనిమిదో తరగతి చదువుతున్నారు. మంగళవారం పాఠశాలకు సెలవు ప్రకటించడంతో ఆరుగురు సమీపంలోని కొత్తకుంట చెరువులో సరదాగా ఈత నేర్చుకునేందుకు వెళ్లారు. మొదట సందీప్ నీటిలోకి దిగగా ప్రమాదవశాత్తు మునిగిపోతుండగా పక్కనే ఉన్న మహిపాల్, పల్లవ్‌కుమార్‌లు సందీప్‌ను రక్షించడానికి ప్రయత్నించినప్పటికీ ముగ్గురూ మునిగిపోయారు. గమనించిన స్నేహితులు తరుణ్, రిత్విక్, దినేశ్‌లు రక్షించండి అని కేకలు వేయడంతో సమీపంలోని ఇటుకబట్టీలో పనిచేస్తున్న కూలీలు వచ్చి నీటిలోకి దిగి ఆ ముగ్గురిని బయటకు తీశారు. కాగా వారు అప్పటికే ప్రాణాలు విడిచారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాలను పటాన్‌చెరు ప్రభుత్వదవాఖానకు తరలించారు. మృతుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రాజేశ్‌కుమార్ తెలిపారు.

## రామాలయ పునర్నిర్మాణానికి నిధులివ్వండి

సీఎంను కోరిన ఖేడ్ మున్సిపల్ చైర్‌పర్సన్ రుబినాబేగం


రుబినాబేగం నజీబ్

**నారాయణఖేడ్, నమస్తే తెలంగాణ:** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో రామమందిర పునర్నిర్మాణానికి నిధులు ఇవ్వాలని ఖేడ్ మున్సిపల్ చైర్‌పర్సన్ రుబినాబేగం సీఎం కేసీఆర్‌ను కోరారు. మంగళవారం ఆమె నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితోకలిసి ప్రగతిభవన్‌లో సీఎంకు వినతిపత్రం సమర్పించారు. వంద ఏండ్లకుపైగా చరిత్ర కలిగిన ఆలయాన్ని పునర్నిర్మించాలని పట్టణ ప్రజలు ఆకాంక్షిస్తున్న నేపథ్యంలో ఇందుకోసం రూ.3 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## చెట్టు కింద సేదతీరుతూ వృద్ధురాలు మృతి

**కంది:** భూ సమస్యను పరిష్కరించాలని ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించిన ఓ వృద్ధురాలు.. అక్కడే ఓ చెట్టుకింద కొద్దిసేపు సేదదీరి.. అంతలోనే సొమ్మసిల్లి కన్నుమూసింది. సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం సైబాన్‌పేటకు చెందిన రుక్కమ్మ (68) గ్రామంలో ఒంటరిగా ఉంటున్నది. భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఆమె సంగారెడ్డిలోని ఆర్డీవో కార్యాలయానికి వచ్చింది. కార్యాలయంలో వినతి పత్రమిచ్చి బయటకు వచ్చి అక్కడే చెట్టు కింద కొద్దిసేపు సేదతీరింది. కూర్చున్న చోటే సొమ్మసిల్లి పడిపోవడంతో పక్కనే ఉన్నవారు 108కు సమాచారం అందించగా స్థానిక దవాఖానకు తరలించారు. అప్పటికే రుక్కమ్మ మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఫిట్స్ రావడంతోనే ఆమె మృతి చెందినట్టు వైద్యులు పేర్కొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ సుబ్రహ్మణియన్

## ఐటీ వినియోగంలో సింగరేణి దేశంలోనే టాప్

డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఆర్ సుబ్రహ్మణియన్

**హైదరాబాద్/మంచిర్యాల ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** ఐటీ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) వినియోగంలో సింగరేణి దేశంలోనే అగ్రగామిగా ఉన్నదని, అదే సమయంలో బొగ్గు ఉత్పత్తి, టర్నోవర్ సాధించడంలోనూ ఆదర్శంగా నిలుస్తున్నదని డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఆర్ సుబ్రహ్మణియన్ అన్నారు. హైదరాబాద్‌లోని విశ్వేశ్వరయ్యభవన్‌లో మంగళవారం నిర్వహించిన.. 'మైనింగ్‌లో ఐటీ వినియోగం - ముందడుగు' సదస్సులో ఆయన ప్రసంగించారు. రానున్నకాలంలో ఐటీ వినియోగాన్ని విస్తృత పరుస్తూ, అత్యాధునిక టెక్నాలజీతో ఉత్పత్తులు సాధిస్తూ 2024 నాటికి 100 మిలియన్ టన్నుల లక్ష్యం సాధించాలని ఆకాంక్షించారు. డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) ఎస్ శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కోల్ ఇండియా కంపెనీల ప్రతినిధులు, సింగరేణి డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా మందమర్రిలోని ట్రైనింగ్ సెంటర్‌ను హైదరాబాద్ నుంచి రిమోట్ ద్వారా సుబ్రహ్మణియన్ ప్రారంభించారు.

## పోలీస్ స్టేషన్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం

**పరిగి రూరల్ :** పోలీస్‌స్టేషన్‌లో యువకుడు ఆత్మహత్యకు యత్నించిన ఘటన వికారాబాద్ జిల్లా పరిగిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన హరినాథ్‌ను దోమ మండలంలోని ఓ బాలిక మిస్సింగ్ కేసులో పరిగి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. దీంతో ఆ యువకుడు తన వద్ద ఉన్న పదునైన వస్తువుతో మణికట్టు వద్ద కోసుకున్నాడు. అప్రమత్తమైన పోలీసులు ఆ యువకుడిని స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. బాలిక గత నాలుగు నెలల క్రితం యువకుడితో ప్రేమాయణం కొనసాగించింది. జనవరి 27నుంచి బాలిక కనిపించక పోవడంతో ఈ నెల 3న ఆమె తల్లిదండ్రులు పరిగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఆ యువకుడు బాలికను పరిగి బస్టాండ్‌లో వదిలి వెళ్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హరినాథ్‌పై కిడ్నాప్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో, లైంగికదాడి కేసులను నమోదు చేశామని పరిగి ఎస్సై శ్రీశైలం తెలిపారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

# నవదంపతుల బలవన్మరణం

- ఇటీవలే పెద్దలను ఎదురించి ప్రేమవివాహం
- ఇంటికి వెళ్లలేకనే ఆత్మహత్య


స్వామి, ఉమారాణి (ఫైల్ )

**భువనగిరి అర్బన్:** పెద్దలను ఎదిరించి వివాహం చేసుకున్న ఓ జంట వారికి భయపడి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో ఓ హోటల్‌లో మంగళవారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం జంగారెడ్డిపల్లికి చెందిన ఆలకుంట్ల స్వామి(23), శివరాత్రి ఉమారాణి (19) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఒకే కులానికి చెందిన వారైనప్పటికీ పెద్దలు పెండ్లికి అంగీకరించలేదు. స్వామి ఘట్‌కేసర్ మండలం అన్నోజిగూడెంలో డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. ఉమారాణి పటాన్‌చెరులో తన అక్క వద్ద ఉంటున్నది. ఈ క్రమంలో ఈ నెల 14న స్వామి కుటుంబసభ్యులు అతడికి మరో అమ్మాయితో వివాహం నిశ్చయించారు. దీంతో ఆ పెండ్లి ఇష్టంలేని స్వామి.. ఉమారాణితో కలిసి ఘట్‌కేసర్ వెళ్లి అక్కడి దేవాలయంలో వివాహం చేసుకున్నారు. అనంతరం నవదంపతులు ఘట్‌కేసర్ పీఎస్‌కు వెళ్లి మైనార్టీ తీరడంతో ఇష్టపూర్వకంగానే పెండ్లి చేసుకున్నామని.. ఇరు కుటుంబాల నుంచి రక్షణ కల్పించాలని కోరారు. ఈ క్రమంలో ఉమారాణి కుటుంబసభ్యులు స్వామి ఇంటిపై దాడిచేశారు. దీంతో ఆందోళనకు గురైన దంపతులు ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. సోమవారం సాయంత్రం భువనగిరిలోని డాల్ఫిన్ హోటల్లో ఓ గదిని అద్దెకు తీసుకున్నారు. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. మంగళవారం ఉదయం వారు గదితలుపులు తెరవకపోవడంతో హోటల్ సిబ్బంది తెరిచి చూడగా దంపతులిద్దరూ అపస్మారకస్థితిలో పడిఉన్నారు. దీంతో వారిని స్థానిక ఏరియా దవాఖానకు తీసుకెళ్లగా స్వామి అప్పటికే మృతి చెందాడు. ఉమారాణి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించగా అక్కడ చికిత్సపొందుతూ ప్రాణాలు కోల్పోయింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## జేఈఎఫ్ ఆధ్వర్యంలో వరంగల్‌లో భరోసా కేంద్రం


షీ టీమ్స్ ఐజీ స్వాతీ లక్రాతో ఎంవోయూ కుదుర్చుకుంటున్న జేఈఎఫ్ ప్రతినిధులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జేఈఎఫ్ (జెమినీ ఎడిబల్స్ అండ్ ఫాట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్) సంస్థ వరంగల్‌లో మహిళలు, చిన్నారుల రక్షణ కోసం పోలీస్‌శాఖతో కలిసి భరోసా కేంద్రాన్ని ఏర్పాటుచేయనున్నది. ఈ మేరకు మంగళవారం జేఈఎఫ్ ప్రతినిధులు షీ టీమ్స్ ఐజీ స్వాతీ లక్రాతో ఎంవోయూ కుదుర్చుకొన్నారు. జీఈఎఫ్ ఇండియా.. తెలంగాణ పోలీసులకు పూర్తిస్థాయిలో సహాయ, సహకారాలు అందిస్తున్నదని, భరోసా కేంద్రంలో మహిళలకు వైద్య, న్యాయ, మానసిక సమస్యలపై సేవలను అందిస్తామని జేఈఎఫ్ ప్రతినిధులు చెప్పారు. కార్యక్రమంలో జేఈఎఫ్ వైస్ ప్రెసిడెంట్ అక్షయ్‌చౌదరి, సేల్స్,మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ పీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఆ ఘట్టానికే పట్టం



హామిల్టన్

## సచిన్‌ను భుజాన మోసిన క్షణాలకే లారెస్ అవార్డు

### 20 ఏండ్లలో అత్యుత్తమ క్రీడా సన్నివేశంగా ఎన్నిక..

### పురస్కారం అందుకున్న మాస్టర్ బ్లాస్టర్

**బెర్లిన్:** క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్‌ను భారత ఆటగాళ్లు భుజాలపై మోసిన క్షణాలే గత రెండు దశాబ్దాల్లో అత్యుత్తమ క్రీడా సన్నివేశంగా ఎంపికైంది. 2011 ప్రపంచకప్ గెలిచాక టీమ్‌ఇండియా ప్లేయర్లు మాస్టర్ బ్లాస్టర్‌ను గౌరవించిన విధానానికే ప్రతిష్ఠాత్మక లారెస్ బెస్ట్ స్పోర్టింగ్ మూవ్‌మెంట్ అవార్డు దక్కింది. 20ఏండ్లలో ఉత్తమ క్రీడా క్షణాల కోసం ప్రపంచ వ్యాప్తంగా ఓటింగ్ నిర్వహించగా.. క్రీడాభిమానులు సచిన్ టెండూల్కర్‌కే పట్టం కట్టారు. దీంతో మంగళవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ వా చేతుల మీదుగా లారెస్ బెస్ట్ స్పోర్టింగ్ మూవ్‌మెంట్ అవార్డును సచిన్ అందుకున్నాడు. 'ఆ క్షణాలు అపూర్వమైనవి. ప్రపంచ కప్ గెలిచామన్న అనుభూతి మాటల్లో వర్ణించలేనిది. ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా ఓ ఉత్సవం జరగడం చాలా అరుదు. దేశమంతా ఐక్యమై సంబురం జరుపుకునే సందర్భాలు చాలా తక్కువగా వస్తాయి. అలాంటిదే ప్రపంచ కప్ గెలుపు. క్రీడలు ఎంత శక్తిమంతమైనవో ఇలాంటి సందర్భాలు గుర్తు చేస్తాయి. ఇప్పటికీ ఆ క్షణాలు నాతోనే ఉన్నాయి' అని అవార్డు అందుకున్నాక మాస్టర్ బ్లాస్టర్ చెప్పాడు.

#### అప్పుడే నా ప్రయాణం మొదలైంది

తన చిన్నతనంలో భారత్ తొలి ప్రపంచకప్ గెలిచిన క్షణాలను టెండూల్కర్ గుర్తు చేసుకున్నాడు. 'నాకు పదేండ్లు ఉన్నప్పుడు 1983లో నా క్రికెట్ ప్రయాణం ప్రారంభమైంది. ఆ ఏడాదిలో భారత్ తొలిసారి ప్రపంచకప్ గెలిచింది. అది ఎంత గొప్పదో అప్పట్లో నాకు పూర్తిగా తెలియదు.. కానీ అందరూ సంబురాలు చేసుకుంటుంటే నేను భాగస్వామినయ్యా. ఎక్కడో దేశం గర్వించే ప్రత్యేకమైన విషయం జరిగిందని నాకు తెలుసు. ఏదో ఒకరోజు నేను ఆ అనుభవాన్ని పొందాలని నిశ్చయించుకున్నా. ఇలా నా క్రికెట్ ప్రయాణం మొదలైంది. 22ఏండ్ల కెరీర్‌లో ప్రపంచకప్‌ను చేతబట్టుకున్న క్షణాలే నాకు అత్యంత గర్వకారణమైనవి. దేశప్రజల తరపున నేను ఆ ట్రోఫీని అందుకున్నా' అని సచిన్ అన్నాడు. లారెస్ అవార్డు అందుకున్న వంద శతకాల వీరుడు టెండూల్కర్‌కు టీమ్ ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ శుభాకాంక్షలు తెలిపాడు. గొప్ప విజయం సాధించారని, దేశం గర్వించాల్సిన సందర్భం అంటూ ట్వీట్ చేశాడు.

#### మెస్సి, హామిల్టన్‌కి స్పోర్ట్స్‌మెన్ ఆఫ్ ది ఇయర్

బ్రిటన్ స్టార్ ఎఫ్1 రేసర్ లూయిస్ హామిల్టన్, ప్రపంచ అత్యుత్తమ ఫుట్‌బాల్ ఆటగాడు లియోనెల్ మెస్సీకి లారెస్ ప్రపంచ స్పోర్ట్స్‌మెన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు దక్కింది. సమాన ఓట్లు రావడంతో ఇద్దరూ విజేతలుగా నిలిచారు. 20ఏండ్ల అవార్డుల చరిత్రలో జ్యూరీ ఇద్దరిలో ఒకరిని ఎంపిక చేయలేకపోవడం ఇదే తొలిసారి. ఆరుసార్లు ఫిఫా ప్లేయర్ ఆఫ్ ఇయర్ మెస్సీ అవార్డుల ప్రదానోత్సవానికి వ్యక్తిగతంగా హాజరు కాలేకపోవడంతో వీడియో సందేశాన్ని పంపాడు.



లారెస్ అవార్డుతో సచిన్

## అవార్డుల జాబితా..

| | |
|---|---|
| స్పోర్ట్స్‌మన్ | లియోనెల్ మెస్సీ, లూయిస్ హామిల్టన్ |
| స్పోర్ట్స్‌వుమన్ | సిమోన్ బైల్స్ |
| టీమ్ | దక్షిణాఫ్రికా పురుషుల రగ్బీ టీమ్ |
| బ్రేక్‌త్రూ అవార్డు | ఎగాన్ బెర్నల్ |
| దివ్యాంగ క్రీడాకారుడు | ఒక్సానా మాస్టర్స్ |
| యాక్షన్ స్పోర్ట్స్‌పర్సన్ | కోల్ కిమ్ |
| లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు | దిర్క్ నోవిట్జ్కీ |

## ఆ క్షణం..చిరస్మరణీయం

(నమస్తే తెలంగాణ క్రీడా విభాగం)

2011 ఏప్రిల్ 2, ముంబైలోని వాంఖడే మైదానం. శ్రీలంకతో భారత్ ప్రపంచకప్ ఫైనల్. విశ్వటోర్నీ దక్కించుకునేందుకు టీమ్ ఇండియా 4పరుగుల దూరంలో ఉంది. లంక బౌలర్ కులశేఖర బౌలింగ్‌లో అప్పటి కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ మిడ్‌ఆన్ మీదుగా సిక్సర్ కొట్టి జట్టును గెలిపించాడు. ఆ క్షణం క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ రెండు చేతులు పైకెత్తి తన కల నెరవేరిందన్నట్టుగా డ్రెస్సింగ్ రూమ్‌లో అంతులేని ఆనందంతో సంబురాలు చేసుకున్నాడు. భావోద్వేగానికి లోనయ్యాడు. 22 ఏండ్ల కెరీర్‌లో అప్పటికే క్రికెట్ చరిత్రలో ఎన్నో రికార్డులను తన పేరిట లిఖించుకున్నా.. ఎన్నాళ్లో నిరీక్షించిన విశ్వకప్ కోరిక సొంతగడ్డపై తీరడంతో యువకుడై గంతులేశాడు. ఆ తర్వాత భారత ఆటగాళ్లంతా సచిన్ టెండూల్కర్‌ను భుజాన ఎత్తుకొని మైదానమంతా కలియతిరిగారు. భారత క్రికెట్‌ను ఇన్నేళ్లు భుజానమోసిన సచిన్‌ను గౌరవిస్తున్నామంటూ ఉత్సాహంగా చెప్పారు. ఈ క్షణాలు భారత క్రికెట్ అభిమానుల కండ్ల ముందు ఇప్పటికీ మెదులుతూనే ఉంటాయి. క్రికెట్ ఉన్నంత వరకు చిరస్మరణీయంగానే నిలిచిపోతాయి.

# సునీల్‌కు స్వర్ణం

### ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్



**న్యూఢిల్లీ:** సొంతగడ్డపై జరుగుతున్న ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్ సునీల్ కుమార్ దుమ్మురేపాడు. గ్రీకో రోమన్ విభాగంలో 27 ఏండ్ల నిరీక్షణకు తెరదించుతూ మనదేశం తరపున తొలి స్వర్ణం చేజిక్కించుకున్నాడు. మంగళవారం జరిగిన 87 కేజీల ఫైనల్లో సునీల్ 5-0తో అజత్ సాలిదినోవ్ (కిర్గిస్థాన్)పై విజయం సాధించాడు. గత చాంపియన్‌షిప్ ఫైనల్లో ఓడి రజతంతో సరిపెట్టుకున్న సునీల్.. ఈసారి 'పట్టు' వదల్లేదు. ప్రత్యర్థికి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా విజృంభించి పసిడి పతకం ఖాతాలో వేసుకున్నాడు. అంతకుముందు సెమీస్‌లో సునీల్ 12-8తో అజ్మత్ (కజకిస్థాన్)పై గెలిచి తుదిపోరుకు అర్హత సాధించాడు. మరో భారత బాక్సర్ అర్జున్ హలక్కురి (55 కేజీలు) కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. సెమీస్‌లో 7-8తో నాసెర్‌పౌర్ (ఇరాన్) చేతిలో ఓడిన అర్జున్.. అనంతరం జరిగిన కాంస్య పోరులో కొరియాకు చెందిన డాంగియోక్‌పై నెగ్గాడు. ఇతర విభాగాల్లో సచిన్ రాణా 0-8తో ఎల్‌మురాత్ (ఉజ్బెకిస్థాన్) చేతిలో.. సజన్ 6-9తో రేనత్ ఇలియాజులు (కిర్గిస్థాన్) చేతిలో ఓడారు. భారత్‌లో కరోనా వైరస్ ప్రభావం లేకున్నా.. పోటీలు జరుగుతున్న కేడీ జాదవ్ ఇండోర్ స్టేడియంలో జపాన్, కొరియా, చైనీస్ తైపీకి చెందిన కొందరు రెజ్లర్లు ముఖాలకు మాస్కులు ధరించారు.

# ఐపీఎల్ @57 రోజులు

### 13వ సీజన్ షెడ్యూల్ విడుదల.. చెన్నై, ముంబై మధ్య తొలి మ్యాచ్



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 13వ సీజన్ షెడ్యూల్ విడుదలైంది. సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు వంటి ఫ్రాంచైజీలు ఇప్పటికే తమ జట్లు ఆడనున్న మ్యాచ్‌లను ట్విట్టర్ ద్వారా విడుదల చేయగా.. మంగళవారం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధికారికంగా షెడ్యూల్‌ను ప్రకటించింది. మార్చి 29న ప్రారంభమయ్యే ఈ సీజన్ మే 24తో ముగియనుంది. ఇప్పటి వరకు నిర్వహించిన అన్నీ సీజన్‌లతో పోలిస్తే ఈసారి ఐపీఎల్ సుదీర్ఘంగా (57 రోజుల పాటు) సాగనుంది. 2019 సీజన్ 51 రోజుల్లో ముగియగా.. 13వ సీజన్ మరో ఆరు రోజులు ఎక్కువ జరుగనుంది. వారాంతాల్లో రెండు మ్యాచ్‌ల ఆనవాయితీకి స్వస్తి పలికిన నిర్వాహకులు.. ఆదివారం మాత్రమే 'డబుల్ మ్యాచ్'లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అయితే ఆట ఆరంభ సమయాల్లో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదు. ఎప్పట్లాగే మ్యాచ్‌లు రాత్రి 8 గంటలకే ప్రారంభం కానున్నాయి. రెండు మ్యాచ్‌లు జరుగనున్న ఆరు ఆదివారాలు మాత్రమే తొలి మ్యాచ్ సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానుంది. 7.30 గంటలకే మ్యాచ్‌లు మొదలవుతాయని వార్తలొచ్చినా.. నిర్వాహకులు వాటిని కొట్టిపారేశారు. మొత్తం ఎనిమిది ఫ్రాంచైజీలు సొంతగడ్డపై 7.. ఇతర వేదికలపై ఏడు మ్యాచ్‌లు ఆడనున్నాయి. వాంఖడేలో జరుగున్న లీగ్ ఆరంభం మ్యాచ్‌లో గతేడాది ఫైనల్ ఆడిన చెన్నై సూపర్ కింగ్స్, డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్ తలపడనున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ తొలి మ్యాచ్‌లో సొంతగడ్డపై ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది.

# వెబ్ సిరీస్‌లో యువీ



**గువాహటి:** మెరుపు బ్యాటింగ్, ఫీల్డింగ్‌తో దశాబ్దానికి పైగా అభిమానులను అలరించిన టీమ్‌ఇండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ నటనతోనూ మెప్పించేందుకు సిద్ధమవుతున్నాడు. తన సోదరుడు జొరావర్ సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఓ వెబ్ సిరీస్‌లో యువరాజ్ సతీసమేతంగా కనిపించనున్నాడు. అసోంకు చెందిన డ్రీమ్ హౌస్ ప్రొడక్షన్స్ ఈ వెబ్ సిరీస్‌ను రూపొందిస్తుండగా.. యువీ తల్లి షబ్నమ్ సింగ్ సైతం నిర్మాణంలో భాగస్వామి కావడం విశేషం. ఈ విషయాన్ని డ్రీమ్‌హౌస్‌కు చెందిన నీతా శర్మ మంగళవారం వెల్లడించింది. యువీ తమ బ్యానర్‌లో నటిస్తుండడం గౌరవంగా భావిస్తున్నామని హర్షం వ్యక్తం చేసింది. వెబ్‌సిరీస్‌లో భాగమవడంపై సంతోషంగా ఉందని యువరాజ్ తల్లి షబ్నమ్ చెప్పారు. యువీ గతేడాది జూన్‌లో క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే.

# మన్‌ప్రీత్ సారథ్యంలోనే..

### ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రో లీగ్‌లో భారత్ మూడో పోరుకు సిద్ధమైంది. తొలి 'టై'లో ప్రపంచ మూడో ర్యాంకర్ నెదర్లాండ్స్‌ను చిత్తుచేసిన భారత్.. మలిపోరులో ప్రపంచ చాంపియన్ బెల్జియంపై ఓ మ్యాచ్ గెలిచి మరో మ్యాచ్‌లో ఓడింది. ఇక ముచ్చటగా మూడో 'టై'లో ప్రపంచ రెండో ర్యాంకర్ ఆస్ట్రేలియాతో తలపడనుంది. దీని కోసం హాకీ ఇండియా (హెచ్ఐ) మంగళవారం 24 మందితో కూడిన జట్టును ప్రకటించింది. ఈ జట్టుకు మన్‌ప్రీత్ సింగ్ సారథిగా.. హర్మన్‌ప్రీత్ సింగ్ ఉపసారథిగా వ్యవహరించనున్నారు. పీఆర్ శ్రీజేశ్, కృషన్ పాఠక్ గోల్ కీపింగ్ బాధ్యతలు మోయనున్నారు. భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియం వేదికగా శుక్ర, శనివారాల్లో జరుగనున్న రెండు మ్యాచ్‌ల్లో భారత జట్టు ఆసీస్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. గత రెండు 'టై'ల్లో సత్తాచాటిన ఆటగాళ్లు ఆసీస్‌పై కూడా అదే జోరు కనబరిస్తే.. భారత్‌కు తిరుగుండదని కోచ్ గ్రహమ్ రీడ్ పేర్కొన్నాడు.

# కోహ్లీని ఔట్ చేసేందుకు ఆగలేకున్నా

**వెల్లింగ్టన్:** టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీని ఔట్ చేసేందుకు వేచి చూడలేకున్నానని న్యూజిలాండ్ స్టార్ పేసర్ ట్రెంట్ బౌల్ట్ అన్నాడు. గాయం కారణంగా భారత్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌లకు దూరమైన అతడు.. టెస్టు జట్టుకు ఎంపికయ్యాడు. కుడిచేతి గాయంతో ఆరు వారాలుగా ఆటకు దూరం కాగా, శుక్రవారం భారత్‌తో ప్రారంభమయ్యే తొలి టెస్టులో బౌల్ట్ బరిలోకి దిగనున్నాడు. 'విరాట్ కోహ్లీ లాంటి బ్యాట్స్‌మెన్‌ను ఔట్ చేసేందుకు, నన్ను పరీక్షించుకునేందుకే నేను ఆడతా. అందుకే, వేచిచూడలేకున్నా. కోహ్లీ ఎంత గొప్ప ఆటగాడో అందరికీ తెలుసు' అని బౌల్ట్ మంగళవారం చెప్పాడు. గత టెస్టు సిరీస్‌లో ఆస్ట్రేలియా చేతుల్లో కివీస్ 0-3తో ఘోర పరాజయాన్ని చవిచూసింది. అయితే, ఆ పరాజయం తమకు పాఠాలు నేర్పిందని, భారత్‌పై సత్తా చాటుతామని బౌల్ట్ చెప్పాడు.



బౌల్ట్

# గచ్చిబౌలిలో జాతీయస్థాయి పోటీలు నిర్వహించండి

### క్రీడామంత్రి కిరణ్‌కు ఉపరాష్ట్రపతి వెంకయ్య సూచన



మంగళ వారం ఢిల్లీలోని తన నివాసంలో కేంద్రక్రీడాశాఖ మంత్రి కిరణ్ రిజిజుతో చర్చిస్తున్న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**ఢిల్లీ:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ర్టాల్లో క్రీడా వసతులపై మంగళవారం ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు.. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, అధికారులతో సమీక్షించారు. తెలుగు రాష్ర్టాల్లో క్రీడా ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేయాలని ఈ సందర్భంగా క్రీడా మంత్రి కిరణ్‌కు ఉపరాష్ట్రపతి సూచించారు. క్రీడాభివృద్ధిలో భాగంగా ప్రైవేట్ రంగాన్ని భాగస్వాముల్ని చేయాలని, కాలేజీలు, వర్సిటీలు ఆటలను ప్రోత్సహించేలా చూడాలన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో క్రీడా వసతులపై ఆరా తీసిన వెంకయ్యనాయుడు..సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. గచ్చిబౌలి వేదికగా జాతీయ స్థాయి పోటీలు నిర్వహించాలని మంత్రికి వివరించారు

# ప్రీక్వార్టర్స్‌లో సానియా జోడీ



**దుబాయ్:** గాయం నుంచి కోలుకున్న భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా దుబాయ్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌ను విజయంతో ప్రారంభించింది. మంగళవారం జరిగిన మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో సానియా - కరోలిన్ గ్రేసియా (ఫ్రాన్స్) జోడీ 6-4, 4-6, 10-8తేడాతో కుద్రవత్సేవ (రష్యా)-స్రెబోట్నిక్ (స్లోవేనియా) ద్వయంపై విజయం సాధించింది. ప్రీక్వార్టర్స్‌లో సానియా జోడీ.. ఐదో సీడ్ సైసై జెంగ్ (చైనా) - బార్బోరా క్రెజిసికోవా (చెక్ రిపబ్లిక్)తో తలపడనుంది.

# ఫైనల్ నవీ ముంబైలో

### ఫిఫా బాలికల ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల



**న్యూఢిల్లీ:** బాలికల అండర్-17 పుట్‌బాల్ ప్రపంచకప్‌నకు భారత్ ఆతిథ్యమివ్వనున్నది. ఈ ఏడాది చివర్లో జరుగనున్న ఫిఫా వరల్డ్‌కప్ షెడ్యూల్‌ను మంగళవారం కేంద్ర క్రీడల మంత్రి కిరణ్ రిజిజు విడుదల చేశారు. మొత్తం ఐదు నగరాల్లో మ్యాచ్‌లు జరుగుతాయని, అహ్మదాబాద్, భువనేశ్వర్, గువాహటి, కోల్‌కతాలో లీగ్ మ్యాచ్‌లు.. నవీ ముంబైలో ఫైనల్ నిర్వహించనున్నట్లు ఆయన స్పష్టంచేశారు. 'భారత్‌లో మరో ప్రతిష్ఠాత్మక టోర్నీ జరుగనుంది. మన అమ్మాయిలు తొలిసారి ఫిఫా ప్రపంచకప్ ఆడుతున్నారు. ఇది దేశానికి గర్వకారణం. మనమంతా కలిసి టోర్నీని విజయవంతం చేద్దాం' అని రిజిజు పిలుపునిచ్చారు. 'కలల్ని కొల్లగొట్టండి' (కిక్ ఆఫ్ ద డ్రీమ్) అనే నినాదంతో నిర్వహించనున్న ఈ టోర్నీ కోసం ఏర్పాట్లు ముమ్మరం చేశామని ఆయన అన్నారు. ఈ టోర్నీ నవంబర్ 2న ప్రారంభమై.. 21న జరిగే ఫైనల్‌తో ముగియనుంది.

# పూనమ్ పంజా..

### ప్రాక్టీస్ మ్యాచ్‌లో విండీస్‌పై భారత్ విజయం.. మహిళల టీ20 ప్రపంచకప్

**బ్రిస్బేన్:** లెగ్‌స్పిన్నర్ పూనమ్ యాదవ్ (3/20) విజృంభించడంతో వెస్టిండీస్‌తో జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు రెండు పరుగుల తేడాతో గెలుపొందింది. టీ20 ప్రపంచకప్ ఆరంభానికి ముందు నిర్వహించిన వామప్ మ్యాచ్‌ల్లో పాకిస్థాన్‌తో జరగాల్సిన తొలి పోరు వర్షం కారణంగా రద్దు కాగా.. రెండో మ్యాచ్‌లో మనవాళ్లు ఆకట్టుకున్నారు. తొలుత తక్కువ పరుగులే చేసిన హర్మన్‌ప్రీత్ బృందం.. చక్కటి బౌలింగ్‌తో స్వల్ప లక్ష్యాన్ని కాపాడుకున్నది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన భారత మహిళల జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లకు 107 పరుగులు చేసింది. శిఖ పాండే (24) టాప్ స్కోరర్. ఓ మోస్తారు లక్ష్యాన్ని అలవోకగా ఛేదిస్తుందనుకున్న విండీస్ జట్టు ఒత్తిడికి లోనై.. 20 ఓవర్లలో 7 వికెట్లకు 105 పరుగులకే పరిమితమైంది. శుక్రవారం మెగా టోర్నీ ప్రారంభం కానుండగా.. తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో భారత్ తలపడనుంది.

